


తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

వరంగల్

fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

6-11-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 277 పేజీలు: 8+16 వెల: 6.50

'24 గంటలు'పై వాద్దు దాటొద్దు: సుప్రీం

అమెరికా చట్టసభల్లో 30 మంది ప్రవాస భారతీయులు

5

'సర్'పై చర్చకు ప్రత్యేక సెషన్!

అసత్యాలు ఆపి.. సభలో చర్చిద్దాం రండి

హర్యానా ర్యాలీలో రాహుల్‌కు అమిత్‌షా సవాల్

5



ఇందిరమ్మ ఇళ్లలో దీపావళి

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహణకు కేబినెట్ నిర్ణయం

లబ్ధిదారులతో కలసి మంత్రులు, ఎమ్మెల్యేలు దీపావళి రోజున సంబురాలు

సీనియర్ మంత్రులకు గ్లోబల్ సమ్మిట్ నిర్వహణ బాధ్యత

19న సిద్దిపేటలో సభ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

ఎస్సీ, ఎస్టీ కమిషన్లు వేర్వేరుగా ఏర్పాటు

జ్యుడీషియల్‌లో 136 పోస్టులు: కేబినెట్ నిర్ణయాలు వెల్లడించిన మంత్రి పొంగులేటి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు 5: ప్రపంచ దేశాలతో పోటీ పడేలా తెలంగాణ ప్రభుత్వ పారిశ్రామిక విధానాలు ఉంటాయని రెవెన్యూ,గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రపంచ దేశాల నుంచి ఈసారి అత్యధిక పెట్టుబడులు వస్తాయని భావిస్తున్నట్లు తెలిపారు. రైజింగ్ తెలంగాణను మరింత ముందుకు తీసుకెళ్తామన్నారు. >>2



గురువారం సచివాలయంలో కేబినెట్ నిర్ణయాలు మీడియాకు వెల్లడిస్తున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. చిత్రంలో మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్

నెలాఖరులో అసెంబ్లీ

కాళేశ్వరంపై ప్రత్యేక సమావేశాలు

7



గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై గురువారం నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సిఎం రేవంత్. చిత్రంలో డి.సిఎం భట్టి, మంత్రి ఉత్తమ్

15లోగా సమ్మిట్ పూర్తి ప్రణాళిక

రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, ఫార్మా

లైఫ్‌సైన్స్ ఎక్స్‌పో సమ్మిట్‌లో ప్రధాన ఆకర్షణలు

డిసెంబరు 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్

అంతర్జాతీయ ప్రతినిధులకు ఏర్పాట్లు, భద్రత, ప్రదర్శనల నిర్వహణకు అధికారులతో 10 కమిటీలు


సమ్మిట్ ఏర్పాట్లపై సమీక్ష జరిపిన సిఎం రేవంత్

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 ఏర్పాట్లపై ముఖ్య మంత్రి ఎ. రేవంత్ రెడ్డి గురువారం సచివాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబర్ 7 నుంచి 9వ తేదీ వరకు భారత్ ఫ్యూచర్ సిటీలోని యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించనున్న సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిని >>2

7 రాష్ట్రాల్లో ఎస్ఎస్ఆర్

అర్హులను ఓటర్ల జాబితాలో చేర్చడమే లక్ష్యం: ఇసి

ఒక వ్యక్తి ఐదుకంటే ఎక్కువ అభ్యంతరాలిస్తే సిఇఒలు స్వయంగా పరిశీలించాలని ఆదేశం



న్యూఢిల్లీ, నవంబరు 5: ఏడురాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ స్పెషల్ సమ్మరీ రివిజన్ చేపట్టనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం గురువారం ప్రకటించింది. అరుణాచల్ ప్రదేశ్, చండీగఢ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ అండ్‌డయ్యూ, మిజోరం, ఒడిశా,సిక్కిం రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఈ ప్రక్రియ నిర్వహించనుంది. అర్హులైన ఓటర్లంద రికీ ఓటరు జాబితాలో చోటు కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని ఎన్నికల సంఘం వెల్లడించింది. ముఖ్యంగా యువ ఓటర్లు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోనున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించనుంది. 2027 ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1 తేదీల నాటికి ఓటు నమోదు చేసుకునేందుకు అర్హత పొందేవారు ముందుగానే దరఖాస్తు >>2

ఎపిలో జడ్పీటీసి ఎన్నికలు

ఉద్రిక్తం

పెట్రోల్ బాంబులు.. రాళ్ల దాడులతో దద్దరిల్లిన పల్లెలు

పులివెందుల, నవంబరు 5 ప్రభాతవార్త: పులివెందుల జడ్పీటీసీ ఎన్నికల సందర్భంగా నియోజక వర్గంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెల కొన్నాయి. గురువారం జరిగిన పోలింగ్ సమయంలోపలు గ్రామాల్లో >>2





భారతరత్న భూపేన్ హాజారికా వర్ధంతి సందర్భంగా గురువారం గువాహతిలో ఆయన విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నిపుణుల సూచనల మేరకే

3 బ్యారేజీల పునరుద్ధరణ

డిసెంబరులో పనులు ప్రారంభించేలా ఏర్పాట్లు

దేవాదుల, సీతారామ ఎత్తిపోతల ద్వారా దిగువ గోదావరి జలాల సద్వినియోగం: సమీక్షలో సిఎం రేవంత్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, నవంబరు5: కేంద్ర ప్రభుత్వ సంస్థలు, డ్యామ్ సేఫ్టీ నిపుణుల సూచనల ప్రకారమే కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దెబ్బతిన్న మూడు బ్యారేజీలను సురక్షి తంగా తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేందుకు అవసరమైన చర్యలపై మంత్రులు, నీటిపారుదల శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహిం చారు. గత ప్రభుత్వం చేసిన తప్పులు పునరావృతం కాకుండా ప్రాజెక్టును కాపాడాల్సి న బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు.మేడిగడ్డ వద్ద నీళ్లున్నా వాటిని లిఫ్ట్ చేయడం లేదనే తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలని మంత్రులకు సూచించారు. అక్కడ కనిపించే నీటిని ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో సాంకేతికంగా లిఫ్ట్ చేయడం సాధ్యం కాదని నీటిపారుదల శాఖ ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. మేడిగడ్డ నుంచి లిఫ్ట్ చేసిన నీళ్లు ఎల్లంపల్లికి చేరాలం టే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను మూసివేయాల్సి ఉంటుందని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. నిర్మాణ లోపాలున్న అన్నారం, సుందిళ్ల బ్యారేజీల గేట్లను తెరిచే ఉంచాలని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించిన విషయాన్ని గుర్తుచేశారు.దిగువ గోదావరి నీరు వృథాగా పోకుండా దేవాదుల, సీతారామ ఎత్తిపోతల పథకాల ద్వారా గతంలో ఎన్నడూ లేని విధంగా నీటిని లిఫ్ట్ చేసినట్లు ముఖ్యమంత్రి చెప్పారు. దీంతో ఉమ్మడి వరంగల్, నల్గొండ, ఖమ్మం జిల్లాల ఆయకట్టుకు సాగునీరు, తాగునీటిని అందించామన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ద్వారా ఏడాదికి సగటున 9.57 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేస్తే..ఈ మూడేండ్లలో సగటున 18.13 టీఎంసీల నీటిని లిఫ్ట్ చేసినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే 89 శాతం అధికంగా గోదావరి నీటిని వాడుకున్నట్లు వివరించారు. అక్టోబర్ నాటికి దేవాదుల ద్వారా 16.71 టీఎంసీలు, సీతారామ ద్వారా 8.10 టీఎంసీలు లిఫ్ట్ చేసి 24.81 టీఎంసీల గోదావరి జలాలను సద్వినియోగం చేసుకున్నామని వివరించారు.ఈ సమావేశంలో మూడు బ్యారేజీల పునరుద్ధరణకు రూపొందించిన ప్రణాళికను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు వివరించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో వ్యవసాయ విస్తీర్ణం పెరిగిందని, వరి దిగుబడిలో దేశంలోనే రికార్డు సాధించామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. గత ప్రభుత్వం చేసిన తప్పుల కారణం గానే మేడిగడ్డ కుంగిపోయిందని, బ్యారేజీల కుంగుబాటుకు దారితీసిన కారణాలను వివరించారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ నిర్మించి ప్రాణహిత ప్రాజెక్టును పూర్తి చేసి ఉంటే కరువు పరిస్థితుల్లోనూ ఇబ్బందులు ఉండేవి కావని, ప్రాణహిత నీటిని తక్కువ ఖర్చుతో ఎల్లంపల్లికి తీసుకువచ్చే అవకాశం ఉండేదని అన్నారు. బ్యారేజీల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి శ్రీధర్, టన్నెల్స్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరీక్షి త్ మెహ్రా, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

7 రాష్ట్రాల్లో ఎస్ఎస్ఆర్

>> చేసుకునే అవకాశం కల్పించనుంది. నవంబర్ 30న ముసాయిదా ఓటర్ల జాబితాను విడుదల చేయనుండగా, 2027 జనవరి 21న తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు. ఈ కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు తగిన సిబ్బంది, అవసరమైన వనరులను సమకూర్చాలని సంబంధిత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులను ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ ప్రక్రియ కోసం సిబ్బందిని సమకూర్చాలని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రధాన కార్యదర్శులకు ఈసీ లేఖ రాసింది. నకిలీ ఎంట్రీలు, ఒకే పేరుపై రెండు ఓట్లు ఉన్నట్లు వస్తున్న ఫిర్యాదులపై కచ్చితంగా క్షేత్రస్థాయిలో విచారణ జరపాలని ఈసీ స్పష్టం చేసింది. ఒక పోలింగ్ కేంద్రం పరిధిలో రెండు శాతానికి మించి ఓట్ల తొలగింపు ఉన్నా, లేదా ఒకే వ్యక్తి ఐదు కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసినా సిఇఒలు స్వయంగా వాటిని పరిశీలించాలని ఆదేశించింది. కొత్త ఓటరు నమోదు కోసం ఇచ్చే ఫారం 6 మార్పులు, చేర్పుల కోసం ఇచ్చే ఫారం 8లో ఆధార్ వివరాలు సమర్పించడం పూర్తిగా స్వచ్ఛందం అని ఈసీ స్పష్టం చేసింది. ఆధార్ వివరాలు ఇవ్వలేదనే కారణంతో ఏ ఒక్క దరఖాస్తునూ తిరస్కరించరాదని, ఇప్పటికే ఉన్న పేరును ఓటరు జాబితా నుంచి తొలగించరాదని పేర్కొంది.

ఒకే వ్యక్తి 5 కంటే ఎక్కువ అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు స్వయంగా వెళ్లి క్రాస్‌చెక్ చేయాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. వ్యాంగులు, యువ ఓటర్లు, ఓటర్ల జాబితాలో పేర్లు గల్లంతైన వారికి అవకాశం కల్పించనున్నారు. అర్హులైన దివ్యాంగులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానాల్లో ఓటరుగా నమోదు చేసుకోవచ్చని ఎన్నికల సంఘం ప్రకటించింది. ఓటర్ల నమోదు కోసం ఫారం6, ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు ఫారం7, నివాస మార్పు, ఓటర్ల జాబితాలో వివరాల సవరణ, ఓటరు గుర్తింపు కార్డు స్థానంలో కొత్త కార్డు పొందడం, దివ్యాంగ ఓటరుగా గుర్తింపు పొందడం వంటి సేవల కోసం ఫారం8 ఉపయోగించవచ్చని వివరించారు. ఓటర్లకు ఎన్నికల సేవలను మరింత చేరువ చేసేందుకు ఓటర్ సర్వీస్ పోర్టల్, హెల్ప్‌లైన్ నంబర్ 1950, ఈసీఐనెట్ యాప్ ద్వారా అందుబాటులో ఉన్న సౌకర్యాలను కూడా సమావేశంలో సమీక్షించారు.

ఇదిలా ఉండగా, ఈసీ ఐటీ విభాగానికి సంబంధించిన అంతర్గత రిపోర్టింగ్ నిర్మాణంలో వచ్చిన మార్పులపై ఓ అధికారి స్పష్టతనిచ్చారు. డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఎప్పుడూ డిప్యూటీ ఎలక్షన్ కమిషనర్ పర్యవేక్షణలోనే ఉన్నారని, ఆ నిబంధనలో ఎలాంటి మార్పు లేదని పేర్కొన్నారు.

ఇందిరమ్మ ఇంటిలో

దీపావళి జరుపుకుంటా

లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో పాలుపంచుకొంటా: సిఎం రేవంత్

హైదరాబాద్,నవంబరు5,ప్రభాతవార్త: 'పేదల సొంతింటి కల సాకారమైన వేళ, ఈ దీపావళి పండుగ శుభవేళ ఇందిరమ్మ ఇండ్లలో, లబ్ధిదారుల సొంతింటి సంతోషంలో.. నేను సైతం పాలుపంచుకోనున్నాను. ఈ దీపావళి సందర్భంగా, నేను ఇందిరమ్మ ఇంట్లో, లబ్ధిదారులతో కలిసి పండుగ జరుపుకోనున్నాను. రాష్ట్రవ్యాప్తంగాఉన్న ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు.. మీరు సైతం ఇందిరమ్మ ఇండ్లకు వెళ్లి లబ్ధిదారులతో కలిసి దీపావళి పండుగ జరుపుకోవాలని కోరుతున్నాను' అని ట్వీట్ చేశారు.

ఎన్నికలు ఉద్రిక్తం

>> టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణలు, రాళ్ల దాడులు చోటుచేసుకోవడంతో ఎన్నికల వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ఎర్రిపల్లెలో పెట్రోల్ బాంబులతో దాడులు జరగ్గా, మరికొన్ని గ్రామాల్లో ఇరువర్గాలు పరస్పరం రాళ్లు రువ్వుకున్నాయి. ఈ పరిణామాలతో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. కొంత మందికి గాయాలు అయ్యాయి. పులివెందుల మండల పరిధిలోని ఎర్రిపల్లె గ్రామంలో ఉదయం టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఈ క్రమంలో వైసీపీ వర్గీయులు పెట్రోల్ బాంబులు, టపాసులు పేల్చి టీడీపీ వర్గీయులపై విసిరారు.అయితే ఈఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. విషయం తెలిసి డీఎస్పీ మురళినాయక్ సిబ్బందితో కలిసి ఇరు వర్గాలపై లాఠీచార్జీ చేసి ఘర్షణను అదుపులోకి తెచ్చారు. అచ్చవెల్లి, రాగిమానిపల్లి గ్రామాల్లోనూ ఇరువర్గాల మధ్య రాళ్లదాడులు జరిగి ఉద్రిక్తత నెలకొంది.రెండు గ్రామాలలో పలువురికి చిన్న చిన్న గాయాలు అయ్యాయి. కొత్తపల్లి, మోటునూత నపల్లి గ్రామాల్లో సైతం ఘర్షణలు చోటుచేసుకు న్నాయి.ఇదిలా ఉండగా, తుమ్మలపల్లి గ్రామంలో టీడీపీ, వైసీపీ కార్యకర్తలు పరస్పరం రాళ్లదాడులకు దిగడంతో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టేందుకు ప్రయత్నించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వారం - వర్జ్యం

6-11-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయనం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె
తి.ద్వాదశి ఉ.10.32, న. హస్త తె.4.44
వ. మ.12.37-మ.2.16
దు.ఉ.8.24 - ఉ.9.10, మ.12.14-మ.12.59
రాహు. ఉ.10.30-12.00 వరకు
శుభ స : లేదు

వార్తాఫలం

మేషం : ఇతరులు ఇచ్చిన సలహాలను అమలు చేసే ముందు నిపుణులు ఇచ్చిన సలహాలు పరిగణలోనికి తీసుకోండి.

వృషభం : నిరుద్యోగులు ఉద్యోగం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుంది.

మిథునం : మీరు తన కోపమే తన శత్రువన్ని విషయాణాన్ని అనుభవ పూర్వర్వంగా గ్రహిస్తారు. ఆరోగ్య సమస్యలు ఎదురు అవుతాయి.

కర్కాటకం : ఇతరులకు ధన సహాయం చేసే విషయంలో కొంత మెలుకువ వహించండి. నూతన వస్తు లాభం .

సింహం : మీకు తెలియని కొత్త విషయాలను తెలుసుకుంతూరు. వ్యాపార సంబంధిత కార్యక్రమాల లో ఆటంకాలు ఎదురు అవుతాయి.

కన్య :మంచి మాటకారిగా వ్యవహరిస్తారు. లిటిగేషన్ వ్యవహారాలు సానుకూల పడతాయి. ప్రతి విషయంలోను జాగ్రత్త అవసరం.

తుల :ఉన్నతాధికారులతో మాట్లాడేటప్పుడు చాల జాగ్రత్త పాటించండి. నూతన వస్తువులు కొనుగోలు చేస్తారు.

వృశ్చికం : మీ గురించి చెడుగా ప్రచారం జరుగుతుంది. శారీరక శ్రమ మాత్రం తప్పదు. సోదరులను కలుస్తారు.

ధనుస్సు : ఆధ్యాత్మిక ప్రసంగాల పట్ల ఆకర్షియులవుతారు. కీలకమని భావించి అంశాలలో తొందరపాటు కుదరదు .

మకరం : మీకు రావాల్సిన బకాయిలు మొదలైన ఆర్థిక వ్యవహారాల పైన దృష్టిని కేంద్రీకరిస్తారు. ఖర్చులు పెరుగుతాయి.

కుంభం : పనులలో చిన్ని చిన్ని సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. శుభకార్య ప్రయత్నాలు ముమ్మరంగా సాగతాయి.

మీనం : ఓర్పు, నేర్పులతో కార్యక్రమాలను పూర్తి చేస్తారు. ప్రజ్ఞాపాటవాలు కనబరుస్తారు. కచ్చితమైన నిర్ణయలు తీసుకుంది.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

7, 8, 9 తేదీల్లో సిఎం కొడంగల్ పర్యటన

రూ.9,100 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు

రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో ప్రారంభం

హైదరాబాద్,నవంబరు5,ప్రభాతవార్త: ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నవంబర్ 7, 8, 9 తేదీల్లో మూడు రోజుల పాటు కొడంగల్ నియోజకవర్గంలో పర్యటించనున్నారు. మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభించడంతో పాటు రూ.9,100 కోట్లతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. పూర్తయిన భవనాల ప్రారంభోత్సవాల్లో పాల్గొంటారు.7వ తేదీ (శనివారం): ముఖ్య మంత్రి ఉదయం 10.30 గంటలకు హైదరాబాద్‌లోని డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి ఉదయం 11 గంటలకు వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం హాకీంపేట చేరుకుంటారు. ఉదయం 11.10 గంటలకు హాకీంపేటలో మెగా రైతు మేళా, ఇండస్ట్రియల్ ఎక్స్‌పోను ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రదర్శన స్టాళ్లను సందర్శిస్తారు. మధ్యాహ్నం 12 నుంచి ఒంటి గంట వరకు ఆదర్శ రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ముఖాముఖి సమావేశంలో పాల్గొంటారు. ఒంటి గంట నుంచి 2 గంటల వరకు పారిశ్రామికవేత్తలతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3 గంటలకు హాకీంపేట నుంచి రోడ్డు మార్గంలో కొడంగల్ నివాసానికి బయలుదేరుతారు. రాత్రి కొడంగల్‌లో బస చేస్తారు.8వ తేదీ (ఆదివారం): ఉదయం 9.15 గంటలకు కొడంగల్ నివాసం నుంచి బయలుదేరి హాకీంపేట చేరుకుంటారు. 9.30 నుంచి 10.20 గంటల వరకు స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశమవుతారు. 10.20 గంటలకు పలు అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరిస్తారు. ఉదయం 10.30 కు లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.81 కోట్ల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన. ఉదయం 10.45 కు హాకీంపేటలో రూ.4 కోట్లతో నాట్కో సంస్థ సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలను ప్రారంభిస్తారు. ఉదయం 11 కు రూ.2.35 కోట్లతో నిర్మించిన హాకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. ఉదయం 11.30 గంటలకు బొంరాస్‌పేటలో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను, 11.45 గంటలకు రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను ప్రారంభిస్తారు.

మధ్యాహ్నం 12.15 గంటలకు కొడంగల్‌లో రూ.3.80 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు దుద్యాలలో రూ.3 కోట్లతో నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను, 1.15 గంటలకు రూ.12 కోట్లతో నిర్మించిన సమీకృత మండల కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు.మధ్యాహ్నం 1.40 గంటలకు కోస్గి మండలం నాచారం గ్రామంలో రూ.5,060 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న రేడియల్ రోడ్డు-2కు శంకుస్థాపన చేస్తారు. ఈ రహదారిని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద కొత్తవాల్‌గూడ నుంచి నాచారం వద్ద జాతీయ రహదారి 167ఎన్ వరకు నిర్మించనున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు కోస్గిలో రూ.6 కోట్లతో నిర్మించిన సైన్స్ మ్యూజియాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 2.45 గంటలకు దౌల్తాబాద్ మండలం బాలంపేటలో రూ.2.35 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు దౌల్తాబాద్‌లో రూ.4.79 కోట్లతో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ప్రారంభిస్తారు. అనంతరం కొడంగల్ నివాసానికి చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు.

రూ.9,053 కోట్లతో 13 అభివృద్ధి పనులు: ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా మొత్తం రూ.9,053.48 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 13 అభివృద్ధి పనులకు సంబంధించిన శంకుస్థాపనలు, శిలాఫలకాల ఆవిష్కరణలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

వీటిలో కొత్వాల్‌గూడ నుంచి నాచారం వరకు రూ.5,060 కోట్లతో రేడియల్ రోడ్డు-2, ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద రూ.1,410 కోట్లతో 223 కొత్త, అసంపూర్తి బీటీ రహదారుల పనులు, రూ.2,100 కోట్లతో ఎంఎన్‌కేఎల్ఐఎస్ రెండో దశ పనులు ఉన్నాయి.

విద్యా రంగంలో రూ.118.80 కోట్లతో 10 తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, రూ.123 కోట్లతో కొడంగల్‌లో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి సంబంధించిన పనులు ఉన్నాయి.

రూ.41.83 కోట్లతో కొడంగల్, కోస్గి, మద్దూరులో ఆధునిక బస్ స్టాండ్లు, రూ.20 కోట్లతో మద్దూరులో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (విఏిడి) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, రూ.20 కోట్లతో సమీకృత డివిజనల్ కార్యాలయ సముదాయం, రూ.59.30 కోట్లతో రహదారుల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. తిమ్మారెడ్డిపల్లిలో గురులోక మసంద్ ప్రభు మందిరం అభివృద్ధికి రూ.4.45 కోట్లు, కొడంగల్‌లో నిరంజన్ మఠం అభివృద్ధికి రూ.5.10 కోట్లు కేటాయించారు. హాకీంపేట ఇండస్ట్రియల్ కారిడార్‌లో రూ.10 కోట్లతో పర్యాటక హోటల్ నిర్మాణం, రూ.81 కోట్లతో ఎకోపామ్ పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయనున్నారు.రూ.46.08 కోట్లతో నిర్మించిన 10 భవనాల ప్రారంభం.రూ.46.08 కోట్లతో నిర్మాణం పూర్తి చేసుకున్న 10 ప్రభుత్వ భవనాలను ఈ పర్యటనలో ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. దుద్యాల సమీకృత మండల కార్యాలయ భవనం, కోస్గి సైన్స్ మ్యూజియం, హాకీంపేట జెడ్పీ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాలు, హాకీంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వీటిలో ఉన్నాయి. దుద్యాల, బొంరాస్‌పేట పోలీస్ స్టేషన్లు, బొంరాస్‌పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, కొడంగల్ పోలీస్ స్టేషన్, సర్కిల్ కార్యాలయం, దౌల్తాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, బాలంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. 9వ తేదీ (సోమవారం):- సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి కొడంగల్ నివాసం నుంచి హాకీంపేటకు బయలుదేరుతారు. రాత్రి 7 గంటల వరకు హాకీంపేటలో నిర్వహించే భారీ రైతు బహిరంగ సభలో పాల్గొని ప్రసంగిస్తారు. ఈ సభకు రంగారెడ్డి, వికారాబాద్, నారాయణపేట, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల, నాగర్‌కర్నూల్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల నుంచి దాదాపు 50 వేల మంది రైతులు హాజరయ్యేలా ఏర్పాట్లు చేస్తున్నారు.



గురువారం చెన్నైలో వైఎస్ అనిల్ రెడ్డి కుమార్తె శ్రేయ వివాహ వేడుకకు హాజరైన తమిళ సిఎం విజయ్, జగన్, కెటిఆర్, అదాని, త్రిష తదితరులు

కార్మికుల ఖాతాల్లో దీపావళి బోనస్.. రూ.419 కోట్ల విడుదల

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: సింగరేణి సంస్థ తన కార్మికులకు శుభవార్త తెలిపింది. దీపావళి సందర్భంగా మొత్తం 38 వేల మంది కార్మికులకు వారి బ్యాంకు ఖాతాల్లో పర్ఫార్మెన్స్ రిలేటెడ్ లింక్డ్ రివార్డు(పీఎల్ఆర్) బోనస్‌ను గురువారం జమ చేసింది. ఒక్కో కార్మికుడికి రూ.1,10,250 చొప్పున మొత్తం రూ.419 కోట్లను యాజమాన్యం విడుదల చేసింది. దసరా పండుగ సందర్భంగా సింగరేణి కార్మికులకు లాభాల వాటా కింద సగటున ఒక్కొక్కరికి రూ.1,53,912 చొప్పున ఇటీవల చెల్లించింది. తాజాగా ఈ బోనస్ చెల్లింపులు కార్మికుల్లో దీపావళి సంబరాలను మరింత పెంచనున్నాయి. కోల్ ఇండియాలో పనిచేస్తున్న కార్మికులందరితో పాటు, సింగరేణిలో 2025 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ వరకు రిటైర్ అయిన సుమారు 8,351 మంది కార్మికులకు కూడా బోనస్‌ను చెల్లించింది.

15లోగా సమ్మిట్ పూర్తి ప్రణాళిక

>> అధికారులు వివరించారు. సమ్మిట్ వేదిక, వివిధ హాల్స్, అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, కార్యక్రమాల నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మంత్రులకు, అధికారులకు పలు సూచనలు చేశారు.గ్లోబల్ సమ్మిట్‌కు హాజరయ్యే ప్రతి ప్రతినిధికి ఒక లైజనింగ్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ప్రతినిధులు విమానాశ్రయానికి చేరుకున్న వెంటనే రిజిస్ట్రేషన్, పాస్‌ల జారీ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన పూర్తి సమాచారాన్ని ముందుగానే ప్రతినిధులకు అందజేయాలన్నారు. సదస్సుకు వచ్చే ప్రముఖులు, అన్ని రంగాల ప్రతినిధులకు వేదికలోకి ప్రవేశించినప్పటి నుంచి తిరిగి వెళ్లే వరకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు, సమ్మిట్‌లో ప్రతి విభాగానికి ప్రత్యేక అధికారితోపాటు భద్రతా అధికారిని నియమించాలని సీఎం సూచించారు. గ్లోబల్ సమ్మిట్‌కు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను కూడా సమ్మిట్‌కు ఆహ్వానించాలని సూచించారు. పెట్టుబడి ఒప్పందాలు చేసుకునేందుకు, పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చే కంపెనీల ప్రతినిధులకు ప్రత్యేక ఆహ్వానాలు అందించాలన్నారు. నవంబర్ 15 నాటికి సమ్మిట్ ఏర్పాట్ల పూర్తి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు.గత ఏడాది తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌తో పోలిస్తే ఈసారి మరింత విస్తృతంగా ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. గతంలో ఒక ఎక్స్‌పో హాల్ ఉండగా ఈసారి ఆరు ప్రదర్శనశాలలు ఏర్పాటు చేస్తున్నారు.పెట్టుబడులు, పరిశ్రమలు, ఆధునిక సాంకేతికత, ఆవిష్కరణలు, ఉపాధి అవకాశాలకు ప్రాధాన్యమిస్తూ సమ్మిట్ కార్యక్రమాలను రూపొందించారు. సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్, స్టార్టప్ పెవిలియన్, ఫార్మా అండ్ లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, వ్యవసాయ అనుబంధ రంగాల ప్రదర్శన, తెలంగాణ పెవిలియన్, ఎడ్యుకేషన్ ఎక్స్‌పో, క్లైమేట్ కాంక్లేవ్‌ల ఏర్పాట్లను అధికారులు వివరించారు.రక్షా ఎక్స్‌పోలో రక్షణ, ఏరోస్పేస్, అంతరిక్షం, సైబర్ సెక్యూరిటీ రంగాలకు చెందిన ఆధునిక పరికరాలు, డ్రోన్లు, రోబోటిక్స్ ప్రదర్శించనున్నారు. వైమానిక విన్యాసాలు కూడా నిర్వహించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రక్షా ఎక్స్‌పోలో పాల్గొనేందుకు 575 సంస్థలను ఆహ్వానించగా, ఇప్పటివరకు 49 సంస్థలు ముందుకు వచ్చాయి. యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ రంగాలకు సంబంధించి ఇండియా జాయ్-2026 నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.స్టార్టప్‌ల కోసం ప్రత్యేక పెవిలియన్ ఏర్పాటు చేసి 136 స్టార్టప్‌ల ఆవిష్కరణలను ప్రదర్శించేలా ప్రణాళిక రూపొందించారు. తెలంగాణ ఇన్నోవేషన్ స్టార్టప్ ఛాలెంజ్‌లో భాగంగా వ్యవసాయం, విద్య, ఆరోగ్యం, ప్రభుత్వ భూముల పరిరక్షణ, ప్రజా మౌలిక సదుపాయాలకు సంబంధించిన సమస్యలకు సాంకేతిక పరిష్కారాలను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు నవంబర్ 20 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు.ఫార్మా, లైఫ్ సైన్సెస్ రంగాలకు సంబంధించి 60 కంపెనీల ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. వ్యవసాయం, అనుబంధ రంగాల పెవిలియన్‌లో ఆధునిక సాగు పద్ధతులు, వ్యవసాయ డ్రోన్లు, పాడి, మత్స్య, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు.తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చేనేత, బతుకమ్మ, కాకతీయుల శిల్పకళతోపాటు రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ ప్రణాళికలను ప్రతిబింబించేలా ప్రత్యేక తెలంగాణ పెవిలియన్ ఏర్పాటు చేస్తున్నారు.గ్లోబల్ సమ్మిట్‌లో పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం సూచించారు. మూడు రోజుల సమ్మిట్‌లో నాలుగు ప్రధాన హాళ్లలో 52 రంగాలవారీ సమావేశాలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందించినట్లు అధికారులు తెలిపారు. సమ్మిట్ నిర్వహణ కోసం 25 రంగాలవారీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దాదాపు 3,500 ఆహ్వానాలను పంపించారు. అంతర్జాతీయ ప్రతినిధుల ఆహ్వానాలు, వసతి, ప్రొటోకాల్, భద్రత, ప్రదర్శనల నిర్వహణ కోసం పది అధికారుల కమిటీలను ఏర్పాటు చేశారు.ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన మంత్రులు ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, డి. శ్రీధర్ బాబు, గడ్డం వివేక్ సభ్యులుగా ఉన్న మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాట్ల పురోగతిని ఎప్పటికప్పుడు సమీక్షి ంచాలని సీఎం సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే వాతావరణ మార్పులు, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు డిసెంబర్ 8న ప్రత్యేకంగా తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్ నిర్వహించనున్నారు.

ఈ సదస్సులో దాదాపు 200 మంది శాస్త్రవేత్తలు, రైతులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొననున్నారు. కరువును తట్టుకునే వ్యవసాయం, పశుసంరక్షణ, తాగునీటి భద్రత, అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షణ, అడవులు, జీవవైవిధ్య పరిరక్షణ, వ్యర్థాలను సంపదగా మార్చడం వంటి ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. వాతావరణ మార్పులపై గ్లోబల్ సమ్మిట్‌లో ప్రత్యేకంగా చర్చ జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఇప్పటికే వాతావరణ మార్పుల కారణంగా ఎదురవుతున్న సమస్యలను గుర్తించి తక్షణ చర్యలతోపాటు దీర్ఘకాలిక పరిష్కారాలను రూపొందించాలన్నారు. రాష్ట్రంలో కరువు, వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించే దిశగా ఈ సదస్సు నిర్ణయాత్మక పాత్ర పోషించాలని సీఎం అధికారులను ఆదేశించారు.ఈ సమావేశంలో సీఎం, డిప్యూటీ సీఎం తోపాటు మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయష్ రంజన్, గ్లోబల్ సమ్మిట్ అధికారుల కమిటీల సభ్యులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లలో

దీపావళి

>> గురువారం సాయంత్రం సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. అనంతరం కేబినెట్ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్‌లతో కలిసి మీడియాకు వివరించారు. గ్లోబల్ సమ్మిట్ నిర్వహణకు సీనియర్ మంత్రులకు బాధ్యతలు కేటాయించారని పేర్కొన్నారు. రెండో గ్లోబల్ సమ్మిట్‌పై సుదీర్ఘంగా చర్చించామని వెల్లడించారు. సమిట్ సందర్భంగా భారీ పెట్టుబడరులు పెట్టేందుకు ముందుకు వస్తారని విశ్వాసం ఉందన్నారు. కాళేశ్వరంలో నీళ్లు నిలపవద్దన్న ఎన్‌డిఎస్ఏ ఆదేశాలను అమలు చేశాం, ఎన్‌డిఎస్ఏ చెప్పిన అన్ని పరీక్షల్ని పూర్తి చేసి నివేదించాం, పారదర్శకంగా ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని నిర్ణయించాం అని వెల్లడించారు. దీపావళి సందర్భంగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి' కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని క్యాబినెట్ నిర్ణయించింది. మంత్రులు, ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 2,25,000 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తయింది. నిర్మాణం పూర్తయిన అన్ని ఇళ్లలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

నవంబర్ 7 నుంచి 9 వరకు కొడంగల్ నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొంటారని చెప్పారు.ఈనెల 9న కొడంగల్‌లో భారీ రైతు బహిరంగ సభ నిర్వహిస్తారు. ఈ సభలో ముఖ్యమంత్రి, మంత్రులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొంటారు. ఈనెల 19న మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకొని సిద్దిపేటలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తాం. అదే రోజు ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తాం.

నవంబర్ 20 నుంచి 30 వరకు రాష్ట్రంలోని ప్రతి గ్రామంలో ఇందిరమ్మ కమిటీలు ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబం నుంచి దరఖాస్తులు సేకరిస్తాయి. తహశీల్దార్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు వాటిని స్వీకరిస్తారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా వర్తిస్తుందని వివరించారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఉమ్మడి ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీలకు వేర్వేరుగా కమిషన్లు ఏర్పాటు చేయాలని తెలంగాణ క్యాబినెట్ నిర్ణయించింది. ఇందుకు సంబంధించి తెలంగాణ స్టేట్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ కాస్ట్స్ అండ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ యాక్ట్, 2003ను రద్దు చేసేందుకు ఆమోదం తెలిపింది. ప్రతి కమిషన్‌లో ఒక చైర్మన్, ఐదుగురు సభ్యులు ఉంటారు. ఎస్సీ, ఎస్టీల నుంచి వచ్చే ఫిర్యాదులను వేగంగా పరిష్కరించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఫైర్ సర్వీస్ యాక్ట్, 1999 సవరణకు సంబంధించిన ఆర్డినెన్స్ జారీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. అగ్ని ప్రమాదాల నివారణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడం, ప్రమాదాలకు కారణాలను గుర్తించడం, వేగంగా స్పందించడం వంటి అంశాలు ఇందులో ఉంటాయి. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, షాపింగ్ కాంప్లెక్స్‌ల యజమానులు తీసుకోవాల్సి న జాగ్రత్తలు, అగ్నిమాపక శాఖ చేపట్టాల్సి న చర్యలను ఇందులో పొందుపరుస్తారని వివరించారు.. తెలంగాణ సర్వే, సరిహద్దుల చట్టం, 1923లోని సెక్షన్ 12(ఏ) సవరణ ప్రతిపాదనకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. సర్వే, సరిహద్దులకు సంబంధించి జారీ చేసే నోటీసులపై అప్పీల్ చేసుకునే కాలపరిమితిని 60 రోజుల నుంచి 30 రోజులకు తగ్గించే ప్రతిపాదనకు ఆమోదం తెలిపిందన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారంలో కొత్తగా ఏర్పాటైన జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు, హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి కోర్టు కోసం 56 పోస్టుల మంజూరుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిందన్నారు.. అలాగే సిద్దిపేట, యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, మహబూబాబాద్ జిల్లా మహబూబాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని నాలుగు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కమ్ అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుల్లో వివిధ విభాగాలకు మరో 80 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మొత్తం 136 పోస్టుల మంజూరుకు మంత్రివర్గం ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు.

ఢిల్లీ నుంచి తిరిగి వస్తున్న కాంగ్రెస్ నాయకుల బస్సుపై రాళ్లదాడి

హైదరాబాద్, నవంబరు 5,ప్రభాతవార్త: ఢిల్లో కాంగ్రెస్ ఓట్ బచావో దేశ్ బచావో ర్యాలీలో పాల్గొని తిరిగి రాష్ట్రానికి వస్తున్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ప్రయాణించే బస్సుపై కామారెడ్డి జిల్లా టేక్రియాల్ వద్ద గుర్తుతెలియని వ్యక్తులు గురువారం రాళ్ళదాడి చేశారు. కార్వాన్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముహమ్మద్ బిన్ అలీ హాజి రాహుల్‌గాంధీ పిలుపుమేరకు తన అనుచరులతో ఢిల్లీకి ర్యాలీకోసం తరలివెళ్ళారు. దక్షిణ మధ్యరైల్వే రైళ్ళు కేటాయించపోవడంతో బస్సుల్లో ప్రయాణం అనివార్యంగా మారింది. కామారెడ్డి జిల్లా టేక్రియాల్ బ్రిడ్జి వద్దకు బస్సు రాగానే దాడి జరగడంతో బస్సు అద్దాలు పూర్తిగా పగిలి పోయాయి. రాళ్లదాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు దేవునిపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ దాడిని ఖండించారు. జిల్లా ఎస్‌పికి ఫోన్‌చేసి ఘటనపై సత్వరం విచారణ జరిపి బాధ్యులపై చర్యతీసుకోవాలని కోరారు. పోలీసులు వెంటనే కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

రియాద్ విమానాశ్రయంలో గాయపడిన కామారెడ్డి వాసి మృతి

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన దాడి ఘటనలో గాయపడి చికిత్స పొందుతున్న కామారెడ్డి వాసి మృతి చెందాడు. గత నెలలో రియాద్ విమానాశ్రయంపై జరిగిన దాడి ఘటనలో తీవ్రంగా గాయపడిన షేక్‌సయాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచాడు. మృతుడు కామారెడ్డి పట్టణంలోని సైలాన్ బాబా కాలనీకి చెందిన వ్యక్తిగా గుర్తించారు. సయాద్ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతుండగా, కాలనీలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఉపాధి కోసం విదేశాలకువెళ్ళిన సయాద్ మృత్యువాత పడ్డాడు. సౌదీ అరేబియాలోని రియాద్ విమానాశ్రయంపై గత నెలలో జరిగిన దాడి ఘటనలో తీవ్రంగా గాయపడటంతో షేక్ సయాద్ అక్కడ చికిత్సను అందించినప్పటికి 80శాతం కాలినగాయాలతో మృతి చెందాడు.

వైట్‌హౌస్‌లో అంతర్గత పోరు

రిపబ్లికన్ పార్టీ ఓటమిపై ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ సంచలన వ్యాఖ్యలు



వాషింగ్టన్, నవంబరు 5: అమెరికా మిడ్‌టర్మ్ ఎన్నికల ఫలితాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన నేతృత్వంలోని రిపబ్లికన్ పార్టీకి భారీ షాక్ ఇచ్చాయి. డెమొక్రటిక్ పార్టీ ప్రతినిధుల సభ, సెనెట్ రెండింటిలోనూ స్పష్టమైన మెజారిటీ సాధించడంతో వాషింగ్టన్ రాజకీయాల్లో పవర్ బ్యాలెన్స్ ఒక్కసారిగా మారిపోయింది. ఈ ఓటమి వైట్‌హౌస్ అంతర్గత విభేదాలను కూడా బయటపెట్టింది. ముఖ్యంగా ట్రంప్, ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ మధ్య అభిప్రాయభేదాలు ఇప్పుడు రచ్చకెక్కాయి. మధ్యంతర ఎన్నికల్లో రిపబ్లికన్లు కాంగ్రెస్ రెండు సభల్లోనూ ఆధిపత్యాన్ని కోల్పోయారు. ప్రతినిధుల సభలోని మొత్తం 435 స్థానాలకుగాను మెజారిటీ మార్కు 218 కాగా, డెమొక్రాట్లు 228 సాధించగా, రిపబ్లికన్లకు కేవలం 139 సీట్లు మాత్రమే దక్కాయి. అలాగే 100 స్థానాలున్న సెనేట్‌లో మెజారిటీకి 51 సీట్లు అవసరం కాగా, డెమొక్రాట్లు 54 స్థానాలు గెలుచుకుని పట్టు సాధించారు. రిపబ్లికన్లు 44 సీట్లకే పరిమితమయ్యారు. ఈ దెబ్బతో భవిష్యత్తులో ట్రంప్ తన కీలక నిర్ణయాలు, బిల్లులు ఆమోదింపజేసుకోవడం చాలా కష్టంగా మారనుంది.

ఈ దారుణ ఓటమికి ఇరాన్ యుద్ధమే ప్రధాన కారణమని ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ ఓ సుదీర్ఘ సోషల్ మీడియా పోస్టులో బహిరంగంగా విమర్శించారు. రాబోయే ఆరేళ్లపాటు సెనేట్‌లో మెజారిటీ కోల్పోవడానికి ఇరాన్ యుద్ధమే కారణమంటూ ఆయన వ్యాఖ్యానించడం కలకలం రేపింది. ట్రంప్ మాత్రం ఎన్నికల ప్రచారం లోనూ, ఫలితాల తర్వాత కూడా ఈ సైనిక చర్యను సమర్థించుకుంటూనే వచ్చారు. అయితే వాన్స్ వ్యాఖ్యలపై స్పందించిన ట్రంప్, ఆయన భావోద్వేగాలను అర్థం చేసుకోగలనని, సైనిక చర్య ప్రభావం ఎన్నికలపై పడిందని ఒప్పుకున్నప్పటికీ యుద్ధం సమర్థనీయమేనని స్పష్టం చేశారు. ఒక లక్షకుపైగా ఓటర్లపై జరిపిన సర్వే ప్రకారం.. దాదాపు 60 శాతం మంది అమెరికన్లు ఇరాన్‌పై దాడిని తప్పుపట్టారు. యుద్ధం పట్ల అసంతృప్తిగా ఉన్న ఈ ఓటర్లే ప్రతినిధుల సభలో డెమొక్రాట్లకు పెద్ద ఎత్తున ఓటేశారు. అయినప్పటికీ, సర్వే ప్రకారం కొందరికి ఇది మాత్రమే ప్రధాన అంశం కాదు. దాదాపు సగం మంది ఓటర్లు ద్రవ్యోల్బణం, ప్రభుత్వ అవినీతిని కూడా పెద్ద సమస్యలుగా భావించారు. డెమొక్రాట్ మద్దతుదారులు దాదాపు అందరూ ఈ యుద్ధాన్ని తప్పుపట్టగా, రిపబ్లికన్ మద్దతుదారులలో 10లో 8 మంది మాత్రం ట్రంప్ చర్య సరైనదేనని సమర్థించారు.

మరోవైపు, 2028 అధ్యక్ష ఎన్నికల రేసు దృష్టిలో ఉంచుకునే వాన్స్ తన వైఖరిని మార్చుకున్నట్లు తెలుస్తోంది. ఇరాక్ యుద్ధంలో మెరైన్‌గా పనిచేసిన వాన్స్, మొదటి నుంచి విదేశీ సైనిక జోక్యాలను వ్యతిరేకిస్తున్నారు. ఓటమి తర్వాత ఆయన కేవలం యుద్ధాన్ని మాత్రమే కాకుండా ద్రవ్యోల్బణం, ఇజ్రాయెల్‌తో సంబంధాలు, ఇమ్మిగ్రేషన్ పాలసీ మార్పులను కూడా ప్రస్తావించారు. 2028 పోటీపై నిర్ణయం ఎన్నికల తర్వాతే ఉంటుందని గతంలో చెప్పిన వాన్స్, ఇప్పుడు ట్రంప్ విధానాలకు భిన్నంగా మాట్లాడడం ఆయన రాజకీయ ఆకాంక్షలకు సంకేతంగా కనిపిస్తోంది. అంతేకాకుండా గవర్నర్ ఎన్నికల్లోనూ డెమొక్రాట్లే ముందంజలో నిలిచారు. మొత్తం 36రాష్ట్రాల గవర్నర్ పదవులకు ఎన్నికలు జరగగా, ఫలితాలు వచ్చిన 34స్థానాల్లో డెమొక్రాట్లు 22 చోట్ల, రిపబ్లికన్లు 12చోట్ల విజయం సాధించారు. మిగతా 2రాష్ట్రాల్లో కౌంటింగ్ జరుగుతోంది. మొత్తానికి ఈ ఎన్నికలు ట్రంప్ రాజకీయ భవిష్యత్తుకు పెద్దసవాలుగా మారగా, రిపబ్లికన్ పార్టీ ఈ ఓటమి నుంచి ఏం పాఠాలు నేర్చుకుంటుందో, ట్రంప్-వాన్స్ మధ్య ఈ విభేదాలు ఎటు దారితీస్తాయో వేచిచూడాలి.

ర్యాగింగ్ వ్యతిరేకంగా విద్యార్థి సంఘాల నిరసన

కామారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ గదిలో బైఠాయింపు, ధర్నా

హైదరాబాద్, నవంబరు 5,ప్రభాతవార్త: కామారెడ్డి మెడికల్ కాలేజీలో జరిగిన ర్యాగింగ్ ఘటనకు బాధ్యత వహించి ప్రిన్సిపాల్ రాజీనామా డిమాండ్ చేస్తూ విద్యార్థి సంఘాలు గురువారం ధర్నా, ప్రిన్సిపాల్ చాంబర్ లో బైఠాయించి నిరసన తెలిపారు. ర్యాగింగ్ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రిన్సిపాల్ విద్యార్థులకు అందుబాటులో ఉండకుండా రెగ్యులర్ గా రాకపోవడం వల్లే విద్యార్థుల్లో భయం లేకుండా పోయి ఈ ర్యాగింగ్ ఘటనకు పాల్పడ్డారని ఆరోపించారు. ప్రిన్సిపాల్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన చాంబర్ లో సుమారు గంటపాటు బైఠాయించి నిరసన తెలిపారు. పోలీసులు చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేసినప్పటికీ ప్రిన్సిపాల్ బయటకు వచ్చి సమాధానం చెప్పే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. ప్రిన్సిపాల్ తో మాట్లాడిస్తానని దేవునిపల్లి ఎస్ఐ రంజిత్ చెప్పడంతో ప్రిన్సిపాల్ చాంబర్ నుంచి బయటకు వచ్చి ఆందోళన కొనసాగించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ వాలియా మాట్లాడుతూ.. గత నెల 25న జరిగిన ర్యాగింగ్ ఘటనపై విద్యార్థులు ఎన్ హెచ్ ఎం కు ఫిర్యాదు చేశారని తెలిపారు. ఆన్ లైన్ ద్వారా ఫిర్యాదు వెళ్లడంతో ఉన్నతాధికారుల నుంచి వచ్చిన సమాచారం మేరకు విచారణ చేపట్టి 14 మంది ర్యాగింగ్ కు పాల్పడినట్లు గుర్తించి వారిపై చర్యలు తీసుకున్నామన్నారు. 14 మందిని ఈ ఘటనలో సస్పెండ్ చేశామని, అందులో హాస్టల్ లో ఉండే నలుగురు విద్యార్థులకు ఆరు నెలల పాటు, డే స్కాలర్ పది మంది నాలుగు నెలల పాటు సస్పెన్షన్ విధించినట్లు చెప్పారు. భవిష్యత్తులో లో ఇలాంటి ఘటనలు జరగకుండా కఠిన చర్యలు విద్యార్థులకు నాల తీసుకుంటామన్నారు. అనంతరం విద్యార్థి సంఘాల నాయకులు మీడియాతో మాట్లాడుతూ.. ర్యాగింగ్ కు అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. గతంలో ర్యా గింగ్ ఘటనలు చోటు చేసుకు న్నప్పటికీ చర్యలు తీసుకోక పోవడం వల్లనే మరోసారి పునరావృతమయ్యాయన్నారు. ర్యాగింగ్ ఘటనపై నిర క్ష్యం వహించిన హాస్టల్ వార్డెన్, డిప్యూటీ వార్డెన్లను వదిలేసి ఇతరులపై చర్యలు తీసుకోవడం ఎంతవరకు స మంజసమని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎ రాష్ట్ర కో కన్వీనర్ జీవియం విఠల్, డీవైఎఫ్ఎ జిల్లా కార్యదర్శి ముదాం అరుణ్‌కుమార్, పీడీ ఎస్యూ జిల్లా కార్యదర్శి సు రేష్, ఎస్ఎఫ్ఎ జిల్లా నా యకులు సాయినాథ్, ఎఐ ఎస్ ఏ జిల్లా ఇంచార్జ్ పెరు మాండ్ల బుల్లెట్, బీవీఎం రాష్ట్ర అధ్య క్షులు రవితేజ, విద్యార్థిసేన జిల్లా అధ్యక్షుడు వినయ్ కుమార్, జీవీఎస్ జిల్లా అధ్య క్షుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన జాలర్లు, ఎస్‌డిఆర్ఎఫ్ బృందం సేఫ్

ఊపిరి పీల్చుకున్న అధికార యంత్రాంగం
ఘటనపై సిఎం, మంత్రులు తుమ్మల, పొంగులేటి క్షణక్షణం ఆరా
రెస్క్యూ యోధుల సాహసానికి మంత్రులు, ఎమ్మెల్యేల ప్రశంసలు
16 మందిని సురక్షితంగా కాపాడిన ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందికి అభినందనలు

సత్తుపల్లి నవంబరు 5, ప్రభాతవార్త: చేపల వేటకివెళ్లిన 11 మంది జాలర్లు మురసు తుఫాన్ ఉధృతికి ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువు అలుగు ప్రాంతంలో చిక్కుకున్న వారిలో ఐదుగురు బుధవారం సాయంత్రానికే వడ్డుకి చేర్చగా, మిగిలిన ఆరుగురి కోసం ఎస్‌డిఆర్ఎఫ్ 11 మంది బృందం రెండు బోట్ల సహాయంతో నీటిలోకి దిగటంతో వరద తీవ్రత ఎక్కువ అవటంతో రెండు బోట్లు నీటిలో కొట్టుకుపోవటంతోపాటు ఎస్డిఆర్ఎఫ్ 11 మంది బృందం గల్లంతయ్యారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా బుధవారం సంచలనం కాగా సమాచారం స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయ కుమార్ ద్వారా మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లటంతో ప్రభుత్వం అప్రమత్త మైంది. ఈ ఘటనను తీవ్రంగా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రులు తుమ్మల, పొంగులేటితోపాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా కలెక్టర్లతో క్షణక్షణం ఆరా తీస్తూ అధికారులను అప్రమత్తం చేశారు. బుధవారం రాత్రి నీటిలో చిక్కుకున్న ఐదుగురు జాలర్లను ఒడ్డుకు చేర్చగా, వీరి కోసం వెళ్లిన 11 మంది ఎస్‌డిఆర్ఎఫ్ బృందం ఆచూకీ కోసం తెల్లవార్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మట్ట రాగమయి దయానంద ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా విజయవాడ నుంచి మరో ఎన్‌డిఆర్ఎఫ్ బృందాన్ని తీసుకొచ్చి రాత్రంతా గాలించడంతో గురువారం తెల్లవారుజాముకి గల్లంతయిన 11 మంది ఎస్డిఆర్ఎఫ్ బృందం ఆచూకీ లభించి సురక్షితంగా ఒడ్డుకి చేరటంతో ప్రభుత్వం, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గల్లంతైన ఎస్డి ఆర్ఎఫ్ బృందం సభ్యులు చెట్ల మీద, పుట్ల మీద, రాళ్ల మీద, తెల్లవారులు నిద్రాహారాలు లేక నీటిలో ఉండి సురక్షితంగా బయటపడటంతో అందరూ ఆనందోత్సవాల మధ్య ఎవారిని హత్తుకున్నారు.



సురక్షితంగా చేరుకున్న జాలర్లు, ఎస్డీఆర్ఎఫ్ బృందంతో మంత్రి తుమ్మల

ఎన్డీఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలను అభినందించిన మంత్రులు

సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో చోటుచేసుకున్న ప్రమాద ఘటనలో ప్రాణాలకు తెగించి సహాయక చర్యలు చేపట్టి 16 మందిని సురక్షితంగా ఎన్‌డిఆర్ ఎఫ్, ఎస్‌డి ఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం ప్రత్యేకంగా అభినందించారు. ఎమ్మెల్యేలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జారే ఆదినారాయణ లతో కలిసి మంత్రులు చెరువు ప్రాంతాన్ని వేర్వేరుగా సందర్శించి, సహాయక చర్యల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాద సమయంలో రాత్రంతా నీటిలో ఉండి, ఏమాత్రం ధైర్యం కోల్పోకుండా బాధితులను రక్షించేందుకు రెస్క్యూ సిబ్బంది చూపిన సాహసం, అంకిత భావం, సమయ స్ఫూర్తిని మం త్రులు ప్రశంసించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విపత్తు సహాయక బృందాలను సన్మానించి వారి సేవలను కొనియాడారు.

ఎమ్మెల్యే చొరవ, కలెక్టర్ పర్యవేక్షణకు ప్రత్యేక ప్రశంసలు

ప్రమాదం జరిగినప్పటి నుంచి సహాయక చర్యలు పూర్తయ్యే వరకు అక్కడే ఉండి నిమిషానికోసారి పరిస్థితులను సమీక్షిస్తూ, అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసి, సహాయక చర్యలను సమన్వయం చేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్‌ను మంత్రులు ప్రత్యేకంగా అభినందించారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్ రాత్రంతా అక్కడే ఉండి సహాయక చర్యలను పర్యవేక్షిస్తూ, అధికార యంత్రాంగాన్ని సమన్వయం చేసిన తీరును మంత్రులు ప్రశంసించారు. ఎమ్మెల్యే, కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ, సమన్వయం సహాయక చర్యల్లో కీలకంగా నిలిచాయని పేర్కొన్నారు.

మత్స్యకార కుటుంబాల కృతజ్ఞతలు

బేతుపల్లి చెరువు ప్రమాదం నుంచి సురక్షితంగా బయట పడిన మత్స్యకారులు, వారి కుటుంబసభ్యులు సిఎం రేవంత్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి, ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్, జిల్లా కలెక్టర్ దివాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందరాజస్వామి ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

తిరుమల, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుపతి గోవిందరాజస్వామి ఆలయంలో గురువారం ఉదయం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. గోవిందరాజస్వామి సన్నిధితో బాటు ఆలయ ప్రాంగణంలోని ఇతర ఆలయాల గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర వస్తువులను నీటితో శుద్ధి చేశారు.

అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి, పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీ గడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్రజలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేశారు. అనంతరం భక్తులను సర్వదర్శనానికి అనుమతించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ శాంతి, సూపరింటెండెంట్ చిరంజీవి, ఆలయ ఇన్‌స్పెక్టర్ ధనంజయులు, అర్చక బృందం పాల్గొన్నారు. దీపావళి సందర్భం గా ఆదివారం సాయంత్రం 5.30 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం వైభవంగా జరుగనుంది. ఆలయ ప్రాంగణంలోని పుండరికవల్లి అమ్మవారి ఆలయం నుండి నూతన వస్త్రాలు తీసుకువస్తారు.

హైకోర్టు ఆర్డర్ ఉన్నా ఆగని అక్రమ పర్మిషన్లు

అయ్యప్ప సొసైటీలో సిఎం కుటుంబసభ్యుల అక్రమ దందాలు
నెల రోజుల్లో చర్యలు తీసుకోకుంటే మేమే వెళ్లి రెడ్ మార్క్ వేస్తాం : టిఆర్ఎస్ చీఫ్ కవిత



గురువారం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న కవిత

హైదరాబాద్, నవంబర్ 5,ప్రభాతవార్త: సిఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు హైదరాబాద్ లోని అయ్యప్ప సొసైటీని చెరబట్టి అక్రమంగా దోచుకుంటున్నారని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. గ్రౌండ్ వాటర్ లేని ఆ ప్రాంతంలో ఒక్క ఇటుక కూడా పేర్చవద్దని హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ దగ్గరుండి పర్మిషన్లు ఇప్పిస్తూ అక్రమాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. హైదరాబాద్ నగర ప్రజలు సరైన రోడ్లు, నీళ్లు లేక ఇబ్బందులు పడుతుంటే ఆ సమస్యలను పట్టించు కోకుండా.. అక్రమ సంపాదనపైనే దృష్టి పెట్టారన్నారు. అయ్యప్ప సొసైటీలో జరుగుతున్న అక్ర మాలకు సం బంధించి గురువారం బంజా రాహిల్స్ లోని పార్టీ కార్యాల యంలో ఆమె మీడియాతో మాట్లా డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అయ్యప్ప సొసైటీలోని గురుకుల ట్రస్ట్ కు సం బంధించిన భూముల్లో అక్రమంగా 500 నుంచి 700 వందల అక్రమ నిర్మాణాలు వచ్చా యన్నారు. వారందరికీ ముఖ్యమంత్రి సోదరులే పర్మిషన్లు ఇప్పిస్తూ కమీషన్లు తీసుకుంటున్నారని చెప్పారు. ఈ సమయానికి కూడా అక్కడ కొత్తగా 80 భవనాలు నిర్మాణంలో ఉన్నాయన్నారు. సొసైటీకి చెందిన ఈ భూముల్లో రిజిస్ట్రేషన్ కు అవకాశం లేకపోవటంతో నోటరీల ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు.

ఇంత పెద్దఎత్తున అక్రమాలు జరుగుతుంటే ఎందుకు సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ పట్టించు కోవటం లేదో చెప్పాలని నిలదీశారు. ఎవరి ఒత్తిడి కారణంగా ఈ అక్ర మాలను చూసి చూడనట్లు వదిలేస్తున్నా రంటూ ప్రశ్నించారు. ఈ అక్రమాలపై ఏ రాజకీయ పార్టీ కూడా ఎందుకు మాట్లాడటం లేదని కవిత అడిగారు. కానీ తాము మాత్రం ఈ విషయాన్ని వదిలిపెట్టమని చెప్పారుసీఎం సోదరులకు విల్లాలుఅయ్యప్ప సొసైటీలోని ఖానామెట్ ప్రాంతంలో పూర్తిగా అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని కవిత చెప్పారు.

అయ్యప్ప సొసైటీలో ఇళ్లను కొనొద్దు

అయ్యప్ప సొసైటీలో ఇటుక కూడా పేర్చవద్దని హైకోర్టు ఆర్డర్ ఉందని కవిత చెప్పారు. అయిన సరే కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టు ఆదేశాలను లెక్క చేయకుండా కొత్తగా 7 వందల నిర్మాణాలకు పర్మిషన్ ఇచ్చిందన్నారు. పైగా నోటరీ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్నారన్నారు. ఇవి చెల్లవని, ఇక్కడ భూములు, ఫ్లాట్లు కొనవద్దని ప్రజలకు సూచించారు. అక్రమంగా ఇళ్లు నిర్మిస్తున్న వాళ్లు, నోటరీతో రిజిస్ట్రేషన్ చేస్తున్న వాళ్లు ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని హెచ్చరించారు. అక్రమార్కులపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి నెల సమయం ఇస్తున్నామని.. ఈ లోపు చర్యలు తీసుకోకపోతే తామే అక్రమ నిర్మాణాల వద్దకు వెళ్లి రెడ్ మార్క్ వేస్తామని కవిత పేర్కొన్నారు.

పదిరోజులు వైకుంఠద్వార దర్శనాలు

తొలి మూడు రోజులు ఆన్‌లైన్‌లో ఇ-డిప్ ఎస్ఎస్‌డి టోకెన్లు : టిటిడి
అదనపు ఇఒ వెంకయ్యచౌదరి

తిరుమల, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: వైఖానస ఆగమోక్తంగా పూజలు అందుకుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ యేడాది కూడా డిసెంబరు 20నుండి పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలు కల్పించాలని టిటిడి నిర్ణయించింది. ఈ పదిరోజుల్లో తొలి మూడు రోజులు డిసెంబరు 20న వైకుంఠ ఏకాదశి, 21న ద్వాదశి ఆ తరువాత 22న వైకుంఠద్వార దర్శనాలకు సామాన్యభక్తులకు 2026 జనవరిలాగే ఈ యేడాది అమలు చేయాలని భావిస్తున్నారు. ఇందుకోసం అనుసరించాల్సిన వ్యూహం, భక్తులకు దర్శనాల విధానంపై గురువారం తిరుమలలోని పద్మావతి అతిథి గృహం సుధర్మ సమావేశ మందిరంలో టిటిడి అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి, సివిఎస్ఒ మురళీకృష్ణతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. వైకుంఠ ద్వార దర్శనాలకు ప్రణాళికాబద్ధంగా విస్తృత ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. అధికమంది సాధారణ భక్తులకు స్వామివారి దర్శనం కల్పించేందుకు గత వైకుంఠ ద్వార దర్శనాల్లో చేసిన విధంగానే తొలి మూడు రోజులకు ఆన్‌లైన్‌లో ఇ-డిప్ ద్వారా ఎస్ఎస్‌డి టోకెన్లు కేటాయించాలని చెప్పారు. తర్వాత ఏడు రోజులు సర్వదర్శనం అమలు చేయాలని తెలిపారు. డిసెంబరు 25వ తేది శుక్రవారం స్వామివారి అభిషేక సేవ సమయంలో కూడా సర్వ దర్శనం భక్తులకు దర్శనం చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు.

సనాతన ధర్మ పరిరక్షణలో అర్చకులది కీలక పాత్ర

టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్

తిరుమల, నవంబరు 5 ప్రభాతవార్త ప్రతినిధి: సనాతన ధర్మ పరిరక్షణలో అర్చకులు కీలక పాత్ర పోషిస్తూ, భక్తికి సంప్రదాయానికి, దేవాలయానికి - సమాజానికి మధ్య ఆధ్యాత్మిక వారధులుగా నిలుస్తున్నారని టిటిడి జెఇఒ డాక్టర్ ఎ.శరత్ పేర్కొన్నారు. టిటిడి హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో అక్టోబరు 22 నుండి నవంబరు 5 వరకు నిర్వహించిన అర్చక శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. తిరుపతిలోని శ్వేత భవన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెఇఒ డాక్టర్ శరత్ మాట్లాడుతూ సమాజంలో అర్చకులకు విశిష్టమైన గౌరవప్రదమైన స్థానం ఉందన్నారు. అర్చకత్వం కేవలం ఒక వృత్తి మాత్రమే కాదని, తరతరాలకు ధర్మ సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను అందించే పవిత్రమైన సేవ అని తెలిపారు. క్రమశిక్షణ, నిష్ఠ, భక్తి, సంప్రదాయాల పట్ల అవగాహనతో అర్చకులు సమాజంలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించాలని కోరారు. ఒక అర్చకుడు తయారైతే ఒక తరానికి ధర్మ సేవకుడు అందించినట్లేనని ఆయన అభిప్రాయపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ మానవాళికి దైవత్వం, ధర్మం, సేవాభావం మార్గదర్శకాలని పేర్కొన్నారు.



సాఫ్ట్‌వేర్ ఉద్యోగా అర్చకత్వం స్వీకరించడం అభినందనీయం: శ్రీకాకుళం జిల్లా పలాసకు చెందిన చంటి సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి స్వగ్రామంలో ఆలయ నిర్మాణానికి కృషి చేస్తూ అర్చకత్వాన్ని స్వీకరించడం అభినందనీయమని జెఇఒ ప్రశంసించారు. ఇలాంటి యువత మరింత మంది ముందుకొచ్చి అర్చకత్వాన్ని స్వీకరించడం ద్వారా సనాతన ధర్మ సేవలో భాగస్వాములు కావాలని ఆకాంక్షి ంచారు. టిటిడి అందిస్తున్న అర్చక శిక్షణను సద్వినియోగం చేసుకుని ధార్మిక సేవలకు అంకితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణు, జోనల్ ఇన్‌చార్జి రెడ్డెప్ప రావు, శ్వేత డైరెక్టర్ డాక్టర్ వేమా వేంకటరత్నం, హిందూ ధర్మ ప్రచార పరిషత్ అదనపు కార్యదర్శి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


రూ.3.10 లక్షల కేటరింగ్ బిల్లుకు రూ.లక్ష లంచం!

ఎసిబి వలలో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి, టైపిస్ట్
మహబూబ్‌నగర్‌లో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఎసిబి అధికారులు
ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

మహబూబ్‌నగర్, నవంబరు 5, ప్రభాతవార్త : ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి అధికారుల బాగోతానికి మరో ఉదంతం వెలుగుచూసింది. ప్రభుత్వ విధులను నిర్వర్తించాల్సిన అధికారులే లంచాల కోసం చేతులు చాపడం కలకలం రేపుతోంది. అధికారిక బిల్లుల ఆమోదం, చెల్లింపుల ప్రక్రియను అడ్డుపెట్టుకుని లంచం డిమాండ్ చేసిన జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారితో పాటు మరో ఉద్యోగిని ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.ఏసీబీ విడుదల చేసిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా యువజన, క్రీడల శాఖ కార్యాలయంలో జిల్లా యువజన, క్రీడల అధికారి (డివైఅండ్ఎస్ఒ)గా పనిచేస్తున్న జక్కు రాజశేఖర్ రెడ్డి (ఎ1), అదే కార్యాలయంలో కాంట్రాక్ట్ ప్రాతిపదికన టైపిస్ట్‌గా పనిచేస్తున్న జి. ఉమేష్ (ఎ2)లు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. వాలీబాల్ హాస్టల్ ఆఫ్ శాట్స్ (ఎస్ఎటిజి), మహబూబ్‌నగర్‌లో ఉంటున్న క్రీడాకారులకు ఆహారం సరఫరా చేసినందుకు సంబంధించి 2026 ఆగస్టు నెలకు సంబంధించిన రూ.3,10,000 క్యాటరింగ్ బిల్లుల ప్రాసెసింగ్, ఆమోదం కోసం నిందితులు ఫిర్యాదుదారుడిని రూ.1,00,000 లంచం డిమాండ్ చేశారు. ఈ మేరకు లంచం సొమ్మును స్వీకరిస్తుండగా మహబూబ్‌నగర్ రేంజ్ ఏసీబీ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. నిందితుడు జక్కు రాజశేఖర్ రెడ్డి తన వద్ద ఉన్న రూ.1,00,000 లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నట్లు ఏసీబీ వెల్లడించింది. ఈ మొత్తాన్ని తన తరఫునే కాకుండా, ముందస్తు పరస్పర అవగాహన ప్రకారం రెండో నిందితుడు ఉమేష్ తరఫున కూడా స్వీకరించినట్లు తెలిపింది. ప్రభుత్వ ఉద్యోగులుగా తమ అధికారిక హోదాను దుర్వినియోగం చేస్తూ, విధులను నిజాయితీగా నిర్వర్తించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

న్యాయస్థానానికి నిందితుల తరలింపు

ఏసీబీ వలలో చిక్కిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి నాంపల్లిలోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కేసులో తదుపరి దర్యాప్తు కొనసాగుతోంది. ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. వాట్సాప్ నంబర్ 9440446106, ఫేస్‌బుక్, ఎక్స్ (ట్విట్టర్) వంటి సామాజిక మాధ్యమాల ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు.



పట్టుబడిన డివైఎస్ అధికారి, టైపిస్టును విచారణ చేస్తున్న ఎసిబి అధికారులు

కీచక వార్డెన్ బాగోతం ఆలస్యంగా వెలుగులోకి

హాస్టల్ వంట మహిళలపై అసభ్యకర ప్రవర్తన
10 రోజులు గడుస్తున్నా చర్యలు శూన్యం, కలకలం రేపుతున్న ఘటన

ఆదిలాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం లోని ఒక ప్రభుత్వ హాస్టల్‌లో కీచక వార్డెన్ అక్రమాలు ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. సదరు హాస్టల్‌లో కుక్ (వంట పని మనిషి)గా విధులు నిర్వహిస్తున్న ఇద్దరు మహిళలపై వార్డెన్ నిరంతరం అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడని తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. గత 1 ఏడాది కాలంగా బాధితులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నప్పటికీ, కేవలం పొట్టకూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో పనులు చేసుకోవాల్సి వచ్చిందని వాపోయారు. అయితే బాధితుల్లో ఒకరు తనకు ఎదురవుతున్న నరకాన్ని కుటుంబ సభ్యులకు తెలపడంతో, వారు ఆ మహిళను వెంటనే పని మానిపించారు. మరొక మహిళ ఈ విషయం బయటకు తెలిస్తే సమాజంలో అవమానాల పాలుకావాల్సి వస్తుందనే భయంతో ఇన్ని రోజులు మౌనంగా భరించాల్సి వచ్చిందని తెలిపారు. తోటి మహిళకు కూడా ఇదే రకమైన వేధింపులు ఎదురయ్యాయని గ్రహించి, ధైర్యం చేసి వార్డెన్ పై ఏటీడీఓకు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై సంబంధిత పాఠశాల హెచ్ఎంను వివరణ కోరగా.. బాధితమహిళలు తమకు జరిగిన అన్యాయాన్ని తమ దృష్టికి తీసుకు వచ్చారని ధ్రువీకరించారు. ఆ తర్వాత ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఏటీడీఓకు బాధిత మహిళలు లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందజేశారు. వాస్తవాలను వెలికితీయడానికి ఏటీడీఓ కార్యాలయానికి ఇరువర్గాలను పిలిపించి విచారణ జరిపారని, ఈ వ్యవహారాన్ని ఐటీడీఏ డీడీ దృష్టికి తీసుకెళ్లినట్లు ఏటీడీఓ తెలిపారు. దీనిపై ఐటీడీఏ డీడీని వివరణ కోరగా.. ఘటనపై నిష్పాక్షి క విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. అయితే ఈ దారుణ సంఘటన జరిగి దాదాపు 10 రోజులు పూర్తి కావస్తున్నప్పటికీ, ఇప్పటివరకు సదరు వార్డెన్‌పై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి కీచక వార్డెన్ పై వెంటనే శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకుని బాధిత మహిళలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే తక్షణమే కఠిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.


ఓ దేశపు ఔన్నత్యం జంతువుల పట్ల అది వ్యవహరించే తీరును బట్టి ఉంటుంది.

న- మహాత్మా గాంధీ

ట్రంప్ దూకుడుకు కళ్లెం?

రిపబ్లికన్ 'ట్రంప్'కు డెమొక్రట్‌లు చుక్కలు చూపించారు. పరాభవ భారంతో ఉన్న ఆయన తానెలా 'వీటో' పవర్ ఉపయోగిస్తాడో రేపోమాపో తేలుతుందని ఆయన మాటల్లోనే వినే రోజు ముందుంది. ప్రస్తుతం డెమొక్రట్‌లకు ఓటేసిన వారిపై కారాలు మిరియాలు నూరుతున్నా డెమొక్రట్‌లతో కలిసి పనిచేసేందుకు తనకెలాంటి అభ్యంతరం లేదని ప్రకటించక తప్పలేదు. ట్రంప్ తన హోదాకుతగని, ఎన్నో దుందుడుకు నిర్ణయాలు తీసుకోవడంలో ఆయనకు ఆయనే సాటి. ఆ నిర్ణయాల ప్రభావమే నేటి ఎన్నికల ఫలితాలు. స్వపక్షంలోనే తిరుగుబాటును ఎదుర్కొంటున్న ట్రంప్ తన వ్యవహార శైలిని మార్చుకోలేకపోతున్నారు. అన్నీ తన కనుసన్నల్లో జరుగుతున్నాయని భ్రమపడే ఆయన తొలిసారి డెమొక్రట్ సహచరుల పట్ల అభిమానంగా మాట్లాడుతున్నారు. అదే సమయంలో ఇరాన్‌తో జగడం వల్లనే అమెరికన్‌లు తనకు దూరమవుతున్నారని తెలిసొచ్చింది. ప్రజలు అసహనానికి గురవడానికి కారణం పశ్చిమాసియా యుద్ధనేపథ్యంలో పెట్రో ధరలు పెరగడమేనన్నది గుర్తించారు. అయినా ఆయన్ని ఏదో పిచ్చి భ్రమ వెంటాడుతోంది. బ్యాలెట్‌లో తన పేరు ఉండి ఉంటే దాని ఆకర్షణ శక్తి అజేయమని ఆయన నమ్మారు. కానీ అలా జరుగలేదు. ఏమైతే పరిస్థితులు చేయి జారిపోయాయి. ట్రంప్‌కు దిమ్మతిరిగే షాక్ ఇవ్వడంతో అమెరికన్లంతా ఒకే మాట మీదున్నట్లుంది. మధ్యంతర ఎన్నికలో దాదాపు 30గవర్నర్ల పదవులకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ ప్రభంజనం సృష్టించింది. ట్రంప్ విధానాలతో విసుగెత్తిన జనం ఆగ్రహాన్ని ఓటు రూపంలోకి మార్చేశారనే చెప్పాలి. కాంగ్రెస్ ఉభయసభలో డెమొక్రట్‌ల ఆధిపత్యం పెరిగింది. అధ్యక్షపాలన మధ్యసమయంలో జరిగే ఎన్నికలు కావడం, అమెరికా అధ్యక్షుడు తనపై తనకు గల ఆత్మవిశ్వాసాన్ని వెల్లడి చేసే విధంగా ఈ ఎన్నికలు తన అధ్యక్ష పాలనకు రెఫరెండంగా భావించి అమెరికన్ ఓటర్లు ప్రతి ఒక్కరూ, బ్యాలెట్ చూడగానే తానే రంగంలో ఉన్నట్లు అనుకుని ఓటేయాలని ఎన్నో మార్లు ఓటర్లను దాదాపు బతిమాలుకున్నంత పనిచేశారు. 'రిఫరెండం' అని ప్రకటించుకోవడంతో జనం అంతే సీరియస్‌గా తిరుగుబాటు 'ఓటు'ను ప్రతిధ్వనింప చేశారు.ఎంతోకాలంగా రిపబ్లికన్ పార్టీలకు కంచుకోటగా ఉన్న కేంద్రాల్లో డెమొక్రట్ అభ్యర్థులకు ఓట్ల వెల్లువ సమకూరింది. ఆధునిక ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం నడుస్తున్నా ఈ ఎన్నికలు 'బ్యాలెట్'లపైనే ఆధారపడింది. స్కానింగ్ మిషన్‌ల ద్వారా చేపట్టే ఓట్ల లెక్కింపు పారదర్శకంగా ఉంటుందని క్షణాల్లో పక్కా లెక్కలు తేల్చేస్తుందని ఈ ఎన్నికలు నిరూపించాయి. కనుక ఎలక్ట్రానిక్ ఓటింగ్ పర్యవసానాలు, ఆరోపణలు లేకుండా సాగినట్లు అంచనా. తాజా ఫలితాలతో ఇరాన్ యుద్ధంపై ట్రంప్ వైఖరి మారుతుందని ఇరాన్ ముఖ్యనేతలు సైతం భావించడం లేదు. ఈ యుద్ధంపై కాలుదువ్విన ఇజ్రాయెల్ అధ్యక్షుడు నెతన్యాహు సైతం పునరాలోచనలో పడుతున్న దాఖలాలు లేవు. ఇజ్రాయెల్ మధ్యంతర ఎన్నికల్లోనూ నెతన్యాహు ఇమేజ్ చతికిలపడిపోయింది. ట్రంప్ ఏకపక్ష సుంకాల విధింపుతో అన్ని దేశాలను దూరం చేసుకుని దూకుడుగా వ్యవహరిస్తున్న వైఖరి అమెరికన్లకు నచ్చలేదని ఈ ఎన్నికలు ఫలితాల విశ్లేషకులు చెబుతున్నారు. అసలు ఇకపై ట్రంప్ ఆలోచనా ధోరణి మారుతుందో! మారదో చెప్పగలవారెవరూ లేరు. అయితే ఫలితాల అనంతరం అమెరికన్ దేశీయ మార్కెట్లు బాగాపుంజుకున్నాయి. అంతర్జాతీయంగా పెరిగిన వాణిజ్య అనిశ్చితులు, భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నుండి ట్రంప్ నిర్ణయాల ప్రభావం ఆదేశాన్ని అన్ని రంగాల్లోనూ గట్టెక్కించుతాయా లేవా అన్నది కొన్నిరోజులు పరిశీలించాల్సిందే. దాదాపు ప్రతి పదిమంది అమెరికన్లలో ఆరుగురు ట్రంప్ పాలనకు వ్యతిరేకంగా ఉన్నారని కొన్ని సర్వేలు ఈ ఎన్నికల ముందే తేల్చేశాయి. ఫలితాలు వాటికి అద్దం పట్టాయి. వివిధ దేశాల నుంచి వచ్చే దిగుమతులపై ట్రంప్ విధించిన భారీసుంకాలు కారణంగా సాధారణ అమెరికన్లపై ద్రవ్యోల్బణ భారాన్ని పెంచాయనే విమర్శలు ఉన్నాయి. దాదాపు 39 శాతం మంది అమెరికన్లు ప్రస్తుత పాలనలో తమ కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా క్షీణించిందని భావిస్తున్నారు. వారిలో తమ జీవన వ్యయం పెరిగిందన్న ఆందోళన బలీయంగా ఉంది. ఈ ఎన్నికల సందర్భంగా సేకరించిన ఎగ్జిట్‌పోల్స్‌లో తేటతెల్లమయిన విషయాలు ఎంతో ఆశ్చర్యకరంగా ఉన్నాయి. దాదాపు 60శాతం మంది ఓటర్లు ట్రంప్ దేశ ప్రయోజనాల కన్నా తన వ్యక్తిగత ప్రయోజనాలకే ఎక్కువ ప్రాధాన్యత నిస్తున్నారనే అభిప్రాయాన్ని వెల్లడించారు. 2024 ఎన్నికల్లో ట్రంప్‌కు గట్టి మద్దతునిచ్చిన జెన్‌జి యువ ఓటర్లు ఈసారి ఆయన్ని పూర్తిగా వ్యతిరేకించారు. డెమొక్రటిక్ పార్టీ అభ్యర్థుల విజయాన్ని కోరుకున్నారు. ఇరాన్‌తో అమెరికా యుద్ధం సరైన విధానం కాదని డెమొక్రటిక్ పార్టీ ఆది నుంచి వ్యతిరేకిస్తోంది. యుద్ధం కారణంగా చమురు ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో సగటు అమెరికన్లు ఇరాన్ యుద్ధాన్ని వ్యతిరేకిస్తున్నాయి. కాంగ్రెస్‌లో డెమొక్రట్‌ల ఆధిపత్యం పెరిగినందున ట్రంప్ విపరీత మనస్తత్వంతో చేసే నిర్ణయాలకు డెమొక్రటిక్ పార్టీ నేతలు అడుగడుగునా అడ్డంపడే అవకాశంఉంది. పశ్చిమాసియా శాంతి కోసం వారు గట్టిగా నిలబడే సమయం ఆసన్నమైంది. భారీస్థాయిలో యుద్ధ నిధులు ఇచ్చేందుకు ట్రంప్ ప్రతిపాదనలకు డెమొక్రట్‌లు వ్యతిరేకిస్తే ఇరాన్ యుద్ధంపై ట్రంప్ తోక ముడవాల్సిందే. ఒక విధంగా అమెరికాలో ఇప్పుడు జరుగుతున్న రాజకీయ పరిణామాలు మంచివే. 'అమెరికా ఫస్ట్' నేపథ్యంలో వలస విధానాల నిర్ణయంలో దూకుడు తగ్గుతుంది. ఇతర దేశాల ఐటి నిపుణులకు ప్రాధాన్యత లభిస్తుంది. గత అర్థశతాబ్దంలో ఏ అధ్యక్షుడూ ఇంతటి వ్యతిరేకతను మూటగట్టుకోలేదు. ఏమైతేనేం గతంలో కన్నా మిన్నగా పలువురు భారతీయ అమెరికన్‌లకూ అక్కడ పట్టం కట్టడం విశేషం.

ఆత్మవిశ్వాసంతో కృషి చేసే మనిషి అందుకోలేని శిఖరాలు ఉండవు.



ఆస్కార్ వైల్డ్

ఆలోచన లేని అభ్యసనం నిరుపయోగం. అభ్యసనం లేని ఆలోచన ప్రమాదకరం.



ఎమర్సన్

సమాజ హితం లేని ఆరోపణలెందుకు?

ఆరోపణ, ఆధారం, విచారణ, నిర్ధారణ.. ఈ నాలుగు అంశాల మధ్య తేడాను సమాజం అర్థం చేసుకోవాలి. రాజకీయ నాయకులు తమ మాటలకు తామే బాధ్యత వహించే సంస్కృతిని అలవర్చుకోవాలి. తప్పు జరిగితే అంగీకరించే ధైర్యం, ప్రత్యర్థి చేసిన మంచి పనిని ప్రశంసించే విశాల హృదయం, ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేసే మనస్తత్వం పెంపొందించుకోవాలి. విమర్శించాల్సి వస్తే విధానాలను విమర్శించాలి. ప్రశ్నించాల్సి వస్తే పనితీరును ప్రశ్నించాలి. ఆరోపణ చేయాల్సి వస్తే ఆధారాలతో చేయాలి. తప్పు నిరూపితమైతే చట్టపరమైన చర్యలకు సహకరించాలి. ఆరోపణల కంటే ఆధారాలకు, ప్రత్యారోపణల కంటే పరిష్కారాలకు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

వై. సంజీవ కుమార్

మాటలు మారితేనే సమాజంలో మార్పు సాధ్యం. సమాజ అభివృద్ధి అనేది కేవలం రహదారులు వేయడం, భవనాలు నిర్మించడం, సంక్షేమ పథకాలు అమలు చేయడం, నిధులు కేటాయించడం వంటి పనులతోనే పూర్తికాదు. ప్రజల మధ్య పరస్పర విశ్వాసం, సామాజిక బాధ్యత, నైతిక విలువలు, ప్రశాంతమైన వాతావరణం కూడా అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయి. ఒక గ్రామం బాగుండాలన్నా, మండలం అభివృద్ధి చెందాలన్నా, పట్టణం ప్రగతి సాధించాలన్నా, రాష్ట్రం ముందుకు సాగాలన్నా, దేశం ప్రపంచంలో గౌరవప్రదమైన స్థానాన్ని సంపాదించాలన్నా రాజకీయ నాయకుల మాటలు, ఆలోచనలు, ప్రవర్తన, కార్యాచరణలో బాధ్యతాయుతమైన మార్పు రావాలి. ముఖ్యంగా ఆరోపణలు, ప్రత్యారోపణల రాజకీయ సంస్కృతికి స్వస్తి పలకాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికీ ఉంది. ప్రజాప్రతినిధుల పనితీరును విమర్శించడం, ప్రభుత్వ నిర్ణయాలను ప్రశ్నించడం, అవినీతి లేదా అక్రమాలు జరిగితే వాటిని ప్రజల దృష్టికి తీసుకురావడం ప్రజాస్వామ్య వ్యవస్థలో భాగమే. అయితే విమర్శకు, నిరాధారమైన ఆరోపణకు మధ్య స్పష్టమైన తేడా ఉంటుంది. ఆధారాలతో ప్రశ్నించడం ప్రజాస్వామ్య బాధ్యత అయితే, ఆధారాలు లేకుండా వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధం. నేటి రాజకీయ వాతావరణంలో ఒక నాయకుడు మరొక నాయకుడిపై ఆరోపణ చేయడం, దానికి ప్రతిగా ఇంకొకరు ప్రత్యారోపణలు చేయడం, ఆ తర్వాత అదే అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం పదేపదే ప్రస్తావించడం సాధారణంగా మారుతోంది. ఆరోపణ చేసిన తర్వాత దానిని నిరూపించడానికి అవసరమైన ఆధారాలు సేకరించడం, సంబంధిత వ్యవస్థలకు ఫిర్యాదు చేయడం, విచారణ జరిగేలా చూడడం వంటి చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ కొన్ని సందర్భాల్లో ఆరోపణలతోనే రాజకీయ ప్రచారం ముగుస్తోంది. ఫలితంగా ప్రజలకు వాస్తవాలు తెలియకుండానే అనుమానాలు, అపోహలు,అపనమ్మకాలు వ్యాప్తి చెందుతున్నాయి. ఒక ఆరోపణ చేయడానికి కొన్ని క్షణాలు సరిపోవచ్చు. కానీ ఆ ఆరోపణ వల్ల ఒకవ్యక్తి ప్రతిష్టకు, ఒక కుటుంబ గౌరవానికి, ఒక సంస్థ విశ్వసనీయతకు కలిగిన నష్టాన్ని సరిచేయడానికి సంవత్సరాలు పట్టవచ్చు. అందుకే ఆరోపణ చేసే ముందు దాని నిజానిజాలను పరిశీలించడం, ఆరోపణ చేసిన తర్వాత దానికి సంబంధించిన ఆధారాలను ప్రజల ముందు ఉంచడం నాయకుల నైతిక బాధ్యతగా గుర్తించాలి. రాజకీయ నాయకులు కేవలం ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులు మాత్రమే కాదు. వారి మాటలను లక్షలాది మంది ప్రజలు వింటారు, వారి ప్రవర్తనను గమనిస్తారు, కొన్నిసార్లు వారినే ఆదర్శంగా తీసుకుంటారు. అందువల్ల నాయకుల మాటలకు సాధారణ వ్యక్తుల మాటల కంటే ఎక్కువ ప్రభావం ఉంటుంది. నాయకులు పరస్పరం గౌరవించుకుంటూ, విధానపరమైన అంశాలపై చర్చిస్తూ, ప్రజా సమస్యలకు పరిష్కారాలు సూచిస్తే సమాజంలోనూ ఆరోగ్యకరమైన చర్చా సంస్కృతి పెరుగుతుంది. కానీ వ్యక్తిగత దూషణలు, కక్ష సాధింపు వ్యాఖ్యలు, నిరాధార ఆరోపణలు ప్రధానంగా మారితే అదే ధోరణి క్రమంగా ప్రజల్లోకి కూడా చేరుతుంది. ఒక పార్టీకి చెందిన వ్యక్తి మరో పార్టీ నాయకుడిని శత్రువుగా చూడటం ప్రారంభిస్తే, ఆ రాజకీయ విభేదాలు కుటుంబాలు, స్నేహితులు, గ్రామాలు, కాలనీల మధ్య కూడా విభేదాలకు కారణమవుతాయి. ఒకే గ్రామంలో నివసించే ప్రజలు రాజకీయ అభిప్రాయాల కారణంగా పర



స్పరం మాట్లాడుకోలేని పరిస్థితులు ఏర్పడవచ్చు. సంవత్సరాలుగా కొనసాగిన స్నేహాలు దెబ్బతినవచ్చు. ప్రజా సమస్యలపై కలిసి పనిచేయాల్సిన వ్యక్తులు రాజకీయ అనుబంధాల కారణంగా దూరమవుతారు. ఇక్కడ ఆలోచించాల్సిన విషయం ఒక్కటే.రాజకీయ నాయకుల మధ్యజరిగే మాటల యుద్ధానికి మూల్యం చెల్లించేది ఎవరు? నాయకులు తమ రాజకీయ కార్యక్రమాలను కొనసాగిస్తారు. ఆరోపణలు ఎదుర్కొన్న నాయకులు, ప్రత్యన్న ఆరోపణలు చేసిన వాళ్ళు ఎదురెదురుగా ఎదురైనా, ఏదైనా కార్యక్రమంలో కలిసినా నవ్వుతు ప్రశాంతంగా పలకరించుకుంటారు. కానీ వారు చేసినా ఆరోపణలు, ప్రత్యారోపణలు, వారి మాటలను నమ్మి పరస్పరం విభేదించే సామాన్య ప్రజలు మాత్రం సామాజిక సంబంధాలను కోల్పోతారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఏర్పడిన విభేదాలు, సమాజంలో దీర్ఘకాలిక చీలికలకు దారితీయడం అత్యంత ప్రమాదకరం. ప్రజలకు అవసరమైనవి నాణ్యమైన విద్య, మెరుగైన వైద్యం, ఉపాధి అవకాశాలు, తాగునీరు, పారిశుద్ధం, రవాణా సౌకర్యాలు, మహిళలకు భద్రత, వృద్ధులకు రక్షణ, యువతకు భవిష్యత్తుపై నమ్మకం. ఇవే ప్రజాప్రతినిధుల చర్చల్లో ప్రధాన అంశాలుగా ఉండాలి. కానీ రాజకీయ చర్చలు వ్యక్తిగత ఆరోపణలు, ప్రత్యారోపణలు, విమర్శలు, ప్రతివిమర్శల చుట్టూ తిరిగితే ప్రజా సమస్యలకు లభించాల్సిన ప్రాధాన్యం తగ్గిపోతుంది. ఒక సమస్యను ఎలా పరిష్కరించాలి అనే చర్చ స్థానంలో, ఆ సమస్యకు ఎవరు కారణమనే వాదన కొనసాగుతుంది. బాధ్యతను స్వీకరించాల్సిన చోట ఒకరిపై మరొకరు నిందలు వేసుకుంటారు.పరిష్కారంచూపాల్సిన సమయంలో రాజకీయ లెక్కలు వేస్తారు. ఉదాహరణకు ఒక గ్రామంలో తాగునీటి సమస్య ఉంటే దానికి పరిష్కారం చూపడం ముఖ్యం. గతంలో ఎవరు నిర్లక్ష్యం చేశారనే అంశం అవసరమైతే పరిశీలించవచ్చు. కానీ ఆ వివాదం కారణంగా సమస్య పరిష్కారం ఆలస్యం కావడం మాత్రం ప్రజలకు అన్యాయం చేయడమే. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కొరత, ఆసుపత్రుల్లో వైద్యసేవల లోపాలు, నిరుద్యోగ సమస్యలు వంటి అంశాలపై రాజకీయ పార్టీలు పరస్పరం నిందించుకోవడం కంటే, సమస్య పరిష్కారానికి ఉమ్మడి కార్యాచరణ రూపొందించడం సమాజానికి మేలు చేస్తుంది. ఆరోపణలకు ఆధారాలు లేనప్పుడు ప్రజల్లో గందరగోళం పెరుగుతుంది. ఒక వర్గం ఒక నాయకుడి మాటలను నమ్ముతుంది. మరో వర్గం ప్రత్యర్థి నాయకుడి మాటలను నమ్ముతుంది. వాస్తవాలను తెలుసుకునే ప్రయత్నం చేయకుండా,తమకు నచ్చిన వ్యక్తిచెప్పిందే నిజమని భావించే ధోరణి పెరుగుతుంది. సామాజిక మాధ్యమాల ద్వారా నిర్ధారణ కాని సమాచారాన్ని వేగంగా పంచుకోవడం ఈ సమస్యను మరింత తీవ్రతరం చేస్తోంది. ఒకసారి తప్పుడు సమాచారం ప్రజల్లోకి వెళ్లిన తర్వాత, వాస్తవాలు బయటపడినా అందరూ వాటిని అంగీకరించకపోవచ్చు. ఎందుకంటేప్రజలు కొన్నిసార్లు వాస్తవాల కంటే తమ రాజకీయ అభిప్రాయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. ఈపరిస్థితి సమాజంలో నమ్మకాన్ని బలహీనపరుస్తుంది. అయితే ఆరోపణ చేసిన ప్రతి వ్యక్తినీ తప్పుబట్టడం కూడా సరైన విధానం కాదు.నిజమైన అవినీతి, అధికార దుర్వినియోగం, ప్రజాధన దుర్వినియోగం వంటిఅంశాలను వెలుగులోకి తీసుకురావడం అవసరం. అందుకు స్వతంత్ర విచారణ, పారదర్శకమైన ప్రక్రియ, చట్టబద్ధమైన చర్యలు ముఖ్యం. ఆరోపణ చేసిన వ్యక్తి రాజకీయ ప్రత్యర్థి అయినంత మాత్రాన ఆ ఆరోపణ అసత్యమని చెప్పలేం. అదేవిధంగా ఆరోపణలు వినిపించాయనే కారణంతో ఎవరినీ దోషిగా నిర్ధారించలేం.ఆరోపణ, ఆధారం, విచారణ, నిర్ధారణ.. ఈ నాలుగు అంశాల మధ్య తేడానుసమాజం అర్థం చేసుకోవాలి. రాజకీయ నాయకులు తమ మాటలకు తామే బాధ్యత వహించే సంస్కృతిని అలవర్చుకోవాలి. తప్పు జరిగితే అంగీకరించే ధైర్యం, ప్రత్యర్థి చేసిన మంచి పనిని ప్రశంసించే విశాల హృదయం, ప్రజల ప్రయోజనాల కోసం కలిసి పనిచేసే మనస్తత్వం పెంపొందించుకోవాలి. విమర్శించాల్సి వస్తే విధానాలను విమర్శించాలి. ప్రశ్నించాల్సి వస్తే పనితీరును ప్రశ్నించాలి. ఆరోపణ చేయాల్సి వస్తే ఆధారాలతో చేయాలి. తప్పు నిరూపితమైతే చట్టపరమైన చర్యలకు సహకరించాలి. ఆరోపణల కంటే ఆధారాలకు, ప్రత్యారోపణల కంటే పరిష్కారాలకు, రాజకీయ ప్రయోజనాల కంటే ప్రజా ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇచ్చినప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

గణాంకాల్లోని ప్రగతి బతుకుల్లో ఏదీ?


డాక్టర్ మోటె చిరంజీవి

పేదరికం అనేది కేవలం ఆదాయం లేకపోవడం మాత్రమే కాదు. ఆకలి, అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, ఆర్థిక అసమానతలు కలగలిసిన సామాజిక సమస్య. ఒక దేశ అభివృద్ధిని కేవలం స్థూల జాతీయోత్పత్తి, పారిశ్రామిక వృద్ధి, సంపద సృష్టితో కొలవలేం.ఆ దేశంలో చివరి వరుసలోఉన్న పేదవాడి జీవన ప్రమాణాలు ఎంత మెరుగుపడ్డాయన్నదే నిజమైన అభివృద్ధికి గీటురాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్ పేదరిక నిర్మూలనలో గణనీయమైన పురోగతి సాధిస్తోందని ప్రపంచ బ్యాంకు తాజా నివేదిక వెల్లడించడం ఆశాజనక పరిణామం. ప్రపంచ బ్యాంకు 2026 అక్టోబర్ నివేదిక ప్రకారం2011లో దేశంలో తీవ్ర పేదరికం 27.1 శాతంగా ఉండగా, 2023 నాటికి 2.6 శాతానికి తగ్గింది. రోజుకు మూడు డాలర్ల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్న జనాభా శాతం గణనీయంగా తగ్గడం విశేషం. మరోవైపు రోజుకు 4.20 డాలర్ల కంటే తక్కువ వినియోగ సామర్థ్యంతో జీవిస్తున్న వారి సంఖ్యకూడా తగ్గింది. 2011 నుంచి 2023 మధ్యకాలంలో సుమారు 49.6 కోట్ల మంది పేదరిక స్థాయి నుంచి బయటపడ్డారని నివేదిక పేర్కొంది. ఈమార్పునకు పెరిగిన వినియోగ సామర్థ్యం, ఉపాధి అవకాశాలు, మహిళల ఆర్థిక భాగస్వామ్యం, ఆహార భద్రత పథకాలు దోహదపడ్డాయి. ఉచిత రేషన్, గ్రామీణ ఉపాధి హామీ,విద్య, వైద్యసదుపాయాలు,స్వయం ఉపాధి పథకాలు పేద కుటుంబాలకు కొంత ఆర్థిక భరోసానిచ్చాయి. ముఖ్యంగా మహిళలకు ఉపాధిఅవకాశాలు పెరగడం కుటుంబ ఆదాయాన్ని మెరుగుపరిచింది. అయితే గణాంకాల్లో కనిపిస్తున్న ప్రగతి ప్రతి పేదకుటుంబం జీవితంలోనూ ప్రతిబింబిస్తోందా? అన్న ప్రశ్నకు సమాధానం వెతకాల్సిన అవసరం ఉంది. పేదరికం తగ్గిందని ప్రకటించడం ఎంత ముఖ్యమో పేదరికంలోకి మళ్లీ జారిపోకుండా ప్రజలకు శాశ్వత భద్రత కల్పించడం అంతకంటే ముఖ్యం. నేటికీ అనేక కుటుంబాలు రోజువారీ కూలీపై ఆధారపడి జీవిస్తున్నాయి. అనారోగ్యం వస్తే అప్పులుచేయడం, పిల్లల చదువుల కోసం ఆస్తులు అమ్ముకోవడం,ఉపాధి లేక వలస వెళ్లడం కొనసాగుతూనే ఉన్నాయి. మరోవైపు ధనిక, పేద వర్గాల మధ్యఆదాయ అంతరాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2023లో అత్యధిక ఆదాయం పొందుతున్న పది శాతం కార్మికుల మధ్యస్థ ఆదాయం,అత్యల్ప ఆదాయం పొందుతున్న పది శాతం కార్మికుల ఆదాయం కంటే దాదాపు 13 రెట్లు ఎక్కువగా ఉందని ప్రపంచ బ్యాంకు వెల్లడించడం ఆర్థిక అసమానతల తీవ్రతను తెలియజేస్తోంది.పేదరిక నిర్మూలనకు ఉచిత పథకాలే పరిష్కారం కావు. నాణ్యమైన విద్య, అందుబాటులో వైద్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి కల్పన, వ్యవసాయానికి గిట్టుబాటు ధరలు, చిన్న పరిశ్రమలకు ప్రోత్సాహం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేయాలి.పట్టణాల్లో అసంఘటితకార్మికులకు సామాజిక భద్రత కల్పించాలి. మహిళలకు స్వయం ఉపాధి, నైపుణ్య శిక్షణ, ఆర్థిక స్వావలంబన అవకాశాలు పెంచాలి. పేద కుటుంబాల్లోని పిల్లలకు నాణ్యమైన విద్య అందించడంద్వారా తరతరాల పేదరికానికి అడ్డుకట్ట వేయవచ్చు. ప్రభుత్వాలు పేదరికనిర్మూలనను రాజకీయ ప్రయోజనాల కోణంలో కాకుండా సామాజిక బాధ్యతగా చూడాలి. సంక్షేమ పథకాల ప్రయోజనాలు అర్హులకు చేరుతున్నాయా లేదా అన్నది నిరంతరం పర్యవేక్షించాలి. పేదరికాన్ని కేవలం ఆదాయంతో కాకుండా ఆహారం, విద్య,వైద్యం, గృహవసతి, పారిశుద్ధం, ఉపాధి వంటి అంశాలతో సమగ్రంగా అంచనా వేయాలి. గణాంకాల్లో పేదరికం తగ్గడం అభినందనీయమే. కానీ ప్రతి ఇంట్లో ఆకలి తీరినప్పుడు, ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య అందినప్పుడు, ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన ఉపాధి లభించినప్పుడు మాత్రమే పేదరిక నిర్మూలన లక్ష్యం సార్థకమవుతుంది. పేదవాడికి ఉచిత సాయం అందించడం కంటే తన కాళ్లపై తాను నిలబడే అవకాశం కల్పించడమే నిజమైన అభివృద్ధి.

ఏకపక్ష ధోరణితో ఏజెన్సీలో విధ్వంసం!

విశ్వ జంపాల

ప్రజాస్వామ్యంలో పాలకులను గద్దెనెక్కించేది ప్రజల సంక్షేమాన్ని కాపాడటం కోసం, వారి జీవనోపాధిని పరిరక్షించడం కోసం. కానీ క్షేత్రస్థాయి వాస్తవాలను, శాస్త్రీయ అధ్యయనాలను, ప్రజా ఆకాంక్షలను, సులువైన ప్రత్యామ్నాయ మార్గాలను పూర్తిగా పక్కనబెట్టి, పాలకులుఅమలు చేస్తున్న ఏకపక్ష నిర్ణయాలు కేవలం 'అభివృద్ధి'ముసుగులో జరుగుతున్న వినాశనానికి అద్దం పడుతున్నాయి. దీనికి తాజా నిదర్శనమే 'మున్నేరుపాలేరు లింక్ కెనాల్' ప్రాజెక్టు (జీవో నం.98/2025) ప్రతిపాదన. ఏజెన్సీ ప్రాంతమైన గార్ల మండలాన్ని, అక్కడి మూలవాసులను శాశ్వత సంక్షోభంలోకి నెట్టే ఈ ప్రాజెక్టుపై ప్రజల నుండి తీవ్ర నిరసన వ్యక్తమవుతున్నా, పాలకుల వైఖరిలో మార్పు రాకపోవడం అత్యంత గర్హనీయం. ప్రతిపాదిత 'మున్నేరుపాలేరు లింక్ కాలువ 9.6 కిలోమీటర్ల పొడవుతో గార్ల మండలంలోని దుబ్బాగూడెం మద్దివంచ గ్రామాల మధ్య వున్న మున్నేరు చెక్ డ్యామ్ నుండి ప్రారంభమై గార్ల మండలంలోనికంసాలి తండా వద్ద సీతారామా కాలువలో కలసి ముగుస్తుంది. ఈ లింక్ కాలువతో గార్ల ఏజెన్సీ మండలానికి ఏ ప్రయోజనం లేనప్పటికీ, అనేక మాయోపాయాలతో, కుట్రలు కుతంత్రాలతో మున్నేరు పాలేరు లింక్ కెనాల్ పూర్తి చేసి ప్రభుత్వం తన పంతం నెగ్గించుకోవాలని చూడడం అత్యంత హేయమైన నీతి బాహ్యమైన చర్య. మున్నేరుపాలేరు లింక్ కెనాల్ నిర్మాణం వల్ల ఏజెన్సీ ప్రాంతమైన గార్ల మండలంతో సహా మున్నేరు పరివాహక ప్రాంతం శాశ్వత నీటి హక్కులను పూర్తిగా కోల్పోనుంది. వందలాది ఎకరాల పచ్చని సాగు భూములు ధ్వంసమై, చిన్న, సన్నకారు గిరిజన రైతులు తమ జీవనాధారాన్ని కోల్పోయి, రోడ్డున పడే దుస్థితి దాపురిస్తుంది. తరతరాలుగా ప్రకృతితో, అడవితో, వ్యవసాయంతో మమేకమై బతుకుతున్న గిరిజనుల సంస్కృతి, సాంప్రదాయాలు, వారి మనుగడ నాశనమయ్యే ప్రమాదం ఉంది. అంతేకాక, ఈ కాలువ ద్వారా నీటిని తోడేయడం వల్ల పరివాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయి, భావి తరాలు తీవ్ర తాగునీటి, సాగునీటి కటకటను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉపాధితో పాటు పర్యావరణానికి జరిగే ఈ తీవ్ర నష్టం వల్ల మున్నేరు పరివాహక ప్రాంతం కోలుకోలేని శాశ్వత వెనుకబాటుతనంలోకి నెట్టివేస్తుంది. పెద్దమొత్తంలో మున్నేరు సహజ నీటి ప్రవాహాన్ని అశాస్త్రీయంగా, అనాలోచితంగా మళ్ళించడం ద్వారా మానవ ప్రేరేపిత విధ్వంసాలకు, ప్రకృతి వైపరీత్యాలకు కారణమై 'మున్నేరు మృతుల దిబ్బ' గా మారే ప్రమాదం లేకపోలేదు. రెండు నెలల వరద జలాల కోసం ఎల్లకాలం పంటలుపండే సారవంతమైన వందల ఎకరాల పంట భూములను విధ్వంసానికి గురి చేయడం రాజ్యాంగ విరుద్ధమే గాక, ప్రకృతి విరుద్ధం కూడా. కాంగ్రెస్ ప్రభుత్వ అహంకార పూరిత ఏక



పక్ష ధోరణి వల్ల గార్ల మండల ఏజెన్సీ ప్రాంతం త్రిభుజాకార జలసంధిలో బంధించబడుతుంది. ఒకపక్క మున్నేరు, ఇంకో పక్క సీతారామ కాలువ, మరోపక్క మున్నేరుపాలేరు లింకు కాలువ, ఈమూడు జలప్రవహాల మధ్య గార్లఏజెన్సీ ప్రాంతం అరచేతిలో ప్రాణాలుపెట్టుకుని బిక్కుబిక్కుమంటూ బ్రతకాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కంటిముందే అద్భుతమైన ప్రత్యామ్నాయాలున్నప్పటికీ ప్రభుత్వం గాని, ఉన్నతాధికారులు గాని పట్టించుకోకపోవడం అవగాహన లోపమా! ఆధిపత్య ధోరణా! అనేది వారి విజ్ఞతకే తెలుసు. నిజంగా మున్నేరు నీళ్లను పాలేరుకు తరలించాలనే సదుద్దేశం ఉంటే, ఏజెన్సీని ముంచకుండానే పాలకులకు అనేక అద్భుతమైన, శాస్త్రీయమైన ప్రత్యామ్నాయ మార్గాలు అందుబాటులో ఉన్నాయి. సీతారామ కాలువ డోర్నకల్ వద్ద మున్నేరు మీదుగానే వెళ్తుంది. అక్కడ మున్నేరుపై ఒక లిఫ్ట్ ఏర్పాటు చేసి సులభంగా పాలేరుకు నీటిని ఎత్తిపోయవచ్చు.అలాగే ఖమ్మం వద్ద మున్నేరు మీదుగా నాగార్జున సాగర్ ఎడమ కాలువ వెళ్తుంది. అక్కడ లిఫ్ట్ ఏర్పాటు చేసుకుని నేరుగా సాగర్ కాలువ ద్వారా నీటిని మళ్లించుకోవచ్చు. 'ముల్కనూరు మున్నేరు రిజర్వాయర్' దశాబ్దాల కలగానే మిగిలిపోతుంది.పైన పేర్కొన్న తక్షణ మార్గాల కంటే అత్యంత శాశ్వతమైన, బహుళ ప్రయోజనకరమైన చారిత్రక ప్రత్యామ్నాయం. గత 80 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న మున్నేరు రిజర్వాయర్. గార్ల మండలం ముల్కనూరు గ్రామ పరిధిలోని అలిగేరు, పాఖాలేరు సంగమం వద్ద మున్నరుపై ఈ రిజర్వాయర్ నిర్మించాలన్న ప్రతిపాదన నాటి నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ డీటెయిల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్‌లోనే స్పష్టంగా ఉంది. ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా దీన్ని తలపెట్టినా, దశాబ్దాల పాలనలో అది నెరవేరని కలగానే మిగిలిపోయింది. మున్నేరు రిజర్వాయర్ నిర్మిస్తే బహుళ ప్రయోజనాలు గలవు. లింక్ కెనాల్ వల్ల జరిగే సర్వనాశనాన్ని పూర్తిగా నివారించవచ్చు. గార్ల, బయ్యారం, కారేపల్లి, కామేపల్లి, ఖమ్మం అర్బన్ రూరల్ డోర్నకల్, మరిపెడ, కురవి మండలాలకు సుమారు 60 వేల ఎకరాలకు గ్రావిటీ ద్వారా శాశ్వతంగా సాగు నీరు, ఆయా ప్రాంతాల ప్రజలకు త్రాగు నీరు అందించవచ్చు. ఇల్లందు, మహబూబాబాద్, ఖమ్మం పట్టణాలకు శాశ్వత తాగునీటి పరిష్కారం లభిస్తుంది. ప్రతి ఏటా ముంపునకు గురయ్యే ఖమ్మంపట్టణాన్ని వరదముప్పు నుండి శాశ్వతంగా రక్షించవచ్చు. మున్నేరు రిజర్వాయర్ మిగులు జలాలను పాలేరుకు తరలించడం ద్వారా పాలకులు తలపెట్టిన మున్నేరు పాలేరు లింకు కెనాల్ ప్రయోజనం కూడా నెరవేరుతుంది. ఇన్ని సులువైన, ప్రజాప్రయోజనకరమైన ప్రత్యామ్నాయ మార్గాలు కంటిముందు కనిపిస్తున్నప్పటికీ, వాటిని పూర్తిగా గాలికొదిలేసి ఏజెన్సీని అతలాకుతలం చేసే లింక్ కెనాల్ నిర్మాణానికే పూనుకోవడం అంటే అది ప్రజలతో కయ్యానికి కాలుదువ్వడమే అవుతుంది! ప్రజా సంక్షేమాన్ని విస్మరించి, నిరుపేద గిరిజనులపై తమ అధికారబలాన్ని ప్రదర్శించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. మున్నేరు మృతుల దిబ్బగా మారకముందే పాలకులు, ప్రజలు మేల్కోనాలి. కాంగ్రెస్ ప్రభుత్వం తమ అనాలోచిత నిర్ణయాలను పునరాలోచించుకోవాలి. గిరిజనుల ఉసురు పోసుకునే లింక్ కెనాల్ ప్రయత్నాన్ని వెంటనే విరమించి, మున్నేరు రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టాలి. లేని యెడల చైతన్యవంతమైన మున్నేరు పరీవాహక ప్రాంత ప్రజాగ్రహం ఉద్యమ రూపం దాల్చక తప్పదు!

ప్రజావాక్కు

ఆలోచించాలి

ఆహారం మన నిత్యజీవితంలో ఎంతోముఖ్యమైనది. ముఖ్యంగా బేకరీలు, స్వీట్‌షాపులు, ఇతర ఆహార పదార్థాల తయారీ కేంద్రాల్లో పరిశుభ్రమైన వాతావరణం, నాణ్యమైన ముడిపదార్థాలు, తగినజాగ్రత్తలు ఎంతో అవసరం. మిఠాయిలు, ఇతర తినుబండారాల తయారీలో ఉపయోగించే వస్తువులు తాజాగా, నాణ్యంగా ఉండటంతో పాటు వాటి గడువుతేదీలను కూడా తప్పనిసరిగా గమనించాలి. ఆహార పదార్థాల తయారీలో పరిశుభ్రతకు, నాణ్యతకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం ప్రజారోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. ఆహార పదార్థాల నాణ్యత, తయారీలో పాటిస్తున్నపరిశుభ్రతపై సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రజలకు నాణ్యమైన ఆహారం అందించాలనే లక్ష్యంతో అధికారులు, సిబ్బందిచేస్తున్న ఈ కృషి అభినందనీయం.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

ఐక్యతను చాటిన కర్ణాటక

భాషా ప్రయుక్త రాష్ట్రాల స్ఫూర్తి ఫలాలను చక్కగా అందిపుచ్చుకున్న రాష్ట్రంగా మనం కర్ణాటక రాష్ట్రాన్ని పేర్కొనవచ్చు.కర్ణాటకరాష్ట్రం ఏర్పడకముందు కన్నడిగులుముక్కలు, చెక్కలుగా ఇతర భాషీయులతో ఉన్నారు. మైసూరు, మద్రాసు, బొంబాయి, హైదరాబాదు, ఆంధ్ర, కూర్గ్‌లలో ఆరు ముక్కలుగా ఉన్న కన్నడిగులు 1నవంబరు 1956న ఒక్కటయ్యారు. వివిధ రాష్ట్రాలలో భిన్న సంస్కృతుల వారితో మసలిన కన్నడిగులు సొంత కర్ణాటక రాష్ట్రంగా ఏర్పడి వారి సంస్కృతీసంప్రదాయాలను పెంపొందించుకుంటూ భాషాపరంగా ఒక్క తాటిపై నిలిచి గెలిచారు. భాషా రాష్ట్రాల గమనానికి కర్ణాటక ప్రజల ఐక్యతను మన దేశ ప్రజలందరూ శ్లాఘించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

కూరగాయలకు అనుకూలం

తెలంగాణ కూరగాయలు సాగుకు యోగ్యమైంది. అయితే కూరగాయల పందిళ్ల కంటే ఆకు కూరల సాగు ఎక్కువ చేయించాలి. కూరగాయల సాగు కనిలతో కాకుండా వేదురు బొంగులతో లేదా వేదురు కర్రలతో చేయిస్తే రైతులకు లాభదాయకంగాఉంటుంది.కనీలు 100అవ్వడం మూలంగా ఖర్చు 70వేలు వస్తున్నది. రైతులకు ఏమి మిగలడం లేదు. దానికంటే వేదురు బొంగులతో కూరగాయల పందిళ్ల చేయడం వల్ల వేదురు సాగును కూడా చేపట్టొచ్చు.

-భారత అవినాష్, జనగామ

ఉద్యోగులకు నైపుణ్యాలే రక్షణ

కృత్రిమ మేధ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ఉద్యోగ భద్రతపై ఆందోళనలు పెరుగుతున్నాయి. అయితే సాంకేతిక పరిజ్ఞానాన్ని ముప్పుగా భావించడంకంటే దానిని సమర్థంగా వినియోగించుకునే నైపుణ్యాలను పెంపొందించుకోవడం అత్యంత అవసరం. పునరావృత పనులను కృత్రిమ మేధకు అప్పగించడం ద్వారా ఉద్యోగులు సృజనాత్మకత, మానవీయ స్పందన, విచక్షణ అవసరమైన బాధ్యతలపై దృష్టి సారించవచ్చు. అయితే కృత్రిమ మేధ వినియోగంలో పారదర్శకత తప్పనిసరి. ఉద్యోగుల పనితీరును అంచనా వేసే అల్గారిథమ్‌లలో పక్షపాతం లేకుండా చూడాలి.యంత్రాలు తీసుకునే నిర్ణయాలను ప్రశ్నించే అవకాశం ఉద్యోగులకు కల్పించాలి. కీలక నిర్ణయాల్లో మానవ పర్యవేక్షణకొనసాగాలి. స్వతంత్ర తనిఖీల ద్వారా సాంకేతిక వ్యవస్థల విశ్వసనీయతను నిర్ధారించాలి. ఆటోమేషన్ కారణంగా మారబోయే ఉద్యోగాలను సంస్థలు ముందుగానే గుర్తించాలి. కొత్తగా ఏర్పడే ఉపాధి అవకాశాలకు అనుగుణంగా ఉద్యోగులకు శిక్షణ అందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

విద్యార్థుల చదువులు?

పూర్వకాలంలో గురువులు విద్యార్థులకు విద్యాబోధన విజ్ఞాన అభివృద్ధి కోసం కొట్టి చెప్పడం దండించడం జరిగినది. నాటి విద్యార్థులు నేడు వివిధ రంగాలలో ఉన్నత స్థానంలో ఉన్నారు. కానీ నేడు విద్యార్థులను కనీసం మందులించినా, కొట్టినా దండించడం వలన గురువులు చాలా ఇబ్బంది పడుతున్నారు. నాణ్యమైన విద్య బోధన కోసం విద్యార్థులకు క్రమశిక్షణ అవసరం. అన్నిటి కంటే ముఖ్యంగా గురువు శిష్యుల బంధం ఉండాలంటే క్రమశిక్షణ అవసరం. విద్యా సంస్థలలో విద్యార్థుల హాజరు శాతం చాలా తక్కువగా ఉంటుంది. హాజరు అయినవిద్యార్థులు తరగతి గదులలో ఉండడం లేదు. నోట్స్ రాసుకోవడం లేదు. క్రమశిక్షణగా కూర్చోవడం లేదు. గురువులు చెప్పే పాటలు వినడం లేదు.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్

పేరు మార్చాలి

సనత్ నగర్‌లో కొత్తగా నిర్మించిన ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సు (టిమ్స్) హాస్పిటల్ పేరును పూర్వపు ముఖ్యమంత్రి డా. మర్రి చెన్నారెడ్డి పేరు పెట్టడం మిక్కిలి ముదావహం. ఇదే పేరుతో అల్వాల్ (టిమ్స్)లో కడుతున్న ఆసుపత్రికి దివంగత ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి పేరును పెడితే ఇంకా చాలా బాగుంటుంది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

'సర్‌పై చర్చకు ప్రత్యేక సెషన్!

అసత్యాలు ఆపి.. సభలో చర్చిద్దాం రండి

హర్యానా ర్యాలీలో రాహుల్‌కు అమిత్ షా సవాల్



కర్నాల్(హర్యానా), నవంబరు 5: 'ఎస్ఐఆర్‌'పై చర్చించడానికి పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని పిలవడానికి తాము సిద్ధంగా ఉన్నాము. అబద్ధాలు చెప్పడం ఆపండి అని కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాహుల్ గాంధీకి సవాల్ విసిరారు. గురువారం హర్యానాలోని కర్నాల్‌లో నిర్వహించిన 'లోక్‌తంత్ర బచావో, అనార్కీ హటావో' పాదయాత్ర ర్యాలీలో అమిత్ ప్రసంగిస్తూ, చర్చకు రాహుల్ గాంధీ చేసిన పిలుపును నేరుగా తిప్పికొడుతూ, ధైర్యముంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి అధికారికంగా లేఖ రాయాలని అమిత్ షా ఆయనకు సవాలు విసిరారు. సభలో నిజమైన చర్చలు జరపకుండా, దేశవ్యాప్తంగా అరాచకాన్ని, అశాంతిని వ్యాప్తి చేయడానికి కాంగ్రెస్ నాయకుడు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు అధికారికంగా చర్చను కోరాలని షా అడిగారు. ఒకవేళ కాంగ్రెస్ అభ్యర్థిస్తే, పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. "మీరు (రాహుల్ గాంధీ) బాధ్యతాయుతమైన చర్చలో పాల్గొనాలని కోరుకుంటే, మీ ఆందోళనలలో నిజం, సారం, తర్కం ఉంటే, పార్లమెంటు లోపలికి వచ్చి వాటిని చర్చించండి. మనం ముఖాముఖిగా ఎదుర్కొందాం. కానీ మీరు సమాధానాలను తట్టుకోలేరు. ఎప్పటిలాగే, మీరు కేవలం పారిపోతార్లు అని షా ఎద్దేవా చేశారు. కేవలం బహిరంగంగా సవాలు విసరడం సరిపోదని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్)పై చర్చించేందుకు ప్రభుత్వం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ డిమాండ్ చేయడంపై కూడా షా విమర్శలు గుప్పించారు. తమ ఎన్నికల ఓటములకు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియే కారణమని కాంగ్రెస్ ఎందుకు నిందిస్తోందని ఆయన ప్రశ్నించారు. 2014, 2019, 2024 లోక్‌సభ ఎన్నికల్లో, అప్పట్లో ఎటువంటి ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ (ఎస్ఐఆర్) లేకపోయినప్పటికీ కాంగ్రెస్ ఓడిపోయిందని ఆయన గుర్తు చేశారు. "2014లో ఎస్ఐఆర్ ఎక్కడ ఉంది? అప్పుడు కూడా మీరు పూర్తిగా తుడిచిపెట్టుకుపోయారు కదా! 2019లో ఎస్ఐఆర్ ఎక్కడ ఉంది? అప్పుడు కూడా ఓడిపోయారు. 2024లో కూడా ఎస్ఐఆర్ లేదు, అయినా ఓడిపోయారు. హర్యానాలో గానీ, మహారాష్ట్రలో గానీ ఎస్ఐఆర్ లేదు... అయినా ప్రతిచోటా ఓడిపోయారు. మీరు పార్లమెంటును సజావుగా సాగనివ్వకుండా, వీధుల్లో జనాలను పోగుచేసి అరాచక పరిస్థితులను సృష్టిస్తున్నారు. పార్లమెంటులో కేవలం గందరగోళం సృష్టిస్తూ, బహిష్కరణలకు పాల్పడుతున్నార్లు అని ఆయన విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనల నేపథ్యంలో రాహుల్ గాంధీని ఉద్దేశించి షా మరో వ్యాఖ్య చేశారు. కాంగ్రెస్ వైఖరిని, కబడ్డీ ఆటలో ఓడిపోతున్న జట్టు రిఫరీనే మోసగాడని నిందించినట్లుగా ఆయన పోల్చారు. తాను ఏడవ తరగతిలో ఉన్నప్పుడు, తమ జట్టు తొమ్మిదవ తరగతి విద్యార్థుల జట్టును పదేపదే ఓడించిందని, అప్పుడు ఆ సీనియర్ విద్యార్థులు గెలవడం కోసం రిఫరీనే మోసగాడని నిందించారని షా గుర్తు చేశారు.

'24 గంటలు' పై హద్దు దాటొద్దు



అరెస్టు, అదుపు మధ్య కృత్రిమ వ్యత్యాసం వద్దు

అదుపులోకి తీసుకున్న క్షణం నుంచే డెడ్‌లైన్

పరిమితి దాటితే తక్షణమే విడుదల చేయాలి: సుప్రీం కోర్టు విస్పష్టతీర్పు

న్యూఢిల్లీ, నవంబరు 5: పౌరుల ప్రాథమిక హక్కులు, వ్యక్తిగత స్వేచ్ఛ పరిరక్షణ దిశగా భారత అత్యున్నత న్యాయస్థానం అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం, అధికారికంగా అరెస్టు చేయడం మధ్య పోలీసులు చూపే కృత్రిమ వ్యత్యాసాలకు ఇకపై ఎలాంటి రాజ్యాంగ చెల్లుబాటు ఉండదని స్పష్టం చేసింది. ఏ రకమైన నిర్బంధంలోనైనా ఉన్న వ్యక్తిని చట్టప్రకారం 24 గంటల వ్యవధి లోనే స్థానిక మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత అని న్యాయస్థానం పునరుద్ఘాటించింది. రాజ్యాంగం లోని ఆర్టికల్ 22(2) ప్రకారం 24 గంటల కస్టడీ కాలాన్ని గణించేటప్పుడు.. నిందితుడిని మెజిస్ట్రేట్ కోర్టుకు తరలించడానికి పట్టే నిజమైన ప్రయాణ సమయాన్ని మాత్రమే మినహాయించడానికి అవకాశం ఉంటుందని న్యాయమూర్తులు తేల్చి చెప్పారు. విచారణ సజావుగా సాగడానికంటూ పోలీసులు తమకు తోచినట్లుగా అదనపు కాలాన్ని కల్పించుకోవడం లేదా 'ఇన్వెస్టిగేటివ్ బఫర్ పీరియడ్స్' పేరిట కాలయాపన చేయడం ఎంత మాత్రమూ కుదరదని కోర్టు హెచ్చరించింది. 24 గంటల గడువు దాటిన తర్వాత కూడా మెజిస్ట్రేట్ అనుమతి లేకుండా ఎవరినైనా కస్టడీలో ఉంచితే.. ఆ నిర్బంధం చట్టవిరుద్ధం అవుతుందని, అలాంటి వ్యక్తిని తక్షణమే విడుదల చేయాల్సి ఉందేనని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. బిఎన్ఎస్ఎస్ సెక్షన్ 58 ప్రకారం.. ఒకరిని నిర్బంధంలో ఉంచడం అనేది 24 గంటల పరిమితి లోపు ఉన్నప్పటికీ, అది హేతుబద్ధంగా, న్యాయబద్ధంగా ఉండాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. పౌరుల రాజ్యాంగ హక్కులను కాపాడటంలో న్యాయమూర్తులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చింది. పోలీసు అధికారులు ఒక వ్యక్తిని ఏ రోజున, ఏ సమయానికి అదుపులోకి తీసుకున్నారనే అసలు వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఆర్టికల్ 22(2) నిబంధనలను పాటించారో లేదో మెజిస్ట్రేట్‌లు క్షుణ్ణంగా తనిఖీ చేయాలని నిర్దేశించింది. ఒకవేళ పోలీసుల నిర్బంధ కాలం 24 గంటల పరిమితికి లోబడే ఉన్నప్పటికీ.. ఆ నిర్బంధం అనుమానాస్పదంగా లేదా అనుచితంగా ఉందని భావిస్తే నిందితుడికి రిమాండ్ విధించడానికి మెజిస్ట్రేట్‌లు నిరాకరించవచ్చని అత్యున్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. పోలీసుల విచారణల పేరుతో జరిగే అక్రమ నిర్బంధాలకు, అధికారా దుర్వినియోగానికి అడ్డుకట్ట వేస్తూ సుప్రీంకోర్టు విస్పష్ట తీర్పు నిచ్చింది. ఈ తీర్పు న్యాయ వర్గాల్లో, పౌర హక్కుల వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

ఇక విశ్రాంతి తీసుకోండి.. సుప్రియ చూసుకుంటారు!

శరద్‌పవార్‌కు ప్రధానిమోడీ పరామర్శ

ముంబయి, నవంబరు 5: మహారాష్ట్ర రాజకీయాల్లో మరోసారి పవార్ కుటుంబం చుట్టూ చర్చ మొదలైంది. ఎన్సీపీ (ఎస్పీ) అధినేత శరద్ పవార్‌కు ప్రధాని నరేంద్ర మోడీ ఫోన్ చేయడం ఆసక్తికర పరిణామాలకు దారితీసింది. ఆయన కుమార్తె, ఎంపీ సుప్రియా సూలే ప్రస్తావన రావడం రాజకీయ వర్గాల్లో మరింత చర్చకు కారణమైంది. సుప్రియా సిద్ధంగా ఉన్నారు. దేశ బాధ్యతలను ఆమె చూసుకుంటారు. మీరు విశ్రాంతి తీసుకోండి అని మోడీ చెప్పినట్లు శరద్ పవార్ సన్నిహితుడు విఠల్ మణియార్ వెల్లడించారు. దీంతో ఎన్సీపీ వర్గాల విలీనం, సుప్రియా సూలేకు కేంద్ర మంత్రివర్గంలో చోటు వంటి అంశాలపై ఊహాగానాలు ఊపందుకున్నాయి. శరద్ పవార్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకునేందుకు బుధవారం ఉదయం మోడీ ఫోన్ చేసినట్లు మణియార్ తెలిపారు. ఇటీవల దగ్గు, ఛాతీ నొప్పితో పుణెలోని రూబీ హాల్ క్లినిక్‌లో పవార్ చేరారు. అక్కడ వైద్య పరీక్షలు పూర్తయ్యాక డిశ్చార్జ్ అయ్యారు. అనంతరం ముంబయిలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో తదుపరి పరీక్షల కోసం చేరారు. మోడీ ఫోన్‌లో విశ్రాంతి తీసుకోవాలని సూచిం చినట్లు మణియార్ చెప్పారు. 2023లో అజిత్ పవార్ తిరుగుబాటుతో ఎన్సీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. బీజేపీ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వంలో అజిత్ వర్గం కొనసాగింది. 2026 జనవరిలో విమాన ప్రమాదంలో అజిత్ మరణించడంతో విలీన చర్చలు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఆయన భార్య సునేత్ర పవార్ ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారు. ఇటీవల అజిత్ వర్గానికి చెందిన నేతలు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో సమావేశమవడం కూడా చర్చకు దారితీసింది. ముంబయిలో జరిగిన కోర్ కమిటీ సమావేశం అనంతరం రెండు వర్గాల విలీనానికి అవకాశం లేదని మహారాష్ట్ర ఎన్సీపీ అధ్యక్షుడు సునీల్ తత్కారే ప్రకటించారు. సునేత్ర పవార్ నాయకత్వంలోనే పనిచేస్తామని స్పష్టం చేశారు. అయితే అమిత్ షాతో జరిగిన సమావేశంలో విలీన అంశం ప్రస్తావనకు వచ్చిందని తెలిపారు. మరోవైపు శరద్ పవార్ గతంలో ఎన్డీయేకు అనుకూలంగా ఉన్న ఎన్సీపీ వర్గంతో విలీనం ఉండదని స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మోడీ ఫోన్ రాజకీయంగా ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.



భారత్ చైనా, ఇరాక్, ఖతార్ నౌకలకు స్వేచ్ఛా నౌకాయానం

నిబంధనలు సడలించిన ఇరాన్

టెహ్రాన్, నవంబరు 5: హర్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఇరాన్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ జలమార్గం గుండా ప్రయాణించే భారత వాణిజ్య నౌకలకు ప్రత్యేక అనుమతులు మంజూరు చేసింది. ఇరాన్ పార్లమెంటుకు చెందిన జాతీయ భద్రత, విదేశాంగ విధాన కమిటీ వైస్ ఛైర్మన్ హయత్ మొఘద్దమ్ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. భారత్‌తో పాటు చైనా, ఇరాక్, ఖతార్ దేశాల వాణిజ్య నౌకల రాకపోకలపై హర్మూజ్ జలసంధిలో ఎలాంటి ఆంక్షలు ఉండవని హయత్ మొఘద్దమ్ స్పష్టం చేశారు. ఈ దేశాల నౌకలు యథేచ్ఛగా ప్రయాణించవచ్చని, అమెరికా సైతం వీటిని అడ్డుకోకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయ నివేదికల ప్రకారం చైనాకు రాజకీయ కారణాలతో, భారత్‌కు ప్రధానంగా ఔషధాల దిగుమతిని సులభతరం చేసేందుకు ఈ వెసులుబాటు కల్పించి నట్లు తెలుస్తోంది. అయితే, భారత్, చైనా దేశాల నౌకలు ఈ మార్గంలో ప్రయాణించేందుకు నిర్దేశిత ట్రాన్సిట్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. మరోవైపు, ఖతార్ నౌకలకు మాత్రం ఎటువంటి రుసుము లేకుండానే అనుమతి కల్పించడం గమనార్హం. ప్రపంచ వాణిజ్యం, చమురు రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో చోటుచేసుకున్న ఈ పరిణామం అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

అమెరికా చట్టసభల్లోకి 30 మందికిపైగా ప్రవాస భారతీయులు!

వాషింగ్టన్, నవంబరు 5: అగ్రరాజ్యం అమెరికా రాజకీయాల్లో భారత సంతతి అభ్యర్థులు తమ సత్తా చాటారు. తాజాగా జరిగిన ఎన్నికల్లో సుమారు 30 మందికి పైగా భారతీయ అమెరికన్లు చట్టసభలకు ఎన్నికై తమ ప్రాబల్యాన్ని చాటుకున్నారు. ముఖ్యంగా రెండు కీలక రాష్ట్రాలైన మిచిగన్, అరిజోనాలలో శాసనసభలకు నాయకత్వం వహించే స్థాయికి ఎదిగి చారిత్రక విజయాలను నమోదు చేశారు. గెలిచిన వారిలో అత్యధికులు డెమోక్రాటిక్ పార్టీకి చెందిన వారే కావడం గమనార్హం. మిచిగన్ రాష్ట్రంలో డెమోక్రాట్లు తిరిగి అధికారం కైవసం చేసుకోవడంలో రంజీవ్ పురి కీలక పాత్ర పోషించారు. ఆయన 24వ డిస్ట్రిక్ట్ నుంచి 66 ఓట్లతో ఘన విజయం సాధించారు. డెమోక్రాటిక్ కాకస్ ఆయనను ఎన్నుకుంటే, మిచిగన్ ప్రతినిధుల సభకు స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టే తొలి భారతీయ అమెరికన్, తొలి సిక్కుగా రికార్డు సృష్టిస్తారు. మిచిగన్ ప్రజలు మార్పు కోరుకున్నారని, అందుకే డెమోక్రాట్లకు అధికారం అప్పగించారని రంజీవ్ పురి వ్యాఖ్యానించారు. అరిజోనాలోనూ ఇదే తరహాలో ప్రియా సుందరేశన్ సెనేట్‌కు తిరిగి ఎన్నికయ్యారు. 18వ డిస్ట్రిక్ట్ నుంచి 66 ఓట్లతో గెలిచిన ఆమె, రాష్ట్ర సెనేట్‌కు నాయకత్వం వహించే అవకాశా లున్నాయి. సెనేట్ ప్రెసిడెంట్ లేదా మెజారిటీ లీడర్ పదవికి ఆమె పోటీ పడుతున్నట్లు తెలుస్తోంది. జనవరి నాటికి తమ పార్టీ మూడు కీలక పదవులను (ట్రైఫెక్టా) దక్కించు కుంటుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఇదే సమయంలో, పలువురు భారత సంతతి అభ్యర్థులు చారిత్రక విజయాలు నమోదు చేశారు. జార్జియాలో జ్యోత్ సింగ్ గెలుపొంది, ఆ రాష్ట్ర శాసనసభకు ఎన్నికైన తొలి భారతీయ, సిక్కు అమెరికన్‌గా నిలిచారు. టెక్సాస్‌లో పూజా సేథి విజయం సాధించి, టెక్సాస్ శాసనసభకు ఎన్నికైన తొలి భారతీయ అమెరికన్ మహిళగా, తొలి ఆసియన్ అమెరికన్ డెమోక్రాటిక్ మహిళగా చరిత్ర సృష్టించారు. లాస్ ఏంజెలెస్‌లో నగర కౌన్సిల్ సభ్యురాలు నిత్యా రామన్, మేయర్ రేసులో ఆధిక్యంలో కొనసాగుతున్నారు.



ఇల్లినాయిస్‌లో నబీలా సయ్యద్, న్యూయార్క్‌లో లీసా కౌల్ వంటి వారు రిపబ్లికన్ల సిట్టింగ్ స్థానాలను కైవసం చేసుకుని డెమోక్రాట్లకు అదనపు బలాన్నిచ్చారు. మొత్తం మీద ఈ ఎన్నికల్లో సిట్టింగులుగా పోటీ చేసిన భారతీయ అమెరికన్లందరూ తిరిగి గెలుపొందడం విశేషం. గెలిచిన 30 మందిలో 28 మంది డెమోక్రాట్లే కావడం, వారి గెలుపు శాతం 85 గా ఉండటం గమనార్హం. ఈ ఫలితాలు అమెరికా రాజకీయ క్షేత్రంలో భారతీయ సమాజం పెరుగుతున్న ప్రభావాన్ని, రాజకీయ చైతన్యాన్ని స్పష్టం చేస్తున్నాయి.

అధ్యక్ష రేసులోకి జెడివాన్స్!

ఉపాధ్యక్షుడు పావులు కదుపుతున్నారంటూ ఊహాగానాలు



వాషింగ్టన్, నవంబరు 5: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో ఎదురైన పరాభవం అధ్యక్షుడు ట్రంప్‌ను ఇరకాటంలో పడేయడంతో ఇదే అదునుగా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ 2028 అధ్యక్ష ఎన్నికల కోసం పావులు కదుపుతున్నారనే ఊహాగానాలు జోరందుకున్నాయి. కాంగ్రెస్‌లోని ఉభయ సభల్లో డెమోక్రాట్లు ఆధిక్యం సాధించిన నేపథ్యంలో, పార్టీ ఓటమికి గల కారణాలను విశ్లేషిస్తూ వాన్స్ చేసిన సుదీర్ఘ సోషల్ మీడియా పోస్ట్ ఈ చర్చకు మరింత ఆజ్యం పోసింది. ఇరాన్ యుద్ధం, పెరిగిన జీవన వ్యయం, ద్రవ్యోల్బణం వంటి అంశాలే రిపబ్లికన్ల ఓటమికి ప్రధాన కారణాలని వాన్స్ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. 2024లో ట్రంప్‌వాన్స్ కూటమికి ఓటు వేసిన చాలామంది ఓటర్లు ఈసారి డెమోక్రాట్ల వైపు మొగ్గు చూపారని, పోల్స్‌ను ఉటంకిస్తూ ఆయన వివరించారు. మన ఓటమికి ప్రధాన కారణం యుద్ధమే. ఈ విషయాన్ని స్వయంగా అధ్యక్షులే చెప్పారని వాన్స్ రాశారు. యుద్ధాన్ని ముగించడం, ఆర్థిక అంశాలపై దృష్టి పెట్టడం, అమెరికా ఫస్ట్ విధానాన్ని అనుసరించడం, ఇజ్రాయెల్‌తో సంబంధాలను మార్చుకోవడం వంటి కారణాలతో ఓటర్లు పార్టీకి దూరమయ్యారని తెలిపారు. ఈ సంక్షోభ సమయంలో అంతర్గత విమర్శలకు బదులు, ఓటమికి గల కారణాలపై నిజాయతీగా సమీక్షించుకోవాలని వాన్స్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఇరాన్ వివాదానికి దౌత్యపరమైన పరిష్కారం కనుగొనాలని, వలస విధానంలో మార్పులు తీసుకురావాలని ఆయన సూచించారు. మరోవైపు, వైట్ హౌస్‌లో మీడియాతో మాట్లాడిన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాన్స్ ప్రకటన మంచిదే అని వ్యాఖ్యానించారు. అయితే, 2028లో వాన్స్ అధ్యక్ష పదవికి పోటీ చేస్తారా అనే ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. ఏం జరుగుతుందో చూద్దాం. ఎవరు పోటీ చేస్తారో ఇప్పుడే చెప్పలేం. బహుశా ఆయన పోటీ చేయకపోవచ్చు అంటూ దాటవేశారు.


ట్రంప్‌కు ఇరాన్‌తో మరిన్ని సవాళ్లు!



వాషింగ్టన్, నవంబరు 5: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఇరాన్‌తో కొనసాగుతున్న వివాదం విషయంలో కొత్త సవాళ్లను విసురుతున్నాయి. ఈ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ పరాజయం పాలవడం, కాంగ్రెస్‌పై డెమోక్రాట్లు పట్టు సాధించడంతో ఇరాన్‌పై సైనిక చర్యలు చేపట్టే విషయంలో ట్రంప్‌కు ఉన్న స్వేచ్ఛకు కళ్లెం పడినట్లయింది. యుద్ధం కారణంగా జీవన వ్యయం పెరిగిందన్న అమెరికన్ ఓటర్ల అభిప్రాయం కూడా ఈ ఒత్తిడిని మరింత పెంచుతోంది. ఈ ఏడాది మొదట్లో అమెరికాఇజ్రాయెల్ సంయుక్తంగా దాడులు ప్రారంభించడంతో ఇరాన్‌తో వివాదం మొదలైంది. ఈ దాడులతో ఇరాన్ సైనిక సామర్థ్యానికి కొంత నష్టం వాటిల్లినా, దాని అణు కార్యక్రమం, హర్మూజ్ జలసంధిలో నౌకాయాన భద్రత వంటి కీలక అంశాలు మాత్రం పరిష్కారం కాలేదు. ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికా యుద్ధాన్ని మరింత విస్తృతం చేయడం కంటే చర్చల ద్వారా ఒక ముగింపునకు రావాలని ప్రయత్నిస్తుందని గల్ఫ్ దేశాల అధికారులు, విశ్లేషకులు భావిస్తున్నారు. గల్ఫ్ ప్రభుత్వ వర్గాల సమాచారం ప్రకారం, ఇరాన్‌పై పూర్తిస్థాయి దాడి జరిగే అవకాశాలు తక్కువ. అణు కేంద్రాలపై పరిమిత దాడులు చేసి, నిర్దేశిత లక్ష్యాలను చేరుకున్నామని ప్రకటించి, యుద్ధాన్ని ముగించడం ఒక మార్గంగా కనిపిస్తోంది. చైనా మధ్యవర్తిత్వ ప్రయత్నాలు కూడా ఈ దిశగానే సాగుతున్నాయి. మరోవైపు, ప్రస్తుత నౌకా దిగ్బంధనం, ఆర్థిక ఆంక్షలను కొనసాగిస్తూనే చర్చలకు ఇరాన్ సుముఖతను పరీక్షించడం మరో వ్యూహం. ఇరుపక్షాలు పరిస్థితిని తప్పుగా అంచనా వేసే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. ఎన్నికల ఒత్తిళ్లు లేకపోవడంతో, ఇరాన్ విజయం సాధించిందన్న భావనను నివారించేందుకు ట్రంప్ మళ్లీ దూకుడుగా వ్యవహరించే అవకాశం లేకపోలేదని కొందరు వాదిస్తున్నారు. మరోవైపు, అమెరికాకు లొంగిపోయే ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేస్తోంది. అమెరికా ఎన్నికల ఫలితాలను తమ దేశ ప్రజలు యుద్ధాన్ని తిరస్కరించడంగా టెహ్రాన్ అభివర్ణిస్తోంది. ఇదే సమయంలో ఇజ్రాయెల్‌లో ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సంకీర్ణ ప్రభుత్వం కూడా రాజకీయంగా బలహీనపడటం ఈ సమీకరణాలను మరింత సంక్లిష్టం చేస్తోంది. వాషింగ్టన్ వైఖరిని టెహ్రాన్ ఎలా అర్థం చేసుకుంటుందన్న దానిపైనే దౌత్యమార్గం ముందుకు వెళ్తుందా లేక ఉద్రిక్తతలు పెరుగుతాయా అనేది ఆధారపడి ఉంది.

సంక్షిప్త వార్తలు

లాస్‌ఏంజెల్స్ మేయర్‌గా కేరళ మహిళ నిత్యారామన్!




లాస్‌ఏంజెల్స్, నవంబరు 5: అమెరికా రాజకీయాల్లో భారత సంతతికి చెందిన వారు మరోసారి తమ సత్తా చాటారు. ప్రపంచ ప్రఖ్యాత నగరం లాస్ ఏంజెలెస్ మేయర్ ఎన్నికల్లో భారత సంతతికి చెందిన నిత్యా రామన్ చారిత్రక విజయం సాధించారు. సిట్టింగ్ మేయర్ కరెన్ బాస్‌పై ఆమె గెలుపొందనున్నారని ఎన్నికల ఫలితాల సరళిని విశ్లేషించిన డిసిషన్ డెస్క్ హెచ్‌క్యూ తన కథనంలో పేర్కొంది.

కేదార్‌నాథ్‌లో తగ్గని భక్తుల రద్దీ

రుద్రప్రయాగ్, నవంబరు 5: ప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేదార్‌నాథ్ యాత్ర ముగింపు దశకు చేరుకున్నప్పటికీ ఆలయానికి భక్తుల రాక నిరంతరాయంగా కొనసాగుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రుద్ర ప్రయాగ్ జిల్లా యంత్రాంగం కేదార్‌నాథ్ ధామంతోపాటు మొత్తం యాత్రా మార్గంలోని పరిస్థితులను కంట్రోల్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తోంది. అక్కడి పరిస్థితులపై రుద్ర ప్రయాగ్ జిల్లా మెజిస్ట్రేట్ (డీఎం) విశాల్ మిశ్రా మీడియాతోమాట్లాడుతూ కేదార్ నాథ్ ఆలయాన్ని ఇప్పటివరకు సుమారు 19 లక్షల మంది భక్తులు దర్శించుకున్నారు.

600 మిలియన్ డాలర్లు ఇవ్వండి: మైఖేల్ జాక్సన్ కుమార్తె



లాస్ ఏంజిల్స్, నవంబరు 5: పాప్ స్టార్ మైఖేల్ జాక్సన్ మృతి చెంది 17 యేళ్లు అవుతోంది. ఆ మూన్‌వాకర్ తన ముగ్గురు పిల్లలకు ట్రస్టు రాసిచ్చేశాడు. అయితే మైఖేల్ జాక్సన్ కుమార్తె పారిస్ జాక్సన్ ఇప్పుడు కోర్టును ఆశ్రయించారు. సింగర్ జాక్సన్ చెందిన ఎస్టేట్ నుంచి సుమారు 600 మిలియన్ల డాలర్లను ట్రస్టుకు బదలీ చేయాలని పారిస్ జాక్సన్ లాస్ ఏంజిల్స్ కోర్టులో కేసు వేసింది. మైఖేల్ జాక్సన్ మ్యూజిక్స్ డీల్స్, ప్రాపర్టీ సేల్స్ ద్వారా ఎస్టేట్‌కు బిలియన్ల డాలర్ల ఆదాయం వస్తోందని, కానీ ఫ్యామిలీ ట్రస్ట్‌కు ఎటువంటి రాబడి లేదని, అందుకే ఎస్టేట్ ఆదాయం లోని 600 మిలియన్ల డాలర్లను ఫ్యామిలీ ట్రస్టుకు బదలీ చేయాలని పారిస్ జాక్సన్ కోరింది.

జంతర్‌మంతర్ బారికేడ్లను తొలగించిన ఢిల్లీ పోలీసులు!

న్యూఢిల్లీ, నవంబరు 5: ఢిల్లీలోని ప్రసిద్ధ ప్రదర్శన స్థలమైన జంతర్ మంతర్ ప్రాంతానికి చెందిన రోడ్డు దాదాపు 20 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత మళ్లీ పూర్తిగా తెరుచుకుంది. భద్రతా సమీక్ష అనంతరం, రాజధానిలో ప్రస్తుతం ప్రశాంత వాతావరణం నెలకొనడంతో ఇక్కడ ఏర్పాటు చేసిన భారీ బారికేడ్లను పూర్తిగా తొలగించాలని ఢిల్లీ పోలీసులు కీలక నిర్ణయం తీసుకున్నారు.

గత రెండు దశాబ్దాలుగా ఇక్కడ ఉన్న శాశ్వత, తాత్కాలిక నాకాబంధీలు తొలగించడంతో అశోక్ రోడ్డును టాల్‌స్టాయ్ మార్గ్‌తో కలిపే ఈ ప్రధాన రహదారిలో సాధారణ వాహనాల రాకపోకలు పునఃప్రారంభ మయ్యాయి.

ఆరేళ్ల చిన్నారిపై దాడిచేసిన బాలుడికి బెయిల్!


పంచ్‌కుల, నవంబరు 5: ప్రభుత్వ పాఠశాలలో ఆరేళ్ల చిన్నారిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన కేసులో నిందితుడిగా ఉన్న ఎనిమిదేళ్ల బాలుడికి జువైనల్ జస్టిస్ బోర్డు బెయిల్ మంజూరు చేసింది. అదే సమయంలో, ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియా నుంచి తక్షణమే తొలగించాలని అధికారులను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

అక్టోబర్ 28న హరియాణా పంచ్‌కులలోని సెక్టార్ 20లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఈ దారుణ ఘటన చోటుచేసుకుంది.

సిజెపికి విదేశీ నిధులు : కేంద్ర మంత్రి జితేంద్రసింగ్

బెంగళూరు, నవంబరు 5: దేశంలో అశాంతిని రెచ్చగొట్టేందుకు కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ), దాని కీలక సభ్యులు విదేశీ లాభాపేక్ష లేని సంస్థలు, శత్రు నెట్‌వర్క్‌ల నుంచి అక్రమంగా నిధులు పొందుతున్నారని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలతో దేశ రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. బెంగళూరులో విలేకరులతో మాట్లాడిన జితేంద్ర సింగ్, సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే, వ్యూహకర్త అశుతోష్ రాంకాలకు విదేశీ నిధులు అందించే సంస్థలతో సంబంధాలున్నాయని చెప్పడానికి తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని స్పష్టం చేశారు. "వారికి అనధికారిక మార్గాల ద్వారా, దేశ వ్యతిరేక ఎన్జీఓల నుంచి, దేశంలో, విదేశాల్లో ఉన్న భారత వ్యతిరేక సంస్థల నుంచి నిధులు అందుతున్నాయని చెప్పడానికి తగిన ఆధారాలున్నాయి. అభిజీత్ దీప్కేకు అమెరికాకు చెందిన దాతల నుంచి, అశుతోష్ రాంకాకు పాకిస్థానీ రాజకీయ నాయకుల నుంచి డబ్బు అందుతోంది" అని సింగ్ వివరించారు. ఈ ఆరోపణలకు బలం చేకూరుస్తూ బీజేపీ అధికార ప్రతినిధి తుహిన్ ఎ సిన్హా కూడా సీజేపీపై తీవ్ర విమర్శలు చేశారు. పండుగల సీజన్‌లో దేశ రాజధానిలో గందరగోళం సృష్టించేందుకే సీజేపీ ఇటీవలి నిరసనలను చేపట్టిందని ఆయన ఆరోపించారు. గత నెల రోజులుగా సీజేపీ ఎత్తుగడలన్నీ తిరుగుబాటును సృష్టించడానికే. పండుగ సమయంలో దేశ రాజధానిలో అరాచకాన్ని సృష్టించడమే వారి దురుద్దేశమని అన్నారు. సీజేపీ, కాంగ్రెస్ పార్టీ రెండూ న్యాయవ్యవస్థను లక్ష్యంగా చేసుకున్నాయని, రాహుల్ గాంధీ సుప్రీంకోర్టుకు వెళ్లడం వంటి చర్యలు దీనికి నిదర్శనమని సిన్హా పేర్కొన్నారు. ఈ రాజకీయ ఆరోపణల నేపథ్యంలో ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ సీజేపీ ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఈరోజు విచారణకు హాజరు కావాలని సమన్లు జారీ చేసింది. నిషేధాజ్ఞలను ఉల్లంఘించడం, అనుమతి లేకుండా జంతర్ మంతర్‌లోకి ప్రవేశించడం, ఇతరుల ఆస్తిలోకి అతిక్రమించారన్నారు.

డెమొక్రాట్ అధ్యక్ష అభ్యర్థుల రేసులో జాన్ ఓసాఫ్



వాషింగ్టన్, నవంబరు 5: అమెరికా మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి కీలక విజయాలు దక్కిన వేళ ఆ పార్టీ యువ నాయకుడు జాన్ ఒసాఫ్ పేరు ఒక్కసారిగా మార్మోగుతోంది. జార్జియా రాష్ట్రం నుంచి సెనేట్‌కు మరోసారి ఎన్నికైన ఆయన 2028 అధ్యక్ష ఎన్నికల్లో డెమోక్రాట్ల తరఫున బరిలోకి దిగవచ్చనే చర్చ మొదలైంది. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామాతో పోలికలు రావడం ఈ ఆసక్తిని మరింత పెంచుతోంది. 39 ఏళ్ల ఒసాఫ్ 2021లో తొలిసారి జార్జియా నుంచి సెనేటర్‌గా ఎన్నికయ్యారు. అప్పటికి ఆయన వయసు 33 ఏళ్లు మాత్రమే. స్వల్ప ఆధిక్యంతో గెలవడంతో రాజకీయ విశ్లేషకులు ఆయనను అనుకోకుండా సెనేటర్ అయిన వ్యక్తిగా అభివర్ణించారు. ఐదేళ్ల తర్వాత ఇప్పుడు అదే రాష్ట్రంలో తిరిగి విజయం సాధించారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో డొనాల్డ్ ట్రంప్‌కు మద్దతు లభించిన జార్జియాలో ఒసాఫ్ గెలవడం విశేషం. రిపబ్లికన్ అభ్యర్థి మైక్ కాలిన్స్‌ను ఓడించి తన స్థానాన్ని నిలబెట్టుకున్నారు. ఎన్నికల ప్రచారంలో ట్రంప్ పాలనపై ఒసాఫ్ తీవ్ర విమర్శలు చేశారు. అధ్యక్షుడు, ఆయన కుటుంబంపై అవినీతి ఆరోపణలు చేస్తూ.. ప్రభుత్వ విధానాలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారాయని విమర్శించారు. ఎన్నికల ఫలితాల అనంతరం అట్లాంటాలో జరిగిన సభలోనూ ట్రంప్ పాలనపై ఘాటుగా స్పందించారు. అమెరికా ప్రజలు అవినీతి, అసమర్థతను తిరస్కరించారని వ్యాఖ్యానించారు. ఒసాఫ్ ప్రసంగ శైలి, ప్రజలను ఆకట్టుకునే తీరు, యువ నాయకుడిగా ఆయనకున్న ఇమేజ్ ఒబామాను గుర్తు చేస్తున్నాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఒబామా కూడా ఎన్నికలకు ముందు ఒసాఫ్‌కు మద్దతుగా ప్రచారం చేశారు. ఆయన తన రాజకీయ గురువు జాన్ లూయిస్ నుంచి ప్రజాసేవలోని విలువలు నేర్చుకున్నారని ప్రశంసించారు. 2028లో అధ్యక్ష పదవికి పోటీ చేసే ఆలోచన లేదని ఒసాఫ్ గతంలో స్పష్టం చేశారు.

పౌరవిమానయానరంగంలో కొత్త నిబంధనలకు శ్రీకారం

94 యేళ్లనాటి బూజుపట్టిన చట్టానికి చెల్లుచీటీ

న్యూఢిల్లీ, నవంబరు 5: దేశ పౌర విమానయాన రంగంలో చారిత్రక సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దాదాపు 94 ఏళ్లుగా అమల్లో ఉన్న 1937 నాటి ఎయిర్‌క్రాఫ్ట్ రూల్స్ స్థానంలో "భారతీయ వాయుయాన్ నియమ్2026" పేరుతో సమగ్రమైన కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. వేగంగా విస్తరిస్తున్న విమానయాన రంగాన్ని నియంత్రించేందుకు రూపొందించిన ఈ నిబంధనలు 2027 జనవరి 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఈ మేరకు ప్రభుత్వం అధికారికంగా వివరాలు వెల్లడించింది. ఈ కొత్త నిబంధనలలో పలు కీలక మార్పులు చేశారు. ముఖ్యంగా, విమానాల డిజైన్, సర్టిఫికేషన్ కోసం స్పష్టమైన వ్యవస్థను ఏర్పాటు చేశారు. దీనివల్ల స్టేట్ ఆఫ్ డిజైన్‌గా (విమానాలను డిజైన్ చేసే దేశం) భారత్ స్థానం మరింత బలోపేతం కానుంది. విమానాల విడిభాగాల తయారీకి కూడా అధికారం లభిస్తుంది. దీంతో పాటు ఒక విమానాన్ని పలువురు వ్యక్తులు కలిసి కొనుగోలు చేసేందుకు వీలు కల్పించే ఫ్రాక్షనల్ ఓనర్‌షిప్ విధానాన్ని కూడా ప్రవేశపెట్టారు. విమానాల లీజింగ్ ప్రక్రియను సులభతరం చేసే ఐడీఈఆర్ఏ (ఇర్రివోకబుల్ డీరిజిస్ట్రేషన్ అండ్ ఎక్స్‌పోర్ట్ రిక్వెస్ట్ ఆథరైజేషన్) విధానం ప్రకారం విమానాల కొనుగోలు, లీజింగ్ ఖర్చులు తగ్గి భవిష్యత్తులో విమాన ఛార్జీలు కూడా తగ్గే అవకాశం ఉంది. కొత్త రూల్స్ ద్వారా విమానయాన సంస్థల వాణిజ్య సౌలభ్యం, ప్రయాణికుల ప్రయోజనాల మధ్య సమతుల్యత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

వార్త, వరంగల్, శుక్రవారం 6, నవంబరు 2026

మహారాష్ట్ర జల సంరక్షణ.. రాజస్థాన్ భూగర్భజల పునరుద్ధరణ ఆదర్శం

నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



గురువారం కరవు ఉపశమన చర్యలు, భూగర్భజల సంరక్షణ పనుల కార్యాచరణ ప్రణాళిక ఖరారుపై అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: మహారాష్ట్ర జలసంరక్షణ రాజస్థాన్ భూగర్భజల పునరుద్ధరణను ఆదర్శంగా తీసుకోవాలని నీటిరంగ నిపుణులు ఈ రెండు రాష్ట్రాలను పరిశీలించి వాటిని తెలంగాణలో అమలు పరిచేందుకు అధ్యయనం చేయాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. గురువారం కరవు ఉపశమన చర్యలు, భూగర్భజల సంరక్షణ పనులకు కార్యాచరణ ప్రణాళిక ఖరారుపై ఉత్తమ్ కుమార్‌రెడ్డి కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. జలవనరుల పునరుద్ధరణతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం భారీ కార్యక్రమానికి సన్నాహాలు చేస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి వెల్లడించారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, భూగర్భ జల, నీటిపారుదల శాఖలు చేపట్టాల్సిన పనులపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య, నీటిపారుదల శాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్. పంచాయతీ రాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్. నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, ఈఎన్‌సి రమేష్‌బాబుహాజరైనారు. భూగర్భజలాల పరిరక్షణకు అవసరమైన బడ్జెట్ కేటాయిస్తామనీ మంత్రి ఉత్తమ్ తెలిపారు. అవసరమైతే ప్రస్తుత బడ్జెట్ కేటాయింపులకు మించి నిధులు సమకూరుస్తామనీ, భూగర్భజల శాఖ పనితీరు, చేపట్టాల్సిన చర్యలపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలనీ ఆదేశించారు. అన్ని జిల్లాల భూగర్భజల శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు త్వరలో చేయాలని అధికారులకు తెలిపారు. జిల్లాలవారీగా భూగర్భజలాల స్థితిగతులను సమగ్రంగా సమీక్షించాల్సి ఉంటుందని వివరించారు. భూగర్భజల మట్టాలు ఆందోళనకర స్థాయికి చేరుతున్నాయన్న వార్తలపై దృష్టి సారించాలనీ భూగర్భజల సంరక్షణకు ప్రస్తుతం చేపడుతున్న పనులు, భవిష్యత్ అవసరాలను పరిశీలించాలనీ అన్నారు. రాజస్థాన్‌లో చేపట్టిన భూగర్భజల పునరుద్ధరణ చర్యలను అధ్యయనం చేయడంతోపాటు మహారాష్ట్రలో అమలవుతున్న జలసంరక్షణ కార్యక్రమాలను పరిశీలించాలనీ నీటిపారుదల అధికారులకు తెలిపారు ఇతర రాష్ట్రాల అనుభవాలతో తెలంగాణలో భూగర్భజల సంరక్షణ చర్యలను బలోపేతం చేయాలనీ అధికారులను కోరారు. భూగర్భజలాల పరిరక్షణకు అవసరమైనన్ని నిధులు జిల్లాలవారీగా సమీక్షించి కార్యాచరణ రూపొందించాలనీ సూచించారు. ఉపాధి హామీ పథకాన్ని ప్రధానంగా వినియోగించుకుంటూ 355 రకాల పనులతో గ్రామీణ ఉపాధికి భూగర్భ జలాల లభ్యత మెరుపరిచే ప్రక్రియ మొదలు పెట్టామని తెలిపారు. కార్యక్రమం అమలుకు అవసరమయ్యే అదనపు నిధులను రాష్ట్ర ప్రభుత్వమే సమకూరుస్తుందని భరోసా ఇచ్చారు. చిన్ననీటి పారుదల చెరువులు, గ్రామాల్లోని కుంటలు, చెరువులకు నీటిని చేర్చే కాలువలు, సాగునీటి కాలువల్లో పూడిక తొలగింపు చేపట్టేలా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. సంప్రదాయ జలసేకరణ నిర్మాణాల పునరుద్ధరణను కూడా ఇందులో భాగం చేయాలన్నారు. దెబ్బతిన్న తూములు, గేట్ల మరమ్మతులు, పేరుకుపోయిన పూడిక తొలగింపు, పిచ్చి మొక్కలు, ముళ్లపొదల తొలగింపు, చెరువుల నిర్మాణాల మరమ్మతులు వంటి పనులను చేపట్టడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచాలని చెప్పారు. అందుబాటులో ఉన్న జలవనరులను సమర్థంగా వినియోగించుకునేలా పనులను ఎంపిక చేయాలని సూచించారు. నీటిపారుదల, గ్రామీణాభివృద్ధి శాఖల సమన్వయంతో పొలాలకు నీటిని చేర్చే పంటకాలువల నిర్మాణం చేపడితే ప్రస్తుతం ఉన్న సాగునీటి సదుపాయాల వినియోగం గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి పేర్కొన్నారు. తద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. చిన్ననదులు, వాగులు, స్థానిక జలప్రవాహాలపై చెక్‌డ్యామ్‌ల నిర్మాణ అంశాన్ని కూడా సమావేశంలో చర్చించారు. వర్షపునీటిని ఒడిసిపట్టి భూగర్భజలాల పునర్భరణకు దోహదపడేలా, స్థానికంగా నీటి లభ్యతను పెంచేలా పనులను పరిశీలించాలని మంత్రి సూచించారు. భూగర్భజలాల పెంపుదలకు రాజస్థాన్, మహారాష్ట్రల్లో చేపట్టిన విజయవంతమైన కార్యక్రమాలను అధ్యయనం చేయాలని అధికా రులను ఆదేశించారు. తెలంగాణ పరిస్థితులకు అనువైన విధానాలను గుర్తించి కార్యాచరణలో పొందుపరచాలని చెప్పారు.



సిఎం రేవంత్‌రెడ్డికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తదితరులు

సిఎం రేవంత్‌రెడ్డిని కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వానించిన కమిటీ సభ్యులు

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్న శ్రీ కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని దేవాలయ కమిటీ సభ్యులు, అర్చకులు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు.

తెలంగాణ దివిలో విరిసిన పారిజాతం దాశరథి

పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్ ఘన నివాళి

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: తెలంగాణ దివిలో విరిసన పారిజాతం 'దాశరథి' అని ఆయన సాహిత్యంలో సామాజిక స్పృహతో పాటు, మనస్సుకు హత్తుకొనే లాలిత్యం ఉంటుందని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. గురువారం గాంధీభవన్‌లో దాశరథి కృష్ణమాచార్య వర్థంతి సందర్భంగా పిసిసి అధ్యక్షుడు, మహేశ్‌కుమార్‌గౌడ్ ఘనంగా నివాళులర్పించారు. తెలంగాణ అస్తిత్వాన్ని అక్షరాల్లో ఆవిష్కరించిన మహాకవి దాశరథి అని కొనియాడారు. తెలంగాణ సాహితీ వైభవానికి, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహాకవి, సంఘ సంస్కర్త అని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని తన కలంతో ప్రపంచానికి చాటిన దాశరథి చిరస్మరణీయుడని ఆయన కొనియాడారు. 'నా తెలంగాణ కోటి రత్నాల వీణ' అంటూ తెలంగాణ గొప్పతనాన్ని, ప్రజల ఆకాంక్షలను తన కవిత్వంలో ప్రతిబింబించిన దాశరథి, అక్షరాలనే ఆయుధాలుగా మలిచి ప్రజల్లో చైతన్యాన్ని రగిలించారని మహేశ్‌కుమార్‌గౌడ్ పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపిస్తూ, తెలంగాణ విముక్తి పోరాటంలో సాహిత్యం ద్వారా కీలక పాత్ర పోషించిన ధీశాలి అని స్మరించుకున్నారు. దాశరథి రచనలు నేటికీ సమాజానికి స్ఫూర్తినిస్తూనే ఉన్నాయని, తెలంగాణ భాష, సంస్కృతి, అస్తిత్వ పరిరక్షణకు ఆయన సాహిత్యం మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఆ మహాకవి ఆశయాలను, పోరాట స్ఫూర్తిని భావితరాలకు అందించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు.

పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు

జిఒ నం. 24 జారీ చేసిన ప్రభుత్వం

సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చైర్మన్ గూడూరి శ్రీనివాస్ కృతజ్ఞతలు

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: రాష్ట్రంలోని పద్మశాలి సామాజిక వర్గానికి ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న ముఖ్యమైన శుభవార్త అందింది. పద్మశాలి సమాజం కోసం హైదరాబాద్ పరిసర ప్రాంతంలోని రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం కోకాపేట పరిధిలో పద్మశాలి ఆత్మగౌరవ భవనం నిర్మాణానికి ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులను మంజూరుచేస్తూ జీవో నంబర్ 24 జారీ చేసింది. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవ, సహకారం, ప్రభుత్వ సానుకూల నిర్ణయం ఫలితంగా ఈ ఉత్తర్వులు వెలువడటం పట్ల తెలంగాణ పద్మశాలి కోఆపరేటివ్ సొసైటీస్ కార్పొరేషన్ లిమిటెడ్ చైర్మన్ గూడూరి శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5 కోట్లతో పద్మశాలి ఆత్మగౌరవ భవనాన్ని అన్ని మౌలికసదు పాయా లతో నిర్మించనున్నారు. ఈ భవనం పద్మశాలి సామాజికవర్గానికి ఆత్మగౌరవ ప్రతీకగా నిలవడంతోపాటు, సమాజ అభివృద్ధి, విద్యార్థులు, యువత, మహిళలు, చేనేత కార్మికులు, ఉద్యోగులు, వృత్తినిపుణులు సామాజిక సంస్థల కార్యక్రమాలకు ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

పద్మశాలి సమాజ అభ్యున్నతి కోసం ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం చారిత్రాత్మక ముందడుగని గూడూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. సిఎం రేవంత్, మంత్రి పొన్నంకు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హెచ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాహుల్ బొజ్జా, రాష్ట్ర పద్మశాలి కులబంధావులకు, నాయకులకు ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.



గురువారం సచివాలయంలో అధికారులతో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న సిఎం సంజయ్‌జాజు

అతిపెద్ద ఇండస్ట్రియల్ ఎక్స్‌పోగా గ్లోబల్ సమ్మిట్

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు ఉన్నతస్థాయి సమీక్ష

హైదరాబాద్, నవంబరు5, ప్రభాతవార్త: హైదరాబాద్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను దేశంలోనే అతిపెద్ద పారిశ్రామిక ప్రదర్శనగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేపడుతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. ఈ సమ్మిట్ నిర్వహణకు సంబంధించి చేపడుతున్న ఏర్పాట్లు, వివిధ కార్యక్రమాల పురోగతిపై గురువారం సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రభుత్వ కార్యదర్శులు ఇలంబర్తి, హరిచందన, గౌరవ్ ఉప్పల్, దివ్య దేవరాజన్, శశాంక, అనుదీప్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ, ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోని ప్రముఖ పారిశ్రామిక సంస్థలు, కంపెనీలను ఆహ్వానించామని, ఇప్పటికే అనేక సంస్థలు తమ భాగస్వామ్యానికి సంసిద్ధత వ్యక్తం చేశాయని తెలిపారు. సమ్మిట్ నిర్వహణపై తాము ఆశించిన దానికంటే అధికంగా స్పందన లభిస్తోందని పేర్కొన్నారు.

ఈ సమ్మిట్‌లో భాగంగా రక్షా ఎక్స్‌పో, స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్, ఫార్మా-లైఫ్ సైన్సెస్ ఎక్స్‌పో, తెలంగాణ పెవిలియన్, ఇండస్ట్రియల్ ఎక్స్‌పో, తెలంగాణ క్లైమేట్ కాంక్లేవ్, ఎడ్యుకేషన్ సమ్మిట్, ఏరోబాటిక్-ఎయిర్ షో తదితర ప్రత్యేక ప్రదర్శనలు, కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు వివరించారు.

ముఖ్యంగా స్టార్టప్ పెవిలియన్, క్రియేషన్ కార్నర్ యువత, జెన్‌జీలోని సృజనాత్మకత, ఆవిష్కరణలు, నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందించే వేదికలుగా నిలుస్తాయని తెలిపారు. సమ్మిట్‌ను సమర్థవంతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు వివిధ శాఖల సమన్వయంతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

తెలంగాణ రాష్ట్రంలో పారిశ్రామిక పెట్టుబడులకు ఉన్న అనుకూల వాతావరణం, మౌలిక సదుపాయాలు, వ్యాపార అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించి, వారిని ...'రైజింగ్ తెలంగాణ విజన్'లో భాగస్వాములను చేయడమే ఈ సమ్మిట్ ప్రధాన లక్ష్యమని సీఎస్ పేర్కొన్నారు.

ఇందులో భాగంగా ఇప్పటికే హైదరాబాద్‌తో పాటు న్యూఢిల్లీలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే ప్రతినిధుల కోసం డెలిగేట్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను కూడా ప్రారంభించినట్లు వెల్లడించారు.

పిలిచినా.. వివరణ ఇవ్వని మంత్రి!

పిసిసి చీఫ్ మహేశ్‌గౌడ్‌కు చేదు అనుభవం

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: ఢిల్లీ షాగ్రిల్లా హోటల్‌లో తెలంగాణ ప్రభుత్వ ఆరోగ్య వైద్య కుటుంబ సంక్షేమ మంత్రి సిలారపు దామోదర రాజనర్సింహ, జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు మధ్య జరిగిన వివాదంపై విచారణ చేయడానికి పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ గాంధీభవన్‌కు రావాలని ఆదేశించి నప్పటికి పోట్లాటకు దిగిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు తేలికగా తీసుకొన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఉదయం మంత్రితో, మధ్యాహ్నం ఎమ్మెల్యేతో మాట్లాడాలని టిపిసిసి చీఫ్ నిర్ణయించారు. దేశరాజధానిలో అదిష్టానం దృష్టికి వచ్చేలా గొడవపడటానికి అసలు ఏం జరిగింది? పరిష్కార మార్గం ఏంటి అనే దానిపై ఇద్దరితో విడివిడిగా మాట్లాడాలని టిపిసిసి చీఫ్ భావించారు. మంత్రి దామోదర రాజనర్సింహ కూడా టిపిసిసి చీఫ్‌తో భేటీకి సమ్మతి కూడా తెలిపారు. దీంతో మహేష్‌కుమార్‌గౌడ్ రాష్ట్ర కాంగ్రెస్‌పార్టీలో వివిధ నియోజకవర్గాలలో నాయకుల హద్య జరుగుతున్న క్రమశిక్షణ రాహిత్యంపై సీరియస్‌గా ఉన్నా అంటూ పత్రికా ప్రకటన జారీచేయడమే కాకుండా మంత్రిని ఎమ్మెల్యేలను రావాల్సిందిగా ఆదేశాలు జారీచేస్తూ పత్రికా ప్రకటన విడుదల చేసి హడావిడి చేశారు. త్వరలో మిగితా నియోజకవర్గాల్లో కూడా క్రమశిక్షణ రాహిత్యంపై కటువుగా నిర్ణయం తీసుకొంటాననే స్థాయిలో పిసిసి చీఫ్ సిద్దమయ్యారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో సమావేశమయ్యేందుకు మహేశ్‌కుమార్ గాంధీభవన్‌కు వచ్చారు. టిపిసిసి చీఫ్ వచ్చి రెండుగంటలకు పైగా వేచి చూసిన తర్వాత తాను రావడం లేదంటూ మంత్రి సమాచారం ఇచ్చారు. దీంతో దామోదర్ రాజనరసింహ రాకపోవటంతో గాంధీ భవన్ నుంచి మహేశ్ కుమార్‌గౌడ్ వెళ్లిపోయారు. ఎమ్మెల్యేను కూడా కలవకుండానే టిపిసిసి అధ్యక్షుడు వెనుదిరిగారు. పిసిసి చీఫ్ వేచివుండటం మంత్రి దుమ్మకొట్టాడని ప్రచారం జరగంతో 'తాను రావడం లేదంటూ' మంత్రి సమా చారం ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు వివరణ ఇచ్చుకొంటున్నారు. ఏదీ ఏమైనా కాంగ్రెస్ అంతర్గత కుమ్మలాట పలుజిల్లాల్లో విస్తరించింది. కాంగ్రెస్ అదిష్టానం హస్తినలో బలహీనంగా ఉండటంతో రాష్ట్రంలో కూడా పెద్దగా ఏ నాయకుడిని మరో నాయకుడు నియంత్రించలేని పరిస్థితి ఉంది. మంత్రులు మంత్రుల మధ్య కీచులాట, మంత్రులు ఎంపిలు, ఎమ్మెల్యేల మధ్య గొడవలు సర్వసాధరణంగా మారాయి. వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కొండా సురేఖను క్యాబినెట్ నుంచి బర్తరఫ్ చేసినా క్రమశిక్షణరాహిత్యం నానాటికి పెరిగి పెద్దదిగానే మారుతోంది. మంత్రి దామోదర రాజనర్సింహను ఉదయం 10:30 గంటలకు గాంధీభవన్‌కు వచ్చి వివరణ ఇవ్వాల్సి ఉండగా విచారణకు హాజరుకాకపోవడం కనీసం మధ్యాహ్నం రెండుగంటలకు రావాల్సిన ఎమ్మెల్యే కూడా ముఖం చాటేయడంతో ఇక మహేశ్‌కుమార్‌గౌడ్ వెనుదిరిగి వెళ్లారు. కాంగ్రెస్‌లో ఎవరికి వారే అన్నట్లు తయారైంది.

చేపల ఎగుమతులకు మౌలిక వసతుల కల్పన..

మత్స్య సహకార సంఘాల బలోపేతం

మత్స్యకార్మికులకు ఆర్థిక సహాయం ప్రకటించండి : మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: రాష్ట్రంలో మత్స్య రంగాన్ని మరింత అభివృద్ధి చేయడంతోపాటు మత్స్యకారుల ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు ద్వారా కేంద్ర ప్రభుత్వం మరింత సహకారం అందించాలని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి కోరారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో మంత్రి పాల్గొని రాష్ట్ర మత్స్య రంగ అభివృద్ధికి సంబంధించి పలు కీలకఅంశాలతోపాటు ఎల్‌నినో కారణంగా మత్స్య కార్మికులకు ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయని ప్రత్యేక ఆర్థిక సహాయప్యాకేజి ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ రాష్ట్రానికి గోదావరి, కృష్ణా వంటి రెండు ప్రధాన జీవనదులతోపాటు అనేక రిజర్వాయర్లు, చెరువులు, ఇతర జలవనరులు ఉన్నాయని మంత్రి తెలిపారు. ఈ జలవనరులను సమర్థవంతంగా వినియోగించు కోవడం ద్వారా చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. మత్స్యకార సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాల కోరారు. చేపల ఉత్పత్తి పెంపుతో పాటు వాటి నిల్వ, ప్రాసెసింగ్, మార్కెటింగ్‌కు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో ఉత్పత్తి అవుతున్న చేపలను ఇతర రాష్ట్రాలతో పాటు అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేసేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ యేదాది ఎల్‌నినో ప్రభావం, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా మత్స్య రంగంపై ఆధారపడిన కుటుంబాలు ఉపాధి, ఆదాయం కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి రాకుండా కేంద్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టాలని కేంద్రమంత్రి రాజీవ్ రంజన్ సింగ్ కు మంత్రి వాకిటి శ్రీహరి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో మత్స్యకార కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రత్యేక సహాయక ప్యాకేజీ, తగిన పరిహారం అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం జాతీయ మత్స్యఅభివృద్ధి బోర్డు ద్వారా అవసరమైన నిధులు, సాంకేతిక సహకారం, మౌలిక సదుపాయాలు కల్పిస్తే తెలంగాణ మత్స్య రంగం మరింత అభివృద్ధి చెందుతుందని మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు.



హైదరాబాద్‌లో గురువారం జరిగిన నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు పాలక మండలి సమావేశంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

రూ.2 లక్షల పంట రుణమాఫీ జాప్యం

వివరణ ఇవ్వాలని సర్కార్‌కు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త : రాష్ట్రంలో రూ.2 లక్షలకు మించి ఉన్న పంట రుణాలకు సంబంధించి రుణ మాఫీ పథకం-2024పై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ మేరకు దీనిపై కౌంటర్ అఫిడవిట్లను రెండు వారాల్లోగా దాఖలు చేయాలని ప్రతిపాదులను స్పష్టం చేసింది. మెదక్ జిల్లాకు చెందిన మహిళా రైతు దాఖలు చేసిన రిట్ పిటీషన్‌పై ధర్మాసనం విచారించింది. ఆమెకు రావాల్సిన రూ.2 లక్షల పంట రుణ మాఫీ ప్రయోజనాన్ని వాయిదా వేస్తూ, వ్యవసాయ శాఖ డైరక్టర్ ఈ ఏడాది జూన్ 6వ తేదీన జారీ చేసిన ఉత్తర్వును మహిళా రైతు సవాలు చేస్తూ హైకోర్టులు పిటిషన్ వేసింది. సాఫ్ట్‌వేర్ పోర్టల్ డేటా స్థంభింపచేయబడిందని, తదుపరి ప్రభుత్వ ఆదేశాల కోసం ఎదురు చూస్తున్నామని వ్యవసాయ శాఖ అధికారులు ధర్మాసానికి వివరణ ఇచ్చారు. జీవో నెంబర్ 567లోని క్లాజ్ 4.11 ప్రకారం, మొత్తం పంట రుణాలు రూ.2 లక్షలకు మంచిన కుటుంబాలు, నిర్దేశిత పరిమితికి మించిన అదనపు మొత్తాన్ని తీర్చినట్లయితే రూ.2 లక్షల వరకూ రుణ మాఫీకి అర్హులు అవుతారు. సంబంధిత బ్యాంకు, వ్యవసాయ అధికారి రూ.2లక్ష రుణ మాఫీకి అర్హులుగా ధృవీకరించినప్పటికీ పోర్టల్ డేటా ఫ్రీజింగ్, పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ ఆదేశాలను చూపుతూ అధికారులు రుణ మాఫీ నిధుల పంపిణీని నిలిపివేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం అదనపు మొత్తం చెల్లించినప్పటికీ పోర్టల్‌లోని సాంకేతిక సమస్యలు, అధికారిక జాప్యం కారణంగా అర్హులైన రైతులకు పంట రుణ మాఫీ అందకపోవడం దురదృష్టకరమని రైతు తరపు న్యాయవాది పేర్కొన్నారు.

అధిక వడ్డీల పేరుతో వేధింపులు.. ముఠా సభ్యుల అరెస్ట్

రౌడీషీట్లు నమోదు చేస్తాం: మల్కాజ్‌గిరి సిపి సుమతి

హైదరాబాద్ (మన్సూరాబాద్), నవంబరు 5 , ప్రభాతవార్త : అత్యవసర ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకుని అధిక వడ్డీల పేరుతో ప్రజలను వేధిస్తున్న అక్రమ ఫైనాన్స్ ముఠాపై మల్కాజిగిరి పోలీసులు కొరడా ఝళిపించారు. రుణాల పేరుతో అమాయకులు, వృద్ధులు, ఉద్యోగులు, వ్యాపారులను లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడుతున్న ముఠాకు చెందిన నలుగురిని ఎస్ఓటి ఎల్బీనగర్ జోన్, ఎల్బీనగర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఎల్బీనగర్ సీపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సిపి సుమతి నిందితుల వివరాలను వెల్లడించారు. గజ్వేల్, సిద్దిపేట తదితర ప్రాంతాలకు చెందిన కుంభం నాగమ్మ, కండెల నాగమ్మ, కండెల మంగమ్మ ఆదుల అనూష, కండెల శివకుమార్, ఇంద్రమ్మ రుణాలు ఇస్తామని మధ్యవర్తులను పెట్టుకుని లక్ష రూపాయలు ఇచ్చి అందుకు వడ్డీ కింద 30 వేల రూపాయలు తీసుకుంటారు. మళ్లీ అదే డబ్బు లో కొంత సొమ్మును షాపింగ్ అని, రెస్టారెంట్‌లో బాధితుల నుండి ఖర్చు పెట్టించి అందుకు 2 లక్షలు అప్పుగా తీసుకున్నారని ప్రామిసరీ నోట్లు, చెక్ లు తీసుకున్నారు. అయితే 15 రోజుల తరువాత 2 లక్షలు అప్పు ఇవ్వాలని డిమాండ్ చేయడంతోపాటు మానసిక వేదనకు గురిచేయడం వారి అల వాటు. ఈ వ్యవహారంపై మల్కాజ్‌గిరి పోలీసులకు పిర్యాదు రావడంతో ఈ కేసుపై పూర్తిదృష్టి పెట్టిన సిపి సుమతి ఎట్టకేలకు అక్రమ వడ్డీ వ్యాపా రం చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు. సీపీ మాట్లాడుతూ నిందితులు పరిచయస్తులు, మధ్యవర్తుల ద్వారా బాధితులను సంప్రదించి భారీ మొత్తంలో రుణాలు ఇప్పిస్తామంటూ నమ్మించేవారని, రుణం మంజూరు చేయకముందే ముందస్తు వడ్డీ పేరుతో భారీగా డబ్బులు వసూలుచేసి కొన్ని సార్లు హామీ ఇచ్చిన మొత్తంలో కొంత మాత్రమే చెల్లించి.. పెద్దమొత్తంలో రుణం ఇప్పిస్తామంటూ మరిన్ని డబ్బులు గుంజుతారని తెలిపారు. అసలు తీసుకున్న మొత్తానికి మించి విలువ కలిగిన ప్రామిసరీనోట్లు, బాండ్లు, ఖాళీ సంతకం చేసిన చెక్కులు తీసుకుని, రుణాలు తిరిగి చెల్లించినప్పటికీ బాధి తుల పత్రాలు తిరిగి ఇవ్వకుండా అదనపు డబ్బుల కోసం వేధిస్తారని విచా రణలో వెల్లడైందని అన్నారు. ఈ నిందితులపై రౌడీషీట్ ఓపెన్ చేస్తు న్నామని అవసరమైతే పీడీ యాక్ట్ కూడా నమోదు చేస్తామని సీపీ హెచ్చ రించారు. నిందితుల నుంచి రెండుకార్లు, 12 మొబైల్‌ఫోన్లు, రూ.47,690 నగదు, రెండు తెలంగాణ పట్టాదారు పాస్‌పుస్తకాలు, 25 ప్రామిసరీ నోట్లు, 22 ఖాళీచెక్కులు, రెండు సేల్‌డీడ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటివరకు ఏడుగురు బాధితులను గుర్తించి విచారించగా.. మరో 20 మంది బాధితులు ఉండవచ్చని తాము అనుమానిస్తున్నామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విచారణ కొనసాగుతోందని తెలిపారు.

పామాయిల్ పన్ను పెంపుపై సమీక్షిస్తాం

స్పందించిన కేంద్రం : మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త : పామాయిల్ దిగుమతులపై ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకాన్ని పెంచే ఆలోచన చేస్తామని కేంద్రం హామీ ఇచ్చినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటనలో పామాయిల్ రైతుల ప్రయోజనాలను కాపాడటమే లక్ష్యంగా కలిగి ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర లభించాలంటే క్రూడ్ పామాయిల్ దిగుమతులపై సుంకాన్ని గతంలో ఉన్న 44 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని కేంద్రాన్ని ఇప్పటికే పలుమార్లు కోరినట్లు తెలిపారు. గతంలో 44 శాతం గా ఉన్న దిగుమతి సుంకాన్ని 11 శాతానికి తగ్గించిందని పేర్కొన్నారు. ఈ తగ్గింపు వల్ల ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులకు నష్టం కలిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్రానికి పలుమార్లు లేఖలు రాసి ఆయిల్ పామ్ రైతుల ప్రయోజనాలను వివరించి, దిగుమతి సుంకాన్ని తిరిగి 44 శాతానికి పెంచాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. దీనిపై కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రల్హాద్ జోషి లేఖ ద్వారా స్పందించారని తెలిపారు. దేశీయంగా వంటనూనెల ఉత్పత్తి, అవసరాలకు సరిపోకపోవడంతో సుమారు 56 శాతం దిగుమతుల ద్వారానే తీరుతోందని కేంద్ర మంత్రి తన లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులు, వంటనూనెల ధరలు, రవాణా, బీమా వ్యయాలు, సరఫరాలో అనిశ్చితి, పండుగల సమయంలో పెరిగే డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకుని దిగుమతి సుంకాలను హేతుబద్ధీకరించినట్లు వివరించారని చెప్పారు. ఆయిల్ పామ్ రైతులు దీర్ఘకాలిక పెట్టుబడులతో సాగు చేస్తున్న విషయాన్ని కేంద్రం గుర్తించిందని, జాతీయ వంట నూనెలు-ఆయిల్ పామ్ మిషన్ ద్వారా దేశీయ ఉత్పత్తిని పెంచి దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారని పేర్కొన్నారు. తెలంగాణ వ్యక్తం చేసిన ఆందోళనలను గుర్తించామని, అంతర్జాతీయ, దేశీయ మార్కెట్ పరిస్థితులతో పాటు, రైతులు, వంటనూనెల పరిశ్రమ, వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని దిగుమతి సుంకాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తామని కేంద్ర మంత్రి తన లేఖలో హామీ ఇచ్చారని తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

గిరిజన సమస్యలపై జాతీయ ఎస్టీ కమిషన్

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: న్యాయస్థానాలను ఆశ్రయించడం ద్వారా తమ రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాలని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (ఎన్సిఎస్టి) సభ్యుడు జటోత్తు హుస్సేన్ నాయక్ సూచించారు. గిరిజన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు గిరిజన సంక్షేమ, అటవీ, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని గిరిజన సమస్యలకు సంబంధించి పర్యటనలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాలో పర్యటనలో భాగంగా గురువారం జరిగిన ఒక సభలో ప్రసంగిస్తూ, గిరిజన వర్గాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేటప్పుడు అధికారులు జల్, జంగల్, జమీన్లపై గిరిజన హక్కులను అధ్యయనం చేసి, దానికి అనుగుణంగా వ్యవహరించాలని పేర్కొన్నారు.

ప్రత్యేకంగా బలహీనమైన గిరిజన సమూహంగా వర్గీకరిం చబడిన కోలంపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అటవీ హక్కుల చట్టం కింద జీవనోపాధి కల్పనలో వ్యక్తులకు, వర్గాలకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. కోలం కమ్యూనిటీతో సహా అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చూసేందుకు ప్రయత్నాలు చేయాలని తెలిపారు.

ప్రచారంలో మీ సహకారం అనివార్యం

మధుయాష్కిని కలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్‌రెడ్డి

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త: త్వరలో జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికలకు తగిన సహకారం అందించి, ప్రచారానికి రావాలని వరంగల్ ఖమ్మం నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అభ్యర్థించారు. గురువారం ఆల్ ఇండియా ప్రొఫెషనల్స్ కాంగ్రెస్ చైర్మన్, మాజీ ఎంపిమధుయాష్కి గౌడ్ ని బంజారాహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా నియమితులైనందుకు సర్వోత్తమ్ రెడ్డి కి మధుయాష్కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొనసాగుతున్న ఎమ్మెల్సీ ఓటరు నమోదు ప్రక్రియను సర్వోత్తమ్ రెడ్డి వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో తనకు సహకారం అందించాలని, ప్రచారానికి రావాలని మధుయాష్కిని ఆహ్వానించారు. ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాకు చెందిన చాలామంది గ్రాడ్యుయేట్స్ ఎల్బీనగర్ నియోజకవర్గంలో నివాసం ఉంటున్న విషయంపై చర్చించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో ఉంటున్న ఓటర్ల కు సంబంధించి తమ సహకారం పూర్తిగా ఉంటుందని.. వనస్థలిపురంలో ఉన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఎన్నికల ప్రక్రియ కోసం వినియోగించుకోవచ్చని మధుయాష్కి సూచించారు.

వేగంగా మారుతున్న అర్బన్ మొబిలిటీ రూపురేఖలు!



మెట్రో సేవలపై ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, నవంబరు 5: దేశంలో పట్టణ రవాణా వ్యవస్థ రూపురేఖలు వేగంగా మారుతున్నాయని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. 2014కు ముందు ఐదు నగరాలకే పరిమితమైన మెట్రో రైలు సేవలు ఇప్పుడు 26 నగరాలకు విస్తరించాయని వెల్లడించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా దాదాపు 1,200 కిలోమీటర్ల మేర మెట్రో రైలు మార్గాలు అందుబాటులో ఉన్నాయని, రోజు కోటి మందికి పైగా ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో దేశ మెట్రో రవాణా వ్యవస్థలో వచ్చిన మార్పులను ప్రస్తావించారు. 2014లో దేశవ్యాప్తంగా కేవలం 248 కిలోమీటర్ల మేర మాత్రమే మెట్రో నెట్‌వర్క్ ఉండేదని, అది కూడా ఐదు నగరాలకే పరిమితమైందని గుర్తుచేశారు. గత దశాబ్ద కాలంలో మెట్రో విస్తరణ వేగం గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు. 2014కు ముందు ఉన్న వేగంతోనే మెట్రో విస్తరణ కొనసాగి ఉంటే పుణె వంటి నగరాలకు మెట్రో సదుపాయం అందడానికి ఇంకా ఎన్నో సంవత్సరాలు, బహుశా దశాబ్దాలు పట్టేదని మోడీ వ్యాఖ్యానించారు. నగరాల్లో ట్రాఫిక్ కష్టాలు తగ్గడం, ప్రయాణ సమయం ఆదా కావడం, కుటుంబంతో గడిపే సమయం పెరగడం, ఉత్పాదకత మెరుగుపడటం వంటి ప్రయోజనాలు మెట్రో విస్తరణతో కలుగుతున్నాయని వివరించారు. మరోవైపు మహారాష్ట్రలోని పుణె నగర మెట్రో రవాణా వ్యవస్థను మరింత విస్తరించే దిశగా కేంద్రం కీలక అడుగులు వేసింది. ఇటీవలే ప్రధాని మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సుమారు రూ.21,800 కోట్ల విలువైన పుణె మెట్రో ప్రాజెక్టులను ప్రారంభించడంతో పాటు కొత్త పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా రూ.8,300 కోట్లకు పైగా వ్యయంతో నిర్మించిన పుణె మెట్రో లైన్3 (పింక్ లైన్)ను ప్రధాని ప్రారంభించారు. సుమారు 23 కిలోమీటర్ల పొడవైన ఈ మార్గం మాన్ నుంచి డిస్ట్రిక్ట్ కోర్టు మెట్రో స్టేషన్ వరకు విస్తరించింది. పుణెలోని ప్రముఖ ఐటీ హబ్ హింజేవాడి నుంచి శివాజీనగర్ వరకు మెట్రో కనెక్టివిటీ అందుబాటులోకి రానుంది. దీంతో ఐటీ ఉద్యోగులు, ఇతర ప్రయాణికులకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. పుణె మెట్రో రెండో దశ పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేశారు. సుమారు రూ.13,500 కోట్ల అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ మార్గాల ద్వారా నగరంలోని నివాస, వాణిజ్య, ఐటీ ప్రాంతాలకు మెరుగైన రవాణా సదుపాయం కల్పించనున్నారు. మెట్రో రైలు విస్తరణ అనేది కేవలం కిలోమీటర్లు, నగరాల సంఖ్యకు మాత్రమే పరిమితం కాదని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ట్రాఫిక్‌లో గడిపే సమయం తగ్గడం, కుటుంబ సభ్యులతో ఎక్కువ సమయం గడిపే అవకాశం, ఉద్యోగులు, వ్యాపారుల ఉత్పాదకత పెరగడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని వివరించారు. ఆధునిక సాంకేతికతతో పట్టణ రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరచడమే తమ లక్ష్యమని తెలిపారు. మొత్తంగా 2014లో ఐదు నగరాలు, 248 కిలోమీటర్లుగా ఉన్న మెట్రో నెట్‌వర్క్.. ప్రస్తుతం 26 నగరాలకు, దాదాపు 1,200 కిలోమీటర్లకు విస్తరించింది. రోజూ కోటి మందికి పైగా ప్రయాణికులు మెట్రో సేవలను వినియోగించుకుంటున్నారు.

చక్రపాణి యాదవ్ మరణం తీరని లోటు: సిపిఐ నేతలు

- నేడు మహాప్రస్థానంలో అంత్యక్రియలు



చక్రపాణియాదవ్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న సీపీఐ నేతలు

జూబ్లీహిల్స్, నవంబరు 5, ప్రభాతవార్త: శాసనమండలి మాజీ చైర్మన్ చక్రపాణి యాదవ్ మరణం బడుగు, బలహీన వర్గాలతో పాటు యాదవ సమాజానికి తీరని లోటని సీపీఐ జాతీయ కార్యదర్శులు పల్లా వెంకటరెడ్డి, రామకృష్ణ, జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, బీసీ రిజర్వేషన్ల సాధన సమన్వయ జేఏసీ చైర్మన్ దుంధ్ర కుమార స్వామి అన్నారు. గురువారం బంజా రాహిల్స్‌లోని నివాసంలో చక్రపాణి యాదవ్ భౌతికకాయానికి వారు పుష్పాం జలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజాజీవితంలో శాసనమండలి మాజీ చైర్మన్‌గా చక్రపాణి యాదవ్ అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి, యాదవ సమాజ ప్రగతికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు.
యాదవ మహాసభ కార్యక్రమాల్లో ఆయనతో కలిసి పనిచేసిన అనుబంధాన్ని దుంధ్ర కుమారస్వామి గుర్తుచేసుకున్నారు. ఆయన నాయకత్వం, సమాజ సేవ ఆదర్శప్రాయమని పేర్కొంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. చక్రపాణి భౌతికకాయానికి అంత్యక్రియలను శుక్రవారం(నేడు) జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

బాత్రూంలో గంజాయి మొక్క

తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్న బోథ్ పోలీసులు

నిందితుడిపై ఎన్‌డిపిఎస్ చట్టం కింద కేసు నమోదు, అరెస్ట్

ఆదిలాబాద్, నవంబర్ 05, ప్రభాతవార్త: బోథ్ మండలం సోనాల గ్రామంలో తన ఇంటి వెనుక ఉన్న బహిరంగ బాత్రూమ్ ప్రదేశంలో రహస్యంగా గంజాయి మొక్కను పెంచుతున్న చౌహాన్ జైపాల్ సింగ్ అనే వ్యక్తిని పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పక్కా సమాచారం మేరకు బోథ్ పోలీసులు ఈ తనిఖీలు నిర్వహించారు. పోలీసులు జరిపిన తనిఖీల్లో సోనాల గ్రామానికి చెందిన జైపాల్ సింగ్ ఇంటి వెనుక పెరట్లో పెంచుతున్న ఒక గంజాయి మొక్కను గుర్తించి, అది గంజాయి మొక్కగా ప్రాథమికంగా నిర్ధారించారు. అనంతరం సదరు మొక్కను స్వాధీనం చేసుకుని, నిందితుడు చౌహాన్ జైపాల్ సింగ్ (44, తండ్రి నారాయణ సింగ్) పై బోథ్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడికి గతంలో గంజాయి తాగే అలవాటు ఉండటంతో, సులభంగా డబ్బు సంపాదించాలనే దురుద్దేశంతో గంజాయి విత్తనాలను సేకరించి రహస్యంగా మొక్కను పెంచుతున్నట్లు విచారణలో వెల్లడించినట్లు బోథ్ ఎస్ఐ వి. పురుషోత్తం తెలిపారు. ఈ ఘటనపై నిందితుడిపై ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు.



వేగంగా సాగుతున్న యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనులు

- వచ్చే విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం : డిజిపి సి.వి.ఆనంద్



మంచిరేవులలోని యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ నిర్మాణ పనులు పరిశీలిస్తున్న డిజిపి సి.వి.ఆనంద్

నార్సింగి, నవంబర్ 5 ప్రభాతవార్త : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "యంగ్ ఇండియా పోలీస్ స్కూల్" అకాడమిక్ బ్లాక్-1 నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయని, వచ్చే విద్యా సంవత్సరం ఇక్కడ తరగతులు ప్రారంభించేలా కృషి చేస్తున్నామని డిజిపి సి.వి.ఆనంద్ పేర్కొన్నారు. గురువారం గండిపేట మండలం మంచిరేవులలో ఉన్న పాఠశాల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డిజిపి ఆదేశించారు. అలాగే పలు పనులకు అనుమతులు ఇస్తూ, ఇతర అంశాలపై అధికారులతో సమీక్షా సమావేశంను నిర్వహించారు. అకాడమిక్, మౌలిక సదుపాయాలు, సిఎస్ఆర్, నియామకాలు, ఆర్థిక వ్యవహారాల కమిటీల పనితీరును సమీక్షించారు.
అనంతరం డిజిపి సి.వి.ఆనంద్ మాట్లాడుతూ పాఠశాలలో అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడాలని, అవసరాలకు అనుగుణంగా మార్పులు, చేర్పులు చేపట్టాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లలకు క్రమశిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వం ఎంతో అవసరమని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల ప్రభావం లేని వాతావరణంలో విద్యాబోధనకు ప్రాముఖ్యత పెరుగుతున్న నేపథ్యంలో పోలీస్ స్కూల్ ప్రత్యేకతను చాటుకుంటుందన్న ఆశాభావంను వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో కూడిన విద్య, నాణ్యమైన బోధన, సరైన మార్గదర్శకత్వంతో విద్యార్థులకు ఉజ్వలమైన భవిష్యత్తును అందిచాలన్నారు. భావి పౌరులకు అత్యున్నతమైన ప్రమాణాలతో విద్య అందించడంలో ఈ యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ మంచి పేరును సంపాదిస్తుందన్నారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 345.మంది విద్యార్థులు ఆరవ తరగతి వరకు చదువుకుంటున్నారని, వచ్చే విద్యా సంవత్సరం మరో 720. మంది వస్తారని, మొత్తం వెయ్యి మందికి వసతులు కల్పించేలా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. నర్సరీ నుంచి 12.వ,తరగతి వరకు అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను అందించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణ పనులు పూర్తి చేయాలని డిజిపి సూచించారు. ఈ సమావేశంలో డిజి మహేష్ భగవత్, ఆక్టోపస్ డిజి అనిల్ కుమార్, ఐజిపి ఎల్.గజరావు భూపాల్, సిద్దిపేట పోలీసు కమీషనర్ రష్మీ పెరుమాళ్, ఏజీ అడ్మిన్ రమణ కుమార్, డిసిపి సిహెచ్.శ్రీనివాస్, విశాల్ గోయల్, అనితారెడ్డి, జయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం 60 శాతం గ్రాంట్ ఇవ్వాలి ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఆర్.కృష్ణయ్య డిమాండ్



కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో సమావేశమైన రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

హైదరాబాద్ నవంబర్ 5 (ప్రభాతవార్త) : తెలుగు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పథకాలకు కేంద్ర ప్రభుత్వం 60 శాతం గ్రాంట్ నిధులు మంజూరు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య కోరారు. గురువారం న్యూఢిల్లీలోని కేంద్ర విద్యాశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి నివాసంలో బీసీ నాయకుల బృందంతో కలిసి ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్ లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు పూర్తి ఫీజుల రీయింబర్స్‌మెంట్ వర్తింపజేస్తున్నారని తెలిపారు. ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, డిగ్రీ, పీజీ కోర్సులు చదువుతున్న సుమారు 30 లక్షల మందికి ఉచిత విద్య అందుతోందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేంద్రం 60 శాతం గ్రాంట్ ఇస్తున్న తరహాలోనే, బీసీ, ఈబీసీ విద్యార్థులకు కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు. నిధుల కొరత వల్ల తెలంగాణలో రూ.8,500 కోట్లు, ఏపీలో రూ.9,000 కోట్ల బకాయిలు పేరుకుపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కోర్సు పూర్తయినా దాదాపు 4 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోయాయని వివరించారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో ఈ పథకం అమలు చేసేలా సూచనలు చేయాలని కోరారు. తెలంగాణలోని 325 బీసీ గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఎస్ఎస్ సి , ఇంటర్‌లో 99 ఉత్తీర్ణత సాధిస్తున్నారని, కానీ ఒక్క దానికి కూడా సొంత భవనం లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

విదేశీ ఆస్తులపై 'ఫాస్ట్-డిఎస్ 2026' ఐటీ శాఖ కొత్త పథకం

విదేశీ ఆస్తులు వెల్లడించడానికి డిసెంబరు 31 వరకు గడువు



'ఫాస్ట్-డిఎస్ 2026' పథకంపై అవగాహన సదస్సులో పాల్గొన్న సిఐటి (టిడిఎస్) శివ సేవక్, అడిషనల్ సిఐటి శంకర్ పాండే, డిసిఐటిలు ఏ.భార్గవశేఖర్, శుభం సింగ్, రాజీవ్ రమేష్ మేశ్రామ్,ట్యాక్స్ బార్ అసోసియేషన్ ప్రతినిధులు అవధేష్ ప్రసాద్ దాహిమా, పి.వి.నారాయణరావు,పంకజ్ సంజేతి తదితరులు

హైదరాబాద్,నవంబరు 5, ప్రభాతవార్త ఆదాయపు పన్ను శాఖ, తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో "ఫాస్ట్-డిఎస్ 2026' పేరుతో విదేశీ ఆస్తుల చిన్న పన్నుల చెల్లింపుదారుల వెల్లడింపు పథకంపై సదస్సు జరిగింది. గురువారం ఏసిగార్డ్సులోని ఆదాయపు పన్ను టవర్స్‌లో జరిగిన ఈ సదస్సులో సిఐటి (టిడిఎస్) శివ సేవక్, అడిషనల్ సిఐటి (టెక్) శంకర్ పాండే, డిసిఐటి (టిడిఎస్) ఏ.భార్గవశేఖర్, డిసిఐటీ (టిడిఎస్) శుభం సింగ్, డిసిఐటీ (టెన్నికల్) రాజీవ్ రమేష్ మేశ్రామ్‌లు పాల్గొన్నారు. 'ఫాస్ట్-డిఎస్ 2026 పథకం ద్వారా విదేశాల్లో బ్యాంకు ఖాతాలు, పెట్టుబడులు, ఇతర ఆస్తులు ఉన్న చిన్న పన్ను చెల్లింపుదారులు వాటిని ఆదాయపు పన్ను శాఖకు స్వచ్ఛందంగా వెల్లడించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా ప్రత్యేక అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. ఈ పథకంపై పన్ను చెల్లింపు దారులు భయం లేకుండా స్వచ్ఛందంగా తమ విదేశీ ఆదాయం, ఆస్తులను వెల్లడించడానికి ఒక స్వర్ణావకాశమని వివరించారు.

మహాదేవ్ బెట్టింగ్ సహవ్యవస్థాపకుడు దుబాయ్‌లో అరెస్టు



మహాదేవ్

న్యూఢిల్లీ, నవంబరు 5: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ కేసులో అత్యంత కీలక పరిణామం చోటు చేసుకుంది. వేల కోట్ల హవాలా నెట్‌వర్క్‌ను నడిపిస్తూ దర్యాప్తు సంస్థల కళ్లుగప్పి తిరుగుతున్న యాప్ సహవ్యవస్థాపకుడు రవి ఉప్పల్‌ను దుబాయ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు భారత భద్రతా వర్గాలకు సమాచారం అందింది. మరో కీలక సూత్రధారి సౌరభ్ చంద్రకర్‌ను ఒమన్ నుంచి రప్పించే ప్రక్రియ సాగుతుండగానే, రవి ఉప్పల్ చిక్కడం కేసు విచారణలో కీలక మైలురాయిగా మారింది. ఈ వ్యవహారంలో అత్యంత దిగ్భ్రాంతికరమైన అంశం బెట్టింగ్ మాఫియా, రాజకీయ నేతలు, ప్రభుత్వ అధికారుల మధ్య సాగిన లోతైన బంధం. ఛత్తీస్‌గఢ్ కేంద్రంగా ప్రారంభమైన ఈ దందా ఇంత భారీ స్థాయికి చేరడం వెనుక అధికార యంత్రాంగం, పలువురు ప్రముఖ ప్రజాప్రతినిధుల ప్రత్యక్ష, పరోక్ష సహకారం ఉన్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ప్రాథమిక దర్యాప్తులోనే గుర్తించింది. దశాబ్దాల పాటు చట్టవిరుద్ధ బెట్టింగ్ కార్యకలాపాలు నిరాటంకంగా సాగడానికి రాష్ట్రానికి చెందిన కొందరు కీలక రాజకీయ నేతలు రాజకీయ రక్షణ కల్పించారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి. యాప్ కార్యకలాపాలు బయటకు పొక్కకుండా, పోలీసు దాడులు జరగకుండా ఉండేందుకు గాను ఉన్నతాధికారులు, పోలీసు వర్గాలకు ప్రతి నెలా భారీ ఎత్తున ముడుపులు అందినట్లు తేలింది. సౌరభ్ చంద్రకర్ ప్రచారం, సాంకేతిక వ్యవహారాలను చూస్తే.. రవి ఉప్పల్ రాజకీయ నాయకులు, అధికారుల సెటిల్‌మెంట్లు, హవాలా ద్వారా కమీషన్లు చేరవేసే కీలక నెట్‌వర్క్‌ను పర్యవేక్షించినట్లు దర్యాప్తు సంస్థ స్పష్టం చేసింది. ఈడీ అంచనాల ప్రకారం మహాదేవ్ బెట్టింగ్ యాప్ మరియు దాని అనుబంధ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఏకంగా రూ. 94,000 కోట్ల మేర లావాదేవీలు సాగాయి. ఇందులో ప్రమోటర్ల జేబుల్లోకి సుమారు రూ. 4,000 కోట్ల నుంచి రూ. 5,000 కోట్లు చేరినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి.

విదేశీ పౌరులకు ఊరటనిచ్చిన కేంద్రం.. నిబంధనలు సడలించిన హోంశాఖ

న్యూఢిల్లీ,నవంబరు 5: దేశంలో నివసిస్తున్న పలు వర్గాలకు చెందిన విదేశీ పౌరులకు కేంద్ర ప్రభుత్వం ఊరట కల్పించింది. ఈ మేరకు తాజాగా పాస్‌పోర్ట్, వీసా నిబంధనలను సడలించింది. ఇందులో నిర్దిష్ట కేటగిరీలకు చెందిన పాకిస్థాన్ పౌరులు, మతపరమైన వేధింపుల కారణంగా భారత్‌కు వచ్చిన మైనార్టీ శరణార్థులు, శ్రీలంక తమిళులు, టిబెటన్లు ఉన్నట్లు ఒక అధికారిక గెజిట్ నోటిఫికేషన్ ద్వారా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలిపింది. భారత్, నేపాల్, భూటాన్ మధ్య ప్రయాణించే పౌరుల గుర్తింపు పత్రాల నిబంధనలను కూడా సులభతరం చేసింది. 2026 నవంబర్ 5న ది ఇమిగ్రేషన్ అండ్ ఫారినర్ మినహాయింపు,సవరణల ఆర్డర్ 2026 పేరుతో గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. కేంద్ర హోం శాఖ విడుదల చేసిన ఈ సవరించిన నిబంధనల ప్రకారం శాశ్వతంగా నివసించాలనే ఉద్దేశంతో 2009 డిసెంబర్ 31 లేదా అంతకంటే ముందే భారతదేశంలోకి వచ్చిన పాకిస్థాన్ పౌరులకు భారీ ఊరట లభించింది. వారికి సాధారణ పాస్‌పోర్ట్ రెనివల్ (పునరుద్ధరణ) నిబంధనల నుంచి కేంద్రం మినహాయింపు కల్పించింది. పాకిస్థాన్ ప్రభుత్వం జారీ చేసే కంప్యూటరైజ్డ్ నేషనల్ ఐడెంటిటీ కార్డ్ లేకపోవడం వల్ల తమ పాత ట్రావెల్ డాక్యుమెంట్లను లేదా పాస్‌పోర్టుల్ని పునరుద్ధరించుకోలేని వారు ఈ వెసులుబాటుకు అర్హులని తెలిపింది.

జ్ఞానేశ్ రాజీనామా చేయాలంటూ బెంగళూరులో ఇండియా కూటమి నిరసన

బెంగళూరు, నవంబరు 5: ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై ఇండియా కూటమి తన నిరసనను మరింత ఉధృతం చేసింది. ప్రత్యేక సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఓటర్ల జాబితాలను తారుమారు చేశారనే ఆరోపణల నేపథ్యంలో, ఆయన వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బెంగళూరులోని ఫ్రీడమ్ పార్క్‌లో రాష్ట్రస్థాయి నిరసన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ నిరసనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆందోళనలో భాగంగా పార్టీ కార్యకర్తలు గ్యానేశ్ కుమార్‌ను అరెస్టు చేస్తున్నట్లుగా ప్రదర్శన నిర్వహించారు.

కుల సంఘాల భవనాలకు రూ.88.50 కోట్లు మంజూరు

బిసి సంక్షేమ మంత్రి ప్రభాకర్

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త రాష్ట్రంలో 38 బీసీ కుల సంఘాలకు కేటాయించిన భవన నిర్మాణాలకు సంబంధించి రూ.88.50 కోట్ల నిధులు మంజూరు చేస్తూ చేసిందని వెనుకబడిన తరగతుల శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో వివిధ కుల సంఘాల ప్రతినిధులకు నిధుల మంజూరు ఉత్తర్వుల పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో స్థలాలు కేటాయించినప్పటికీ పరిపాలనా, సాంకేతిక కారణాల వల్ల నిర్మాణాలు ముందుకు సాగలేదని, హెచ్ఎండీఏ సహకారంతో ఆ సమస్యలను పరిష్కరించామని చెప్పారు. కార్తీక మాసంలో ఆత్మగౌరవ భవనాలకు శంకుస్థాపనలు చేయాలన్నారు. నిర్మాణాలకు అవసరమైన అనుమతులను ఇంజనీరింగ్ శాఖ, హెచ్ఎండీఏ సమన్వయంతో కల్పిస్తామని, సింగిల్ విండో విధానంలో అనుమతులు మంజూరు చేసి ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. బీసీలకు కేటాయించిన భూముల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. నిర్మాణాలు ప్రభుత్వ నిర్దేశిత నిబంధనల ప్రకారం జరగాలని, భవనాలను బీసీ విద్యార్థుల నైపుణ్యాభివృద్ధి, వసతి సౌకర్యాలు, గ్రంథాలయాలు, సామాజిక కార్యక్రమాలు, కుల సంఘాల అభ్యున్నతికి ఉపయోగించుకోవాలని సూచించారు.

ఆర్టీసి-మెట్రో కామన్ పాస్ ధరల తగ్గింపు ప్రతిపాదనలు సిద్ధం చేసిన అధికారులు

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త తెలంగాణలో ఆర్టీసీ-మెట్రో కంబైండ్ పాస్ ధరలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో, కామన్ పాస్ ఛార్జీలు అధికంగా ఉన్నాయని ప్రభుత్వానికి తెలియజేయడం జరిగింది. ఈ నేపథ్యంలో, ప్రజల అభిప్రాయాలను మరియు వాస్తవ పరిస్థితులను సమీక్షించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న కామన్ పాస్ ధరలు రోజువారీ పాస్‌కు రూ.400, ఇందులో మెట్రో వాటా రూ.300, ఆర్టీసీ వాటా రూ.100గా ఉన్నాయి. అలాగే, నెలవారీ కామన్ పాస్ ధర రూ.8,500గా ఉంది, ఇందులో మెట్రో వాటా రూ.7 వేలు, ఆర్టీసీ వాటా రూ.1,500గా నిర్ణయించారు. అయితే, ఈ ధరలు సామాన్య ప్రజలకు భారంగా ఉన్నాయని ప్రయాణికుల నుండి వ్యతిరేకత రావడంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ధరలను పున సమీక్ష చేసింది. తాజాగా, ప్రభుత్వం కొత్త ప్రతిపాదనలను సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదనల ప్రకారం, రోజువారీ పాస్ ధరను రూ.4 వేలు లేదా రూ.4,500గా తగ్గించనున్నారు. రూ.4 వేలుగా నిర్ణయిస్తే, ఆర్టీసీకి రూ.1,000, మెట్రో యాజమాన్యానికి రూ.3 వేలు లేదా రూ.3,500 వెళ్ళేలా ప్రణాళికలు రూపొందించారు.

స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 'ప్రళయ్'క్షిపణి పరీక్ష సక్సెస్!



న్యూఢిలీ, నవంబరు 5: భారత్ గురువారం ఒడిశా తీరంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ద్వీపం నుంచి ప్రళయ్ పాక్షిక బాలిస్టిక్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ విషయాన్ని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ రూపొందించిన ప్రళయ్ స్వల్పశ్రేణి ఉపరితలం నుంచి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణి. ఇది 500 నుంచి 1,000 కిలోల బరువున్న పేలోడును మోసుకెళ్లగలదు. సంప్రదాయ వార్‌హెడ్లను కూడా మోసుకెళ్లే సామర్థ్యం దీనికి ఉంది. హైదరాబాద్లోని రీసెర్చ్ సెంటర్ ఇమారత్ డీఆర్డీఓకు చెందిన ఇతర ప్రయోగశాలలు సంయుక్తంగా ఈ క్షిపణిని స్వదేశీ పరిజ్ఞానంతో అభివృద్ధి చేశాయి. అభివృద్ధి, ఉత్పత్తి భాగస్వాముల్లో ఒకటైన భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ఈ వ్యవస్థను తయారు చేసింది. ఈ విజయవంతమైన పరీక్షతో ప్రళయ్ క్షిపణిని సైన్యంలో ప్రవేశపెట్టే ప్రక్రియ త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశం ఉందని రక్షణ మంత్రిత్వ శాఖ పేర్కొంది. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన ఈ ఘన ఇంధన ఆధారిత క్వాసీ బాలిస్టిక్ క్షిపణిలో అత్యాధునిక మార్గదర్శక, నావిగేషన్ వ్యవస్థలు ఉన్నాయి.

ఎపికి రూ.4,597 కోట్లు.. తెలంగాణకు రూ.2,370 కోట్లు

28 రాష్ట్రాలకు కలిపి మొత్తం రూ.1,09,019 కోట్లు విడుదల

హైదరాబాద్,నవంబరు5,ప్రభాతవార్త: పండుగల సీజన్లో రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రాలకు భారీగా నిధులు విడుదల చేసింది. సాధారణంగా నవంబర్ 10న విడుదల చేయాల్సిన నెలవారీ పన్నుల వాటా నిధులను ఐదు రోజుల ముందుగానే నవంబర్ 5న విడుదల చేసింది. దేశవ్యాప్తంగా మొత్తం 28 రాష్ట్రాలకు కలిపి రూ.1,09,019 కోట్లను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. పండుగల సమయంలో రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్థిక వెసులుబాటు కల్పించడంతో పాటు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు అవసరమైన నిధులను అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో కేంద్రం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా రాష్ట్రాలు మూలధన వ్యయాలను (క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్) వేగవంతం చేసేందుకు ఈ నిధులు ఉపయోగపడనున్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధి. ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు నిధుల కొరత లేకుండా చూడాలని కేంద్రం భావిస్తోంది.

నెలాఖరులో అసెంబ్లీ

కాళేశ్వరంపై ప్రత్యేక సమావేశాలు

హైదరాబాద్,నవంబరు5,ప్రభాతవార్త: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన గురువారం రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై మంత్రులతో సీఎం చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ మంత్రి మండలి కీలక నిర్ణయం తీసుకుంది. కాళేశ్వరంపై ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోగా రెండు రోజుల పాటు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని నిశ్చయించింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై మూడేళ్లుగా చేస్తున్న మరమ్మతుల గురించి అసెంబ్లీలో వివరించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ నెలాఖరులోగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాళేశ్వరం పరివాహక జిల్లాల మంత్రులు, ఎమ్మెల్యేలు గోదావరిని సందర్శించాలని మార్గనిర్దేశం చేశారు. గోదావరి నుంచి నీటి ప్రవాహం, ఎత్తిపోతల ప్రక్రియలను క్షేత్రస్థాయిలో వివరించాలని ముఖ్యమంత్రి సూచించారు. గోదావరి వద్దే మీడియాకు పూర్తి వివరాలు వెల్లడించాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీళ్ల తరలించారనే ప్రచారంలో వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీఎం దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రతిపక్షాల నేతలు చేస్తున్న విమర్శలను వెంటనే తిప్పి కొట్టాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణపై సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మంత్రులు, అధికారులతో కీలక సమీక్షా సమావేశం నిర్వహించారు.

బస్సు కదలాలంటే డోరు మూయాల్సిందే.. కండక్టర్ ప్రవళిక మృతితో ఆర్టీసి కొత్త రూల్

హైదరాబాద్, నవంబరు 5, ప్రభాతవార్త తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఆర్టీసీ) బస్సుల భద్రతకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త నియమాల ప్రకారం, ప్రత్యేక డోర్లు ఉన్న బస్సులు డోర్లు పూర్తిగా మూసుకోకముందు కదలవు. ప్రయాణికులు బస్సు కదులుతున్నప్పుడు డోర్లు తెరిచి ఉంచడం అనుమతించబడదు. ఈ నిర్ణయం, గుండ్ల ప్రవళిక అనే మహిళా కండక్టర్ మృతితో తెరమీదకు వచ్చింది. అక్టోబర్ 25న భద్రాద్రి కొతగూడెం జిల్లా అశ్వాపురం మండలంలోని మిట్టగూడెం సమీపంలో ప్రవళిక కదులుతున్న బస్సు నుండి పడిపోయింది. ప్రవళిక 24 సంవత్సరాల వయస్సులో, మనుగూరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తోంది. ఆమె మనుగూరు నుండి భద్రాచలం వరకు బస్సు సేవను నిర్వహిస్తోంది. బస్సులోని ఒక మహిళా ప్రయాణికురాలితో టిక్కెట్ల గురించి వివాదం ఏర్పడింది. ఆ ప్రయాణికురాలు ప్రవళికను కదులుతున్న బస్సు నుండి నెట్టివేసింది. దీంతో ప్రవళిక బస్సు వెనుక చక్రాల కింద పడిపోయి, రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. ఆమెకు మొదట భద్రాచలంలో చికిత్స అందించినా, తరువాత మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

విబిజి రామ్‌జీ అమలు భేష్ : కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ ప్రశంసలు

తెలంగాణకు 2026-27కు రూ.3,825.3 కోట్లు కేటాయించినట్లు వెల్లడి

హైదరాబాద్,నవంబరు5,ప్రభాతవార్త: వి.బి-జీ రామ్ జీ చట్టం అమలులో తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రశంసించారు. రాష్ట్రంలో అన్ని గ్రామ పంచాయతీల్లో పనుల అమలును ప్రారంభించడంపై అభినందనలు తెలిపారు. గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించడంతో పాటు చట్టంలోని నిబంధనలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వ నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్కకు కేంద్ర మంత్రి లేఖ రాశారు. వి.బి-జీ రామ్ జీ చట్టం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన పలు సూచనలపై స్పందిస్తూ ఈ లేఖ పంపించారు.2026-27 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం రూ.3,825.3 కోట్ల నిధుల కేటాయింపు చేసినట్లు కేంద్ర మంత్రి తన లేఖలో వెల్లడించారు.

కెటిఆర్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన నల్ల వినయ్ రెడ్డి

హైదరాబాద్,నవంబరు5,ప్రభాతవార్త: బీఆర్ఎస్ పార్టీలోకి చేరికలు కొనసాగుతున్నాయి. నిర్మల్ జిల్లాకు చెందిన యువ నాయకుడు నల్ల వినయ్ రెడ్డి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఆయనకు గులాబీ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.నిర్మల్ జిల్లాలోని లక్ష్మణచాంద మండలంలో
నల్ల వినయ్ రెడ్డికి, ఆయన కుటుంబానికి మంచి గుర్తింపు ఉంది. మాజీ సమితి ప్రెసిడెంట్ భీమిరెడ్డి మనవడిగా వినయ్ రెడ్డికి రాజకీయ నేపథ్యం ఉండటంతో పాటు, స్థానికంగా వారి కుటుంబానికి బలమైన పరిచయాలు, ప్రజల్లో ఆదరణ ఉన్నాయి.

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్..

మను, సురుచి, సైన్యమ్‌లకు రజతం



దోహా: ప్రపంచ చాంపియన్‌షిప్‌లో భారత షూటర్లు మను భాకర్, సురుచీ సింగ్ మరియు సైన్యమ్ రజత పతకం సాధించారు. ఈ ఘనత కతార్‌లోని దోహాలో గురువారం జరిగిన మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో సాధించారు. భారత జట్టు ఈ ఈవెంట్‌లో రెండవ స్థానంలో నిలిచింది. భారత జట్టు మొత్తం 1738-61ను స్కోర్ సాధించింది. ఈ జట్టులో మను భాకర్ 583 పాయింట్లు, సురుచీ సింగ్ 580 పాయింట్లు, సైన్యమ్ 575 పాయింట్లు సాధించారు. చైనా జట్టు 1745-65ను స్కోర్‌తో స్వర్ణ పతకం గెలుచుకుంది. దక్షిణ కొరియా జట్టు 1729-48ను స్కోర్‌తో కాంస్య పతకం సాధించింది. మను భాకర్ మరియు సురుచీ సింగ్ వ్యక్తిగత మహిళల 10 మీటర్ల పిస్టల్ ఈవెంట్‌లో అర్హత సాధించిన 8 మంది షూటర్లలో ఉన్నారు. మను అర్హత ఈవెంట్‌లో 583 పాయింట్లతో 3వ స్థానంలో, సురుచీ సింగ్ 580 పాయింట్లతో 8వ స్థానంలో నిలిచారు. ఈ మహిళల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో పతకం సాధించడం భారతదేశానికి ఈ పోటీలో నాలుగవ పతకం. ప్రస్తుతం భారతదేశం ఈ పోటీలో రెండవ అత్యంత విజయవంతమైన దేశంగా నిలిచింది. చైనా మొత్తం 11 పతకాలు గెలుచుకుంది. భారత జట్టు ఇప్పటివరకు పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో ఒక స్వర్ణ పతకం సాధించింది. ఈ స్వర్ణ పతకం రవిందర్ సింగ్, సొరభ్ చౌదరి, అమన్‌ప్రీత్ సింగ్ చేత సాధించబడింది. రవిందర్ వ్యక్తిగత ఈవెంట్‌లో కూడా ఒక రజత పతకం సాధించారు. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ ఈవెంట్‌లో ఎలవెనిల్ వాలరీవన్, సోనమ్ ఉత్తమ్ మస్కర్, శంభవి శ్రవణ్ క్షీ సాగర్ రజత పతకం సాధించారు. అయితే, భారతదేశం పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో ఒలింపిక్ క్వోటాను కోల్పోయింది.

సాఫ్ ఛాంపియన్‌షిప్: భారత్ చేతిలో

పాకిస్థాన్ చిత్తు

3-2 తేడాతో ఓటమి



ఢాకా: ఢాకాలోని నేషనల్ స్టేడియంలో గ్రూప్ బి ఫుట్‌బాల్ టోర్నీలో పాకిస్థాన్‌ను భారత్ చిత్తుగా ఓడించింది. గురువారం జరిగిన ఈ పోరులో భారత్ ఫుట్‌బాల్ జట్టు 3-2 తేడాతో విజయం సాధించి తన సాఫ్ ఛాంపియన్‌షిప్ 2026 ప్రచారాన్ని ప్రారంభించింది. భారత్ ఆటను ప్రారంభించి 13వ నిమిషంలో గోల్ చేసి ఆధిక్యంలోకి వచ్చింది. మహమ్మద్ సుహైల్ పంపిన బంతిని భట్ గోల్‌లోకి నెట్టి భారత్‌కు ఆధిక్యం అందించాడు. సూర్యవంశీ (19వ నిముషంలో) అందించిన అసిస్ట్‌తో భారత్ తన ఆధిక్యాన్ని రెట్టింపు చేసింది. పాకిస్థాన్ ఆటగాళ్లు వెనక్కి తగ్గడంతో, మిడ్‌ఫీల్డర్ మరింత ముందుకు వెళ్లి, రక్షణ శ్రేణిని ఛేదిస్తూ ఒక కచ్చితమైన పాస్ అందించాడు. బ్లూ టైగర్స్ (31వ) స్కోరును 3-0కి పెంచారు. నౌఫల్ పిఎన్ బంతిని మధ్యలోకి తీసుకువెళ్లి కిష్టెన్‌కు పాస్ అందించాడు. ఆ మిడ్‌ఫీల్డర్ బంతిని అందుకుని, ముందుకు వస్తున్న బట్‌ను దాటి గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచాడు. మొదటి అర్ధభాగంలో సూర్యవంశీ హయ్యాన్ ఖట్టక్‌పై ఫౌల్ చేయడంతో, ఆధిక్యాన్ని తగ్గించుకునేందుకు పాకిస్థాన్‌కు అవకాశం లభించింది. పాకిస్తాన్ తిరిగి పోటీలోకి రాగా నజీబ్ ఉల్లా అత్యంత ఎత్తుకు ఎగిరి హెడర్‌తో గోల్ చేశాడు. మూడు నిమిషాల తర్వాత పాకిస్థాన్ మళ్ళీ గోల్ చేసింది. మెక్‌కీల్ అబ్దుల్లా అందించిన క్రాస్‌ను అలంఫీర్ ఘాజీ నియంత్రించి గోల్ చేసి స్కోరును 3-2కి మార్చి ఆధిక్యాన్ని తగ్గించాడు.



జనవరి 14 నుండి మహిళల ప్రీమియర్ లీగ్

బెంగళూరు, ముంబై మధ్య తొలి మ్యాచ్

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) ఐదో సీజన్ షెడ్యూల్‌ను భారత్ క్రికెట్ కంట్రోల్ బోర్డు (బిసిసిఐ) అధికారికంగా ఖరారు చేసింది. వచ్చే ఏడాది జనవరి 14న ప్రారంభం కానున్న ఈ మెగా టోర్నీ ఆరంభ పోరులో ప్రస్తుత ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు, ముంబై ఇండియన్స్ తలపడనున్నాయి. ఫిబ్రవరి 7న జరిగే గ్రాండ్ ఫైనల్‌తో టోర్నీ ముగియనుంది. మొత్తం 22 మ్యాచ్‌లను వడోదర, ముంబై నగరాలు చెరో 11 మ్యాచ్‌ల చొప్పున ఆతిథ్యమివ్వనున్నాయి. జనవరి 14 నుంచి 24 వరకు తొలి విడత పోటీలు వడోదర అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరగనున్నాయి. జనవరి 26 నుంచి ముంబైలోని ప్రఖ్యాత బ్రబౌర్న్ స్టేడియంలో రెండో విడత లీగ్ మ్యాచ్‌లు మొదలవుతాయి. లీగ్ మ్యాచ్‌లన్నీ భారత కాలమానం ప్రకారం ప్రతిరోజూ రాత్రి 7:30 గంటలకు ప్రారంభం కానున్నాయి. లీగ్ దశ మ్యాచ్‌లు ఫిబ్రవరి 3తో ముగిసిన అనంతరం నాకౌట్ దశ మొదలవుతుంది. పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫిబ్రవరి 7న జరిగే ట్రైటిల్ పోరుకు అర్హత సాధిస్తుంది. రెండు, మూడు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఫిబ్రవరి 5న ఎలిమినేటర్ పోరు జరగనుంది. ఎలిమినేటర్ మ్యాచ్, ఫైనల్ పోరు రెండూ ముంబైలోని బ్రబౌర్న్ స్టేడియం వేదికగానే జరుగుతాయి.

న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ గెలిచినా 2వ వన్డేలో

మార్పుతో బరిలోకి భారత్

ఆక్లాండ్: న్యూజిలాండ్ తో ఐదు వన్డేల సిరీస్ లో 1-0 ఆధిక్యంలో ఉన్న టీం ఇండియా, రెండో వన్డేకు సిద్ధమవుతోంది. తొలి మ్యాచ్ విజయంతో జోష్ లో ఉన్న టీం ఇండియా, రెండో వన్డేలోనూ గెలిచి సిరీస్ కైవసానికి మరింత దగ్గరగా చేరాలని చూస్తోంది. ఇందుకు పటిష్ట ప్రణాళికలతో సిద్ధమవుతోంది.ఈ మ్యాచ్ ఈ నెల 7వ తేదీన వెల్లింగ్టన్ లోని స్కై స్టేడియం వేదికగా జరగనుంది. తొలి వన్డేలో స్థానం దక్కించుకోని మహమ్మద్ సిరాజ్‌కు తుది జట్టులో అవకాశం దక్కే అవకాశాలున్నాయి. ఈ స్టేడియం బ్యాటింగ్ కు స్వర్గధామంగా పేరు పొందింది, ఇక్కడ భారీ స్కోర్లు నమోదయ్యే అవకాశం ఉంది. అటువంటి పరిస్థితులలో, టాస్ మరోసారి కీలకంగ మారనుంది. టాస్ గెలిచిన జట్టు చేజింగ్ కు మొగ్గు చూపే అవకాశం ఎక్కువగా ఉంది, ఎందుకంటే రెండోసారి బ్యాటింగ్ చేసే జట్టుకు లక్ష్యాన్ని ఛేదించడం సులువుగా మారుతుంది. తొలి వన్డేలో టీం ఇండియా అద్భుత విజయం సాధించినప్పటికీ, రెండో వన్డేలో తుది జట్టులో ఒక మార్పుతో బరిలోకి దిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. తొలి వన్డేలో సిరాజ్ కు తుది జట్టులో చోటు దక్కలేదు, రెండో వన్డేలో అతనికి స్థానం కల్పించే అవకాశాలు బలంగా ఉన్నాయి.

అతని పేస్, స్వింగ్, డెత్ ఓవర్లలో వికెట్లు తీసే సామర్థ్యం జట్టుకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. అయితే, సిరాజ్ తుది జట్టులోకి వస్తే, ఎవరి స్థానంలో వస్తాడు అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తొలి వన్డేలో టీమిండియా నలుగురు ఫాస్ట్ బౌలర్లతో బరిలోకి దిగింది. అన్సుల్ కాంబోజ్, గుర్నూర్ బ్రార్, అర్షదీప్ సింగ్ అద్భుత బౌలింగ్ చేశారు, వికెట్లు తీసి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించారు. వీరి ముగ్గురిని తప్పించే సాహసం టీం మేనేజ్మెంట్ చేయకపోవచ్చు.

కాబట్టి, హకీబ్ నబీ స్థానంలో సిరాజ్ ను జట్టులోకి తీసుకునే అవకాశం ఎక్కువగా ఉంది. మొత్తంగా చూస్తే, టీం ఇండియా రెండవ వన్డేలో ఒకే ఒక మార్పుతో బరిలోకి దిగే అవకాశం ఉంది. మహమ్మద్ సిరాజ్ రాకతో భారత బౌలింగ్ విభాగం మరింత బలంగా మారే అవకాశం ఉంది. ఈ మార్పు మినహా, టీం ఇండియా ప్లేయింగ్ ఎలెవెన్ లో ఎటువంటి ఇతర మార్పులు లేకుండానే రెండో వన్డేలో కొనసాగే అవకాశాలున్నాయి.





వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్..

నాసర్‌కు బంగారు పతకం


నింగ్బో: కార్లోస్ నాసర్, చైనాలోని నింగ్బోలో జరుగుతున్న వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పురుషుల 95 కిలోల విభాగంలో మూడు ప్రపంచ రికార్డులను బద్దలు కొట్టాడు. ఈ పోటీలలో అతను గురువారం తన నాలుగవ ట్రైటిల్‌ను గెలుచుకున్నాడు. 21 ఏళ్ల నాసర్, 89 కిలోల విభాగం నుండి 95 కిలోల విభాగానికి మారిన తర్వాత, స్నాచ్‌లో 185 కిలోలు మరియు క్లీన్లో మరియు జర్క్‌లో 230 కిలోలు ఎత్తి, మొత్తం 415 కిలోలతో గెలిచాడు. అతను కజకిస్తాన్‌కు చెందిన నుర్గిస్సా అడిలెటులీని 16 కిలోల తేడాతో మించినాడు. అడిలెటులీ 399 కిలోలతో రజత పతకం సాధించాడు, ఇరాన్‌కు చెందిన అలీ అలిపూర్ 396 కిలోలతో కాంస్య పతకం సాధించాడు. చైనాకు చెందిన క్వియన్ ఫెయిషియాంగ్ 385 కిలోలతో నాలుగవ స్థానంలో నిలిచాడు.

నాసర్ తన ఆరు ప్రయత్నాలను విజయవంతంగా పూర్తి చేశాడు, మొదట 175 కిలోలు, 180 కిలోలు మరియు 185 కిలోలు స్నాచ్‌లో ఎత్తాడు. అనంతరం 213 కిలోలు, 220 కిలోలు మరియు 230 కిలోలు క్లీన్లో మరియు జర్క్‌లో ఎత్తాడు. అతని చివరి క్లీన్లో మరియు జర్క్ 220కిలోల ప్రపంచ ప్రమాణాన్ని మించి ఉంది, అలాగే అతని మొత్తం 415 కిలోలు, సెప్టెంబర్‌లో అలిపూర్ సృష్టించిన 398 కిలోల ప్రపంచ రికార్డును మించి ఉంది.

సెన్సెక్స్, నిఫ్టీల్లో లాభాల ర్యాలీ



ముంబయి, నవంబరు 5: దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం భారీ లాభాలతో ముగిశాయి. అంతర్జాతీయ పరిణామాలు అనుకూలంగా మారడం, భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న ఆశలు, విదేశీ మదుపర్ల కొనుగోళ్లు, కంపెనీల త్రైమాసిక ఫలితాలపై సానుకూల అంచనాలు మార్కెట్లకు ఊపునిచ్చాయి. బ్యాంకింగ్, ఆటోమొబైల్, ఆర్థిక సేవలు, రియల్టీ రంగాల షేర్లలో కొనుగోళ్ల వెల్లువెత్తడంతో సూచీలు దూసుకెళ్లాయి. బిఎస్ఇ సెన్సెక్స్ 2,008.61 పాయింట్లు లాభపడి 79,310.01 వద్ద ముగిసింది. ఉదయం 78,910.94 వద్ద ప్రారంభమైన సూచీ ఓ దశలో 79,470.03 గరిష్ఠ స్థాయిని తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 576 పాయింట్లు పెరిగి 24,536.60 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 24,579.90 గరిష్ఠాన్ని నమోదు చేసింది. మదుపర్ల సంపదగా భావించే బిఎస్ఇలోని నమోదిత సంస్థల మార్కెట్ విలువ ఏకంగా రూ.8 లక్షల కోట్లకు పైగా పెరగడం విశేషం. సెన్సెక్స్‌లోని ప్రధాన షేర్లలో బజాజ్ ఫైనాన్స్ అత్యధికంగా 7.77 శాతం లాభపడింది. ఇండిగో 5.80 శాతం, ఐసిఐసిఐ బ్యాంక్ 5.29 శాతం, మారుతి సుజుకి 5.28 శాతం, మహీంద్రా అండ్ మహీంద్రా 5.15 శాతం చొప్పున పెరిగాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, ఏషియన్ పెయింట్స్, యాక్సిస్ బ్యాంక్, ఇన్ఫోసిస్, హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ షేర్లూ లాభాల్లో ముగిశాయి. అయితే ఎన్టీపిసి 1.65 శాతం నష్టపోయి సెన్సెక్స్‌లో అత్యధికంగా పడిపోయిన షేర్‌గా నిలిచింది. భారత్ ఎలక్ట్రానిక్స్, అదానీ పోర్ట్స్, పవర్‌గ్రిడ్, ఐటిసి, భారతి ఎయిర్‌టెల్ స్వల్ప నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఎక్స్‌బ్యాంక్ 4.24 శాతం, నిఫ్టీ ఆటో 4.14 శాతం, ఫైనాన్షియల్ సర్వీసెస్ 25/50 సూచీ 3.97 శాతం, నిఫ్టీ రియల్టీ 3.52 శాతం చొప్పున లాభపడ్డాయి. ప్రైవేట్ బ్యాంక్, ప్రభుత్వ రంగ బ్యాంక్, ఐటి, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ సూచీలూ పెరిగాయి. నిఫ్టీ మీడియా 0.84 శాతం, కెమికల్స్ 0.63 శాతం నష్టపోయాయి. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్ విషయంలో మరింత సంయమనంతో వ్యవహరించవచ్చన్న అంచనాలు మదుపర్లలో ఆశలు పెంచాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గవచ్చన్న సంకేతాలతో ముడిచమురు ధరలు దిగొచ్చాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 96.04 డాలర్లుగా, అమెరికా డబ్ల్యూటిఐ క్రూడ్ 88.62 డాలర్లుగా నమోదయ్యాయి. ముడిచమురు ధరలు నిలకడగా తగ్గితే భారత్ దిగుమతి వ్యయం, ద్రవ్యోల్బణం, కరెంట్ ఖాతా లోటుపై ఒత్తిడి తగ్గే అవకాశముంది. ఇక భారత్ రూపాయి డాలరుతో చెలామణి బలపడింది. డాలరుతో రూపాయి మారకం విలువలు 94.44గా నిలిచింది. ఎంసిఎక్స్‌లో పసిడి ఫ్యూచర్లు 1.13శాతంపెరిగి రూ.1,44,850కి చేరాయి. డాలర్ విలువ, అమెరికా ట్రెజరీ బాండ్ల రాబడులు తగ్గడం కూడా వర్ధమాన మార్కెట్లకు సానుకూలంగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



అమెరికా ఎన్నికల ఎఫెక్ట్..

రూ. ఏడు లక్షల కోట్లు

పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబయి, నవంబరు 5: అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాలు భారత స్టాక్ మార్కెట్లకు భారీ దీపావళికానుకను అందించాయి. గురువారం ట్రేడింగ్ ప్రారంభ మైన కొన్ని గంటల్లోనే ఇన్వెస్టర్ల సంపద ఏకంగా రూ.7 లక్షల కోట్లకు పైగా పెరిగింది. సానుకూల అంతర్జాతీయ పరిణామాలతో సెన్సెక్స్, నిఫ్టీ రికార్డు లాభా లతో దూసుకుపోయాయి. ఉదయం సెషన్లో సెన్సెక్స్ 1,300 పాయింట్లకు పైగా లాభపడి 78,735 స్థాయికి చేరుకోగా, నిఫ్టీ 24,350 మార్కును దాటింది. ఈ భారీ ర్యాలీకి ప్రధానంగా మూడు కారణాలు దోహదం చేశాయి. అంతర్జాతీయంగా బ్రెంట్ క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా 8 శాతానికి పైగా పడిపోయి బ్యారెల్‌కు 94 డాలర్ల వద్దకు చేరడం మార్కెట్లకు అతిపెద్ద సానుకూలాంశంగా మారింది. ముడి చమురు ధరలు తగ్గడంవల్ల భారత్‌కు దిగుమతులభారంతగ్గి, ద్రవ్యోల్బణం అదుపు లోకి వస్తుందని, తద్వారా కార్పొరేట్ లాభాలు పెరుగుతా యని ఇన్వెస్టర్లు అంచనావేస్తున్నారు.

రూపాయికి బలాన్నిచ్చిన మధ్యంతర ఎన్నికలు

ముంబయి, నవంబరు 5: అంతర్జాతీయంగా నెలకొన్న సానుకూల పరిణామా లతో భారత ఆర్థిక వ్యవస్థకు ఊరట లభించింది. అమెరికా మధ్యంతర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో భారత రూపాయి వరుసగా ఐదోరోజు కూడా లాభఎ ిడింది. అదే సమయంలో ముడి చమురు ధరలు భారీగా పతనమయ్యాయి. నేడు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 29 పైసలు బలపడి 94.35 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. ముందురోజు ముగింపు ధర 94.64గా ఉంటే గురువారం ముగింపు ధర 94.44గా కొనసాగింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు నాలుగో రోజు కూడా తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ బ్యారెల్‌కు 1.42 డాలర్లు తగ్గి 96.04 డాలర్లకు చేరింది. యూఎస్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటిఐ) ధర కూడా 1.47 డాలర్లు పడిపోయి 86.65 డాలర్ల వద్ద నిలిచింది. ఈ వారంలో ఇప్పటివరకు చమురు ధరలు దాదాపు 16శాతం మేర తగ్గడం గమనార్హం. అదేవిధంగా బంగారంధరలుకూడా ఊతం ఇచ్చాయి.

బులియన్ మార్కెట్లకు ధన్‌తేరస్ జోష్

ముంబయి, నవంబరు 5: బంగారం కొనుగోళ్లకు ధన్‌తేరస్ పవిత్రదినంగా భావిస్తున్న తరుణంలో దేశంలో బులియన్ మార్కెట్లలో బంగారం వెండిధరలు ఒక్కసారిగా ఊపందుకున్నాయి. దేశంలో బంగారం ధరలను పరిశీలిస్తే 24 క్యారట్ల గ్రాము ధర రూ.322 పెరిగి రూ.14,602 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.295 పెరిగి రూ.13,385 వద్ద ట్రేడ్ అయింది. అలాగే 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.242 పెరిగి రూ.10,952 వద్ద ట్రేడ్ కావడం గమనార్హం. హైదరాబాద్ నగరంలో నేడు బంగారం ధరలను పరిశీలిస్తే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.3,220 పెరిగి రూ.1,46,020 దగ్గర ట్రేడ్ అయింది. 22 క్యారట్ల బంగారంధర రూ.2,950 పెరిగి రూ.1,33,850వద్ద ఉంటే 18 క్యారట్ల బంగారం ధర రూ.2,420 పెరిగి రూ.1,09,520గా నమోదైంది. చెన్నైలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,46,020 దగ్గర ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.1,33,850 పలికింది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,09,520 గా నమోదైంది. ముంబై నగరంలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.3,220 పెరిగి రూ.1,46,020 దగ్గర ట్రేడ్‌కాగా 22 క్యారట్ల బంగారం ధర రూ.2,950 పెరిగి రూ.1,33,850 పలికింది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.2,420 పెరిగి రూ.1,09,520 గా నమోదైంది. ఇక ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,46,170 దగ్గర కొనసాగితే 22క్యారట్ల బంగారం ధర రూ.1,34,000 పలికింది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.1,09,670 గా నమోదైంది. బెంగళూరు నగరంలో బంగారం ధరల పరంగా 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.3,220 పెరిగి రూ.1,46,020 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.2,950 పెరిగి రూ.1,33,850 పలికింది.

భారత ఎన్నికల సంఘం

ఓటు V.O.T.E

ఈ క్రింది గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలలో మీ ఓటు హక్కును వినియోగించుకోవడానికి నమోదు చేసుకోండి:

మీరు 31.10.2023న లేదా అంతకు ముందు పట్టభద్రులై, ఈ క్రింది జిల్లాల నివాసి అయితే, మీరు సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

మహబూబ్ నగర్-రంగా రెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధి:
మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలు.

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం పరిధి:
వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట (ప్రాక్షికంగా), ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మరియు యాదాద్రి భువనగిరి

- పట్టభద్రుల నియోజకవర్గం ఎలక్టోరల్ రోల్స్: 01 నవంబర్ 2026ను అర్హత తేదీగా సూచిస్తూ ఎలక్టోరల్ రోల్స్ డి-నోవో (తాజా ఓటర్ల) జాబితా తయారీ.
- ఫారం-18 లో వివరాలు నింపి 06 నవంబర్ 2026 వరకు సమర్పించవచ్చు.
- ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ: 25 నవంబర్ 2026
- క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల దరఖాస్తుల స్వీకరణ : 25 నవంబర్ 2026-10 డిసెంబర్ 2026 వరకు
- ఓటర్ల జాబితా తుది ప్రచురణ : 30 డిసెంబర్ 2026



ఆఫ్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్: దరఖాస్తులు ఫారమ్-18లో మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల నియోజక వర్గమునకు ఎలక్టోరల్ నమోదు అధికారి & అదనపు కమీషనర్, GHMC హైదరాబాద్ మరియు వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంనకు ఎలక్టోరల్ నమోదు అధికారి & అదనపు కలెక్టర్, నల్గొండ మరియు సంబంధించిన నోటిఫైడ్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వద్ద స్వీకరించబడతాయి.

ఆన్‌లైన్ నమోదు: దరఖాస్తులు, ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు.

త్వరపడండి నేడే ఆఖరి రోజు

"ఏదైనా స్పష్టీకరణలు మరియు సందేహాల కోసం, దయచేసి సంబంధిత పట్టభద్రుల నియోజక వర్గాల ఎలక్టోరల్ నమోదు అధికారులను మరియు 1950 నెంబరుకి ఫోన్ చేసి సమాచారము పొందవచ్చును.

For further details call 1950 10.30am - 5pm. Toll Free

Follow Us
CEOTelangana | CEOTelangana | CEO_Telangana | ChiefElectoralOfficerTelangana | LinkedIn CEOTelangana | CEOTelangana

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.